# మానస సరోసి

రచయిత

నండూరి రామ కృష్ణమాచార్య

-: ప్రకాశకులు :-

కార్యదర్శి - ఆచార్య ఫణీంద్ర

నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య పీఠం

420 పి.జి. రోడ్డు, జవాహరు నగరు,

సికింద్రాబాదు-500 003

ఫోను : 7817397

# మానస సరోసి

రచయిత

## నండూరి రామ కృష్ణమాచార్య

-: ప్రకాశకులు :-

కార్యదర్శి - ఆచార్య ఫణీంద్ర

నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య పీఠం

420 పి.జి. రోడ్డు, జవాహరు నగరు,

సికింద్రాబాదు-500 003

ఫోను : 7817397

మానస సరసి = **MANASA SARASI**

భాష : తెలుగు = **LANGUAGE : TELUGU**

పద్య కవిత = **POEMS**

రచన : డా॥ నందూరి రామ కృష్ణమాచార్య

**Author : Dr. Nanduri Rama Krishnamacharya**

**First Edition : August, 2002**

వెల రూ॥ **80/- Price Rs. 80/-**

*ప్రచురణ:* డా॥ నందూరి రామ కృష్ణమాచార్య సాహిత్య పీఠం

**Dr. Nanduri Rama Kishnamacharya Sahitya Peetam**

**420** పి.జి. రోడ్డు, జవాహరు నగరు, సికింద్రాబాదు - **500 003,**

ఫోను : **7817397.**

**P.G. Road, Jawahar Nagar, Secunderabad- 500 003.**

**Copies : 1000** ప్రతులు : **1000**

*ముద్రణ* ***Printing***

బాల్‌రెడ్డి ప్రెస్ **Balreddy Press**

**1-4-140,** కళాసి గూడ, సికింద్రాబాదు - **500 003.**

**Kalasiguda, Secunderabad.**

ఫోన్ : **7813343, 6218595**

*కృతిపతి : శ్రీ పెనుమెత్స మురలీకృష్ణంరాజు గారు*

***Patron of the Publication :***

***Sri P. Murali Krishnam Raju garu***

గోపికార్ద్ర హృదయ కూజితాంకూరముల్
కంకణక్వణరణు కింకిణీక,
మంజు మంజుల మృదు మంజీర శింజముల్,
సరస మతుల బ్రోచి సాకుగాత

ఎనుబదేండ్లు దాటె - ఇపుడు నా వయస్సు,
ఇత్తు దీవెనలు గ్రహింపుమయ్య,
అమరు గాత నీకు ఆయురారోగ్యముల్,
తండ్రిగారి మించుత తనయుండు.
సహృదయుడవు నవ్య సామాజికుల లోన
పేర్మి ధర్మనిధిని పెట్టినావు;
గుండె పండినట్టి గొప్ప దాతవు నీవు;
సాహితీ జగాన సహృదయుడవు !

మామ-సూరయ కవి ప్రేమ నందితి వీవు
అతని గుండెకాయవైతి నీవు;
తండ్రి రక్తమందు దానవీరము పారు;
పావనమ్ము నీదు జీవితమ్ము;
తండ్రిగారు చూడ దానకర్ణుడు నేడు;
సూరయ కవి-మామ-సూత్రధారి;
గృహము కట్టినావు కృతిని బోలెడి దాని,
కృతిని గొనుము మురళి కృష్ణరాజ

- నండూరి రామ కృష్ణమాచార్య

# కృతిపతి మురలీకృష్ణం రాజు తండ్రి
# శ్రీ పెనుమెత్స వేంకటేశ్వర రాజుగారి జీవిత విశేషములు

1. జననం : 14-5-1941 ఖాజీపాలెం
2. తల్లిదండ్రులు : పెనుమెత్స నర్సరాజు, సత్యమ్మ
3. విద్యాభ్యాసం : 1 నుండి 5 వరకు, ప్రాథమిక పాఠశాల, ఖాజీపాలెం.
   I ఫారం నుండి S.S.L.C. వరకు క్షత్రియబోర్డు హైస్కూలు, పిట్టలవాని పాలెం
   P.U.C. హిందూకళాశాల, మచిలీపట్టణం.
4. వివాహము : 1-5-1959
5. ధర్మపత్ని : శ్రీమతి యశోద
6. సంతానము : కుమారులు
   పెనుమెత్స మురలీకృష్ణంరాజు, ఎం.కాం.

   భార్య శ్రీమతి వాసుదేవ వర్మ బి.ఇ.
   శ్రీమతి అనిత (ఎం.ఎస్.సి.)

   కుమార్తె : మంతెన విజయలక్ష్మి

   మంతెన రాజేంద్రవర్మ ఎమ్.ఏ. (ఎస్.డబ్ల్యూ) ఎమ్ ఫిల్
   హైదరాబాదు నివాసము, వ్యాపార నిర్వహణ.
7. వృత్తి : 1964 నుండి 96 వరకు వ్యవసాయముతో పాటు
   రైస్‌మిల్ వ్యాపారము.

నిజాయితితో కూడిన ఆదర్శవంతమైన వ్యాపారముతో అందరి మన్ననలు పొందిన సౌమ్యులు
తోటి వ్యాపారస్థులతో సంఘంలో అపారమైన పరపతిసే సంపదగా సమకూర్చుకొన్న ధన్యజీవి.

8. సేవా నిరతి

1. స్థానిక జూనియర్ కాలేజి పాలక వర్గము ఉపాధ్యక్షులు

2. "వికాస తరంగిణి" ఆధ్యాత్మిక వికాస కేంద్రం పిట్టలవాని పాలెం శాఖ అధ్యక్షులు

3. 2000 ఆగస్టు 15న స్థాపించిన పిట్టలవాని పాలెం ఆత్మానంద వృద్ధాశ్రమం అధ్యక్షులు

4. 2001 లో స్థాపించిన దేవీ మురలీ కృష్ణంరాజు ఛారిటబుల్ ట్రస్టు మెంబరు.

5. ఖాజీపాలెం డిగ్రీ కళాశాల పాలకవర్గ సభ్యులు

పిట్టలపాలెం దాని పరిసరాలప్రాంతాలలో జరుగే ధార్మిక కార్యకలాపాలకు, సేవా కార్యక్రమాలకు ఆర్థిక సహాయము మరియు నిర్మాణాత్మక సహకారము అందించుట.

పేరు కోస మెపుడు పెనుగులాడడు తాను
గుప్త దాన మొసగు గొప్ప వ్యక్తి;
అతని వర్తనంబు ఆడంబరము లేక
కూర్చిపెట్టు చుండు క్రొత్త శోభ.

వయసులోన పిన్న వ్యవహారమున మిన్న;
మురళి కృష్ణ రాజా అరయ ఘనుడు,
అనతి కాల మందె ఆర్జించి ధన మెంతొ
మేరు శిఖరి వోలె మెరయుచుండె.

మా కుమార్తె 'దేవి' మహనీయమైత్రిలో
అంద గలవు కీర్తి నద్భుతముగ;
ఆమె సేవ లోన ఆ చంద్ర తరళమై
నిలిచి యుండు గాక నీ యశస్సు.

తనయ లిద్దరితో మీరు తనివి జెంద
పరిమితంబయ్యె సంసార బాధ్యతలును;
చిన్న సంసార మెంతయో యున్నతంబు
సకల సౌఖ్యములందెడి సాధనంబు

కోటి రూకలు వెచ్చించి కోర్కి దీర
కట్టు కున్నారు గృహమును కాంక్ష మీర;
మంచి సుముహూర్త మందున అంచితముగ
చేరి యుండిరి గృహములో క్షేమముగను

నాగ ఫణి శర్మ దీవించినారు మిమ్ము
పూజ్య జియ్యరు స్వామి మీ పుణ్య కేతన
మంగళా శాసనంబుల మాన్య మూర్తి
అందజేసిరి ఆనంద మయ్యె మురళి.

వచ్చిరి మా గురుదేవులు
ఇచ్చిరి గా దీవెనలను ఇంపుదళిర్పన్
వచ్చిన పెద్దలు నిచ్చిరి
నచ్చిన సొంపైన రీతి నాశీర్వచనల్

ఆశీర్వాదములందు కొమ్మిపుడు అత్యంతానురాగంబుతో
ఆశల్ పండెడి రీతి నీకిడుదు అన్యోన్యానురాగంబుతో
కాశీనాథుని దీవెనల్ గొనుము కాంక్షన్, సర్వసౌఖ్యాలతో
వాశింగాంచుము కీర్తి గౌరవములన్ వర్ధిల్లి దేవీకృపన్

అంకిత మందినావు గద అద్భుత కావ్యము కీర్తి నొందగన్
సొంతము మీర వ్రాసియిడే పూజ్యులు, సత్కవి రామకృష్ణులే
వంకయు లేని కావ్యమిది, వర్ధిల్లు మింకను పేరు గాంచి భా
వాంకితమైన సత్కవిత, మాన్య చరిత్రుడ వౌచు నింకపై

# మంతెన వేంకట సూర్య నారాయణ రాజు
# -: గురుదేవులు నండూరి వారికి నమస్కారం :-

ఆచార్యోత్తమ అద్వితీయ ప్రతిభా ధౌరేయ ప్రజ్ఞానిధీ !
మీ చాతుర్యము సర్వతోముఖమునై మిన్నంటె తేజోనిధీ,
మీ చేతంబున గలుగ భావములు బ్రాహ్మీదత్త వైభోగమే !
ఆచార్యా ! కొనుడింక వందనములన్ త్రైలోక్యవాచస్పతీ.

ఇరులక్షల్ సమకూర్చినాను తమ సాహిత్యపు పీఠంబుకున్
తరుగే లేదిక నచ్చువేయుటకు ఏతత్కావ్య సంపత్తికిన్,
స్థిరమై మీదగు పీఠ మీయిలను సాక్షీభూతమై నిల్చుమున్,
ధరణిన్ మీ ప్రతిభావిశేషము మహాధారార్భటి జెందుచున్

ఏ మహనీయు దివ్యకమనీయ కవితా సుధారసంబుతో
నామది నిండి పోయినదొ ఆ మహనీయుని రామకృష్ణునిన్
నా మదిలో తలంచెదను నా గురువంచును, ఎల్లవేళలన్
నీమము వీడకుండగను నిత్యము సల్పెద పూజ మీకునై

# కృతజ్ఞత

## అయ్యగారి వెంకట్రామయ్య

ఆర్య భవద్విశిష్ట పరమాద్భుత పద్యము హ్పార్యమైమహా
శ్చర్యము గూర్చె సత్సభం, చక్కగ నే వినిపింప, కావ్య సౌం
దర్యముగల్గు మీదు కవితా ఝుని గొప్పది. రామకృష్ణమా
చార్య కవీంద్ర వెల్గుము దిశావలయంబుల మేలు బంతిపై !

## అయ్యగారి వెంకట్రామయ్య

నండూరి రామకృష్ణమాచార్య వ్రాసిన పద్యాలు 'వేయి'
పుస్తకాపేక్ష లేకుండ – కంఠస్థ కవితాగానం
సాహిత్య సభలలో చేయుచున్నారు.
ఆయన ధారణాశక్తి అత్యద్భుతం

డాక్టరు ప్రసాదు కవిగారు కూడ
పద్యాకవధాన సభలలో నండూరి వారి పద్యాలు అవర్ణతంగా
పఠించుచున్నారు. వాణిజ్య శాస్త్రంలో డాక్టరేటు పట్ట భద్రుడు.
ప్రసాద్ కవి గురువుగారైన నండూరి వారికి ఒక కావ్యం అంకితం చేశారు.

## జయం

నాగరికుడు కాడు నాయకుండును కాడు ;
బ్రదుకు నందు తొందరపడువాడు !
తల్లి-జయమునకు నిదానమే సర్వదా;
జనకు డెవడు ? సతత సహన నిష్ఠ.

## కవిత

ఎన్నియో సమస్య లున్న, లోకము లోన,
గాఢ నిద్ర మెలువు కాదు రాదు,
కనులు మూత పడును గాఢ నిద్రయు వచ్చు,
మొదలు పెట్టి కవిత చదువ చాలు

## వింత వెలుగు చీకటి

అస్తమించె సూర్యు డపర దిక్కున యందు ;
తోచె చందమామ తూర్పు దెసను ;
విశ్వ మెల్ల వింత వెలుగు చీకటి ప్రాకి,
చక్ర నేము లట్లు సంభ్రమించు.

## అహం

కడగి మ్రింగివేయు కాలమ్ము సర్వమ్ము ;
చంద్ర రవి చలన మశాశ్వతమ్ము ;
సృష్టి యందు లేదు చిరజీవ మేదైన
హాస్య మేది ? కలదు?? అహము కంటె?

## సూక్ష్మ వేత్త

ఏక లయ నిబద్ధ మీ సృష్టి సర్వమ్ము
సకల వివిధ భూత సంచయమ్ము ;
ఆ సమన్వయ లయ కైక్య సంధాతమై ;
శ్రుతిని కలుపు నెడద సూక్ష్మవేత్త.

కవి

అనుభవించు సచ్చిదానంద యోగమ్ము ;
అనుభవైక వేద్య మా శ్రుతి లయ ;
విశ్వ గోళ లాస్య విన్యాస గానమ్ము ;
సుకవి - సృష్టి తత్త్వ సూక్ష్మవేత్త.

వ్యయ రీతి

కూడబెట్ట ధనము - గొప్ప సామర్థ్యమే ;
శీల సూచి వ్యయము చేయు రీతి;
ప్రగతి దోహదములు ప్రతిభా పురస్కృతుల్
దాన ధర్మ నిధుల స్థావరములు.

సేవ

అభ్యుదయము నందు వ్యాపార దృష్టితో;
నరుడు కొంతవరకె ధరణి యందు ;
లేదు బ్రదుకు - కొన్ని ఆదర్శములు లేక;
సంఘ సేవ కొంత సలుప కుండ.

సిద్ధాంతి

బుద్ధిమంతుడైన సిద్ధాంతి గ్రహియించు ;
వసుధ మీది వాస్తవాల నెన్ని ;
ఆచరణము నందు అనువదించిన గాని
విలువ లేదు సూత్రములకు నెపుడు.

హార్మోనియం

అల విశేష ముండె హార్మోనియము మీద ;
సరస రేడియో ప్రసార సరళి ;
సంత గోల చేరె, జంత్ర వాద్యాలలో,
అదరిపోవ చెవులు చెదర హృదులు

### సేవ

మమత నైన - దివ్య మహిమాన్వితము చేసి,
మనిషి-సేవ క్రింద మలచ వచ్చు ;
జగతి హితము మార్చి ప్రగతి బాటలు తీర్చి,
సేవ మనుజు చేయు శ్రేష్ఠ తమును.

### మొదటి తప్పు

తప్పు మొదటిసారి దండింప సరికాదు;
మనిషి వర్తనమ్ము మారవచ్చు;
జరుగు నెడల తప్పు మరల రెండవ సారి;
ధర్మమగును చూపె దండనీతి.

### ధర్మధేనువు

ధరణి మీద నిలుచు ధర్మధేనువు నేడు,
ఒంటి కాలిపైన ఓర్పు తోడ,
ఇది కలి యుగ మిపుడు బ్రదుకుచుంటిమి గదా;
కొంచమైన మేలు మంచితనము.

### పదవి

కనులు కాన లేని ఇనుప సంకెళ్లతో
నగము మనిషి కుందు సంఘ మందు;
పదవి యున్న యెడల పసిడి సంకెళ్లతో
పేత్త గూడ కట్టి వేయబడును.

### జగన్మాత

పడతి- పిల్ల లున్న యెడల తల్లియె గదా,
లేని యెడల లోటు లేదు వేరు;
తేజరిల్ల వచ్చు తా జగన్మాతయై;
విశ్వ జనుల మీద ప్రేమ చూపి.

ఇతివృత్తం

కోరుకొందు నేను గొప్ప గాథను గూడ,
పద్య శిల్ప సౌష్ఠవమ్ము గాక,'
రెండు ఉన్న గాని గుండె నిండదు నాకు !
హర్మ్య పంక్తు లేల అక్షరాల ?

మనసు

విశ్వ సృష్టి యందు - వింత లందున వింత,
మనుజు మనసు - గొప్ప మహిమ గలది !
అఖిల విద్యలకును ఆది కారణ మౌను,
మనసె మనుజు బ్రదుకు మలచ గలదు.

పెండ్లి

అడవి లోని ఉసిరి - కడలి గూర్చెడి ఉప్పు ;
మేళవించి నూత్న మిథున మగును ;
అంతరంగికమగు అద్వైత సిద్ధియై,
ఉండవలయు సముచితోత్సవమ్ము.

భక్తి

కంచుకమ్ము-భక్తి -కారాదు బ్రదుకులో;
కవచ మగుట మేలు కానబడక ;
పాడు గొంతు కంటె - పనిచేయు హస్తమే ;
ప్రగతి కలుగఁజేయు జగతి లోన.

రాళ్లపల్లి

పలుకు లందు తోచు సెలయేటి తళతళల్;
తలపు లందు మించు తాండవములు;
రాళ్లపల్లి వారి రచన చాతురి చూడ,
స్ఫటిక వజ్ర తరళ పరమితము.

## ధ్యానం

ధ్యాన నిష్ఠ యనిన - జ్ఞానమ్ము పై మెట్టు
ధ్యాన మనిన కడలి జ్ఞానమునది
తనను తాను తెలిసికొనుటయే ధ్యానమ్ము ;
మొదలు తుదయు జ్ఞానమునకు కలదు.

## కృషి

ప్రతిభ - మొదలు పెట్ట వచ్చు - తేకువ తోడ,
గొప్ప పనులు ఏర్చి కూర్చి కొన్ని ;
జగతి లోన పనులు - శ్రమ లేక కృషి లేక,
పూర్తి కావు జయము పొంద లేవు.

## నీతి

తళుకు పూత పసిడి జిలుగు వెల్గులు హెచ్చు,
కానరాని మాయ కలి యుగమ్ము
ఇంక చేయ వలయు వృద్ధోపసేవయే,
నీతి గ్రంధపఠన నేర్పు లేదు.

## బ్రదుకు

క్రీడ సలుప రాదు - ఆడ సింగమ్ముతో,
ఎంత తెలివి యున్న - గుంత నక్క;
చెలిమి సముల తోడ - చేసి నప్పుడు గాని,
రక్తి కట్ట బోదు బ్రదుకు తరచు.

## విద్య

హేతు రహిత మమత లెన్నియో ఎన్నియో
కూడి యుండు మనుజు గుండె లోన,
విద్య వలన చిద్వివేక విన్యాసముల్,
పెరుగు గాక మమత తరుగు గాక.

### జ్ఞానోదయము

మానవులకు కాదు జ్ఞానోదయము - ముందె;
సులువు పిదప వచ్చు తెలివి తరచు;
ముందు తెలిసి కొనిన ముప్పు - వాడె - జ్ఞాని !
అతడె ఋషి కవీశు డతడె వేత్త.

### ఋషి

తెల్ల జుట్టు చాలు - తెల్ల గడ్డము మేలు;
కావి తరము లేని ఘనత తెచ్చు,
మించు చూపు చాలు - మిత భాషణము చాలు,
ఋషి మనీషి యంచు ఎంచ బడును.

### భాషావరాగం

పండితోత్తముండు రెండు భాషలు నేర్వ,
ఇరువురు మనుజులకు ఎంచ సముడు,
వేత్త లందు వేత్త - వివిధ భాషా వేత్త,
పర పరాగ సంధి - ప్రగతి కాత్మ.

### కన్నె

తెలివి - అనుభవమ్ము వలన - వచ్చును గదా ,
ఎదురు దెబ్బ తగులు, బ్రదుకు లోన,
కన్నె - మొట్ట మొదట కాంక్షించు యువరాజు;
పిదప పెండ్లియాడు పేద వాని

### ధనం

ధనము పృథివి లోన - కొన లేని దేదయా ?
గడును మించు కన్నె పిడుగు గాని,
గాయక వరు గాని - కవి దిగ్గజము గాని,
గుండె లేని అగ్గి కొండ గాని.

### పద్యం

సహజ శక్తి గాని - సంఖ్యా బలము కాదు;
పద్య రచన యందు ప్రతిభ మేలు ;
మేలి పద్య మొకటి కాలాని కెదురీది
ఉర్వి లోన బ్రదికి యున్న చాలు.

### కవిత

సూక్ష్మ దర్శన పటు సుషమా నిదిధ్యాస,
గొప్ప కవిత హృదికి కూర్పుకలదు ;
చాటు పద్య కవిత - సచ్చిదానందమే !
రస విరాట్టు - నృత్య రంగశాల.

### శిష్యుడు

స్వేచ్ఛ తోడ-గొప్ప శిష్యు డాలోచించు,
గురుని నీడ శిష్య వరుడు - కాడు,
గురువు తోక చివర గోమారు కాలేడు,
శిష్య శేఖరుండు - చిన్మయుండు.

### తెలుగు పద్యం

గుండె నిండి వదలకుండు - నెత్తావితో,
తేట తీపి ప్రేమ్పు తెచ్చి తరచు;
గాన బిందు కళల కంఠస్థమై యుండి
తెలుగు పద్య కవిత తేజరిల్లు.

### వాసి

విలువ గట్టు టందు వీక్షింపవలె సదా
వాసి గూడ మేటి రాశి గాక ;
హృద్యమైన మంచి పద్య మొక్కటి చాలు,
కొండ వంటి పేడ కుప్ప ఏల ?

అప్పు

అది ఒక లలిత కళ - అప్పు చేయుట యన్న,
తెలివి లేని చవట తీర్చ వచ్చు;
అప్పు లివ్వరాదు ఆశించి వడ్డీని;
అనుభవించు కొరకు వ్యయము మేలు.

ప్రతిభ

పగటి కాగడాలు - ప్రజ్వరిల్లగ లేవు;
రాత్రి చిరుత ప్రమిద రక్తి కట్టు,
ప్రతిభ దేశ కాల పాత్రాభిరామమై,
పేరు కెక్క వచ్చు పేర్మి మీర.

త్రికరణ శుద్ధి

మనసు - వాక్కు - కర్మ మనిషి యెట్టుల తీర్చు ?
మనసు అనుసరించు మనుజు ప్రకృతి,
మాటలాడ వచ్చు మనిషి న్యాయము బట్టి,
చేయు పనులు సంప్రదాయ సరణి.

విధి భేధాలు

మాయదారి మనుజ మాత్ర నిర్మితములా;
విధి నిషేధములకు విలువ లేదు,
శాశ్వతాలు కావు సాంఘికాచారముల్;
కావు పాతకాలు కావు కావు.

మెచ్చికోలు

తెలుపు - మెచ్చికోలు తల యూపి ప్రౌఢుండు
చిందు మందహాస శీకరములు;
అరచు - లేచి - నిల్చి - చరచు వే చప్పట్లు
ఆడు - మూఢ జడుడు పాడు - మెచ్చి.

## విశ్వనరుడు

మాన్యు డెవడు ? విశ్వ మానవైక కుటుంబి;
జగతిలో అజాత శాత్రవుండు !
గుండె నిండ - కరుణ - పండించు కొను వ్యక్తి;
పుడమి మారు పేరు భూత దయకు.

## దానం

దాన మన - అభిమత ధన వస్తు మాత్రమా ?
భవ్య తృప్తి నిచ్చు దివ్య దీక్ష,
ఆంతరంగిక మగు ఆర్ద్ర పూజాసక్తి ;
త్యాగ యోగ భోగ రాగ రక్తి.

## యౌవనోదయము

యౌవనోదయమ్ము అర్ధ భాగము మించు;
ఆడ పిల్ల లందు అంద మనిన,
వయసు తీర్చ గలదు వంక లెన్నిటి నైన,
జయము గాంచు సతము జవ్వనమ్ము.

## కవిత కొరకె

కలరు కలి యుగాన కవి వేషధారులా,
గడుసు పిండములు జగత్తు లోన,
గుండె పండి నట్టి గొప్పవారలు గూడ,
కలరు బ్రదుకు వారు కవిత కొరకె.
సమయము గతియించె - సంభాషణల కింక,
చర్చ గిర్చ వద్దు - సంధి వద్దు,
శరణ మొకటె - వీర మరణమో! విజయమో!
పెదవి కాక కరము కదలు గాత.

### ప్రేమ

అసలు ప్రేమ అనిన - అసమగ్ర వాక్యమే
హావ గర్భితమ్ము - భావ హేలి;
మాట లనవసరము - మౌనమే - మధురమ్ము !
నయన యుగళి ప్రేమ నాట్య మాడు.

### కుక్క

కుక్క కుండు ప్రేమ - గొప్ప విశ్వాసమ్ము !
మానవ హృదు లందు - కాన రాదు !
గొప్ప వింత కూర్చు కుక్క విశ్వాసమ్ము;
ప్రకృతి శక్తి కానరాని మహిమ.

### సృష్టి

సృష్టి లోని సకల శిల్ప విన్యాసమున్,
ఎరుగ - మర్త్య మేధ తరము గాదు,
స్రష్టి వాక్కు పలుకు - భరత వాక్యము పాడు;
భక్తి వినయ యోగ భావుకుండు.

### మనసు

మనసు పంప వచ్చు - కనరాని కెరటాలు !
మనసు మహిమ హెచ్చు మందు కంటె,
మనసు మహిమ గూడ మందు లోపల చేరు !
అమృత రసమయ మగు ఆ చికిత్స.

### అడుగు జాడలు

విడువ వలెను మనుజు డడుగు జాడలు కొన్ని;
పుడమి మీద చచ్చి పోవు ముందు;
పట్టి వచ్చు గుర్తు భావి కాలము నందు
బ్రదుకు వెలుగు వెదకు బాటసారి.

### ఓట్లు

చిత్త శుద్ధి - తోడ - చేయ వచ్చును సేవ;
కుంభ వృష్టి ఓట్లు కురియ బోవు;
కలుగ గొప్ప నమ్మకమ్ము నాయకునిపై;
ఉప్పెన వలె వచ్చు ఓట్ల వరద.

### క్లోనింగు

కూర్చవచ్చు నేడు క్లోనింగు యోగమ్ము !
జంతు మనుజ వృక్ష సంతతులకు;
వసుధ సాగిపోవు వర్ధిష్ణు వాంఛతో
శ్రోత్రియత్వమునకు చోటు లేదు.

### అలతి నుడులు

ఒక్క ప్రౌఢ రచన - వ్యుత్పత్తి మాత్రమే,
గొప్ప కవిత యంచు చెప్పరాదు.
నాట్యమాడు నగటు నరుల నాల్కల పైన,
అలతి అలతి నుడుల తెలుగు కవిత.

### భార్య

భరత దేశ మందు పురుష పారమ్యమ్ము
సంఘ నీతి యాచు సాగి వచ్చె;
భారతీయ భార్య - స్వచ్ఛంద దాసియై;
చేయు భర్త గారి సేవ తరము.

### గ్రంథావిష్కరణ

పూని జరుప నేల ? పుస్తకావిష్కృతుల్;
మరు దినమ్మె ప్రజలు మరువ గలరు,
అసలు కష్ట తరము అచ్చువేయుట యన్న;
గ్రంథ మమ్మ టన్న కష్టతమము.

### కుక్కలు

కుక్క లరవ వచ్చు - ప్రక్క ప్రక్కల చేరి,
ఏన్గు రాజ వీధి నేగు నపుడు.
చుప్పనాతి జనము - గొప్ప వారిని చూచి,
వెక్కిరింపు విసము కక్క వచ్చు.

### పద్య కవిత

వసుధ మోసు లెత్తు వ్యామోహములు కొన్ని,
జంట కవుల మీద సాగె - మోజు ;
అప్పుడపుడు పెరుగు అవధానముల మోజు,
కగ్గ దెపుడు పద్య కవిత మోజు.

### ఆంగికం

ఆంగికమ్ము కూడ - వ్యవహార సరళిలో
వాక్కునకు సహాయ పడుట కద్దు ;
కన్ను - చేయి భ్రుకుటి - కదుపుచుండును కదా,
మాటలాడు నపుడు - మానవుండు.

### సగటు మనిషి

ఇల మహానుభావు లెందరో యెందరో !
అందరకు మదీయ వందనములు;
గొప్పదనము పైకి గోచరింపదు సదా;
ప్రగతి గరిమ నాభి - సగటు మనిషి.

### ధర్మ సూక్ష్మ వేత్త

చెడుగు మంచి యంచు స్థిరనిర్ణయమ్ములన్;
చేయ తరము గాదు - జీవితమున,
ధర్మ సూక్ష్మ తత్త్వ తాత్పర్య విజ్ఞాత;
వసుధ లోన కానవచ్చు టరుదు.

### నిందారోపణ

నింద మోపి నపుడు నీ మీద కసి తోడ,
చేరి కొంత మంది చెడ్డవారు,
బదులు చెప్పరాదు వాగ్దాటితో నీవు;
మెదప నపుడు పెదవి - మేలు కలుగు.

### కవిత

కవిత నాకు జీవ కైవల్య యోగమే !
రమ్య భవ్య దివ్య రస నిషద్య,
ద్వంద్వ బద్ధ మైన వసుమతీ స్థలినుండి,
నను మరో ప్రపంచమునకు చేర్చు.

### హేతువాది

అతడు హేతువాద మంగీకరింపడే !
ఏల అతని తోడ - ఇంక చర్చ ?
మనిషి మరణ మొంద - మందు వేయగ నేల ?
మౌన మరయ ఉత్తమమ్ము సుమ్ము.

### మూఢత్వం

జ్ఞాన మొసగ నేర దానంద యోగమ్ము,
ధైర్య సాహసములు దర్ప గతిమ;
ముగ్ధ మోహనమ్ము - మూఢత్వ విశ్రాంతి
గొప్ప విజయములను కూర్చ గలదు.

### విద్య

విద్య - వివిధ విషయ విన్యస్తమే కదా
విద్య ఎల్ల లెల్ల విస్తృతములు;
పరిమితమ్ము కాదు పాఠశాలకు విద్య,
విశ్వతోముఖమ్ము విద్య పరిధి.

### త్యాగయోగం

ఆడదాని బ్రదుకె అన్యాయమై పోయె;
పూర్వ చరిత లోన పుడమి మీద,
సహగమనము బ్రదుకు సాధ్వీ మతల్లిదే;
త్యాగ యోగ మేది ? తల్లి ప్రేమ.

### గడును మాటలు

మనిషి యందు మంచి మనసున్న చాలదా ?
మాయదారి గడును మాట లేల ?
శక్తి లేని వారు సత్క్రియాసక్తితో;
బ్రదుకు గడుపు నట్టి వారు కలరు.

### యాదృచ్ఛికాలు

అరసి చిరు ఘటనల యాదృచ్ఛికము లంచు,
కొట్టి వేయ రాదు గుండె నుండి,
అందు అద్భుత లయ లమృత గాన లహరుల్,
తాళ రాగ జతులు తాండవించు.

### సంగీతం

తాళ లయలు శ్రుతులు తప్పకుండగ చేరి
రాగ భావ గతులు రంగరించి ;
జంత్ర వాద్య బృంద సహకార మందింత్రు,
భాష తెలియ నట్టి వారు గూడ.

### ఆర్తత్రాణము

తరచు మంచి పనులు తలవంచు కొని పొంచి,
బ్రదుకు లోన చేయ వలసి వచ్చు,
అహము విడిచి పెట్టి - స్వార్థమ్ము విడనాడి
ఆదరించ వచ్చు ఆర్త జనుల.

### ముసలి తనం

తీసిపోయె నాకు దేహదార్ఢ్యము నేడు
మనసు లోన ముసలి తనము లేదు ;
వ్రాయు చుంటి కవిత ప్రగతి ధోరణి తోడ,
పాత బడను నేను వయసు మళ్లి.

### క్షమ

సాటివారి పైన - క్షమ చూపు మనుజుండు
భగవ దాప్త కృపకు పాత్రు డగును,
ఉత్తమ తమ మేది ? ఉపకార బుద్ధియే !
పావనమ్ము ఇంక జీవితమ్ము

### కవిత

నాకు తెలుసు తరచు నాకు వచ్చెడి పిచ్చి;
ప్రజలు దాని నెపుడు వ్యాధి అనరు;
దాని పేరు - కవిత - జ్ఞానవేషము వేయు;
పూజ లందు కొనును పుడమి లోన.

### సత్యవిద్య

మేలి చీర గట్టి - మిరుమిట్లు కన్పించు
పడతి - మించు బోడి - పద్య విద్య;
పసిడి మిసిమి మీరు పల్లకీలను సాగు;
పద్య రాజ పుత్రి పౌరయాత్ర.

### ఆత్మానురక్తి

ఆత్మ నిష్ఠ మైన - అనురక్తి- ప్రజలలో
గోచరింప వచ్చు కొంత వరకు,
అతిశయించి తోచు ఆ జబ్బు కవులలో,
వినెడివారు తరచు విసుగు జెంద.

సానుభూతి

ఎదుటి వాని కష్ట మెరుగ జాలని వాడు ;
గొప్ప వాడు కాడు - క్రూర పశువు ;
ఉండవలెను గుండె పాండిత్యమున కేమి?
చాలు సానుభూతి సహృదయతలు.

కవులు

సభల లోన స్తుతులు సమకాల సత్కృతుల్
బ్రదుకు లోన నమ్మరాని భ్రమలు !
పొగడు గాత భావి యుగ యుగాంతరజనుల్,
ప్రతిభ యున్న కవుల రచన లెన్ని.

స్వామి

ధన్య తము డెవండు ? దాసుండు మాత్రమే;
ఉడయవరులు సూత్ర సూక్తి నుడివె;
వైష్ణవుండు తుదకు స్వామిగా పేరొందె !
రమ్య హాసలోల రామకృష్ణ.

మందు

మనసు మీద ముందు పనిచేయు వైద్యమ్ము
మనసు దేహము పయి మహిమ గలది;
మహిత వైద్య మనిన - మందు మాత్రమె గాదు;
మనసు కలియు గాక మందు తోడ.

గొప్పవారు

మెదడు - వేల్పు విల్లు మిరుమిట్లు వెదజల్లు
నడచు నపుడు మట్టి అడుగు లదరు,
గొప్పవారి లోన కూడు వ్యత్యాసముల్ !
వేత్త హృదికి కొంత వెగటు గొలుపు.

## పావనత

పావనతయె మిన్న - ప్రజ్ఞ అన్నిటి కన్న;
చదువు ధనము పదవి మెదడు కంటె,
దయను మించి పాత్ర దానము మించి;
ధర్మ మేది కలదు ? ధరణి లోన.

## స్వీయ కవిత

ఉండు కవిత కీర్తి కండూతి కొండంత;
సభల స్వీయ కవిత చదువ రాదు ;
బ్రదుకు కన్వయించి ప్రతిభ లే గుర్తించి,
చదువ వచ్చు గాక సహృదయుండు.

## ధనం

మనిషి అనిన-వట్టి ధన కాంక్షయే కాదు,
దురద మనసు లోన దూర వచ్చు ,
ఉండ వచ్చు కొంత ఉపకార హృదయమ్ము
మనిషి చేయ వచ్చు మంచి పనులు.

## చెట్లు

మబ్బు లందు మణగు మార్తాండు గుర్తించు ;
ధరణి లోన పుట్టి పెరుగు చెట్లు ;
మింటి మీద నుండి మెరయు మార్తాండుండు ;
కురియు చుండ వాన ధరణి మీద.

## కవిత

కవిత అనిన పసిడి గండ పెండేరమా ?
కనక కంకణమ్ము కాదు కవిత ;
చదువ మరల మరల హృదిలోన పురి విప్పి ;
వెల్లి విరియు వేల్పు విల్లు - కవిత.

### పదవి

తేలి పోవ వచ్చు గాలిలో జ్ఞానమ్ము
ప్రతిభ శక్తి కట్టు పదవి వలన,
కలియ పెద్ద పదవి తెలివి తేటల తోడ ;
ప్రగతి పొంగువారు జగతి యందు.

### కాంక్ష

గాత్ర గాయకునిగ - కాంచ గోరితి కీర్తి;
నాడు గడిచె మిగిలె నేడు రేపు;
వీణ నగుదు నేడు-బృంద వాద్యము లందు;
తంబుర శ్రుతి పాత్ర దాల్తు రేపు.

### ముక్తకం

ఏకపద్య ఝటితి లోక సంగ్రహా నిష్ణ ;
ఆధునిక యుగమున కంతరాత్మ ;
ఖండకావ్యములకు కాల దోషము పట్టె ;
ముక్తకముల యుగము మోసు లెత్తె.

### పాటలు

ప్రజల యెడద లూపు గిజిగాని గూళ్ళలా;
పాట లమరు - నృత్య నాటికలకు;
కమ్మ తెమ్మెర నును కౌగిలింతల లోన,
సిగ్గు పడెడి కన్నె మొగ్గ లట్లు.

### స్వగతం

అంతరించి పోయె అన్ని చింతలు నాకు ;
స్వీయ సుఖము పైన చింత లేదు ;
నాకు చింత లేదు నా కుటుంబము మీద,
మిగిలె మమత కవిత మీద కొంత.

స్వగతం

తెలుగు పండితునిగ - త్రిదశుండ నైనాడ,
వెరసి పుస్తకాల పురుగు నైతి ;
వ్రాసి నాను పెక్కు గ్రంథాలు కావ్యాలు
వచ్చె నెనుబ దేండ్ల వయసు నాకు.

స్వగతం

నా హృదిని కలదొక నందనోద్యానమ్ము !
పూలు వేల కొలది పూచి ఆడు !
నేను మేను మరచి నెత్తావి మత్తులో!
కవిత లల్ల గలను కలలు గాంచి.

స్వగతం

వదల లేదు నొప్పి - కదల కున్నవి కాళ్లు,
వేరు చోటి కెట్లు వెడల గలను ?
కవిత వ్రాయ గలను - కలము చేతిని త్రిప్పి,
తరుగ లేదు మెదడు చురుకుదనము.

వేమన

వింగడించి ఆట వెలది ఛందము నందు,
పలుకు బడుల యందు తలపు లందు,
వేమన కవి చేసె - విశ్వతోముఖ సేవ,
అతని భుజము నెక్కి అభిలషింతు.
కూర్చె వేమన కవి - క్రొత్త ఆహార్యమ్ము ;
అంద మొలికి ఆడె - ఆటవెలది ;
క్రొన్నన నెర తావి వెన్నెలల్ - వెదజల్లి ;
స్వేచ్ఛ ఆటవెలది జీవనాడి.

ఆట వెలది యన్న - యావదాంధ్రమునందు ;
వేమన కవి పేరు వినగ నౌను ;
ఆ పునాది పైన - హర్మ్య రేఖలు గట్ట;
ఉత్సహింతు శక్తియున్న కొలది.

అలతి అలతి తేట తెలుగు మాటల తోడ,
సులువు గాదు ఆట వెలది వ్రాయ;
బరువు తక్కువ మరి బలము హెచ్చుగ నుండు,
మణుల మలచ వలయు మందిరములు.

లలిత కళలు

గోచరించు సొగసు కొండ కోనల లోన,
వాగు లందు చంద్రవంక లోన,
లలిత కళల సుషమ ప్రకృతి సౌందర్యమ్ము
కడుగు గుండె పొరల కలుషములను.

సానుభూతి

గులక రాళ్ల పైన - సెలయేటి అలలెల్ల,
కమ్మ తెమ్మెరలను - కలిసి ఆడె;
మత్తు గొలుప పూల నెత్తావి హృదినెల్ల;
పయన మాపి నిలిచె బాటసారి.

సృష్టి

కవియు ఆలు మగలు - కలుగు సంతానమ్ము,
విత్తనమ్ము పెద్ద వృక్ష మగును;
గణిత బద్ధమైన - క్రమవికాసము తోడ,
సృష్టి యెల్ల గాథ చిన్మయమ్ము.

### చావు

అవని లోన పెక్కు వ్యత్యాసముల్ తోచు,
చదువు మెదడు ధనము పదవు లందు,
చావు - సామ్యవాద చండ శాసన రాజ్ఞి,
అరయ అప్రతిహత మామె మహిమ.

### యోగాభ్యాసం

అభ్యుదయ మటన్న ఆరోగ్య భాగ్యమే !
వాహనాలు ధనము పదవి కావు ;
అరయ యోగవిద్య ఆరోగ్యమును కూర్చు,
బాల్య మందె నేర్వ వచ్చు సులువు.

### ప్రతిభ

''అవును'' పలుకు నటుడె యైన వేయి విధాల,
వ్రాత లోన ఏక రీతి - నుండు ;
నటుని ప్రతిభ గూడ - నవనవోన్మేషమ్ము ;
కవినె - తలప రాదు ఘను డటంచు.

### కేంద్రం

అఖిల విద్యలకును - ఆరాధ్య కేంద్రమ్ము,
తరచ - నరుడె యగును - గరిమ నాభి,
మానవ స్వభావ  మర్మ సూక్ష్మము లెల్ల,
తెలియు గాత లలిత కళలు మతము.

### ధర్మం

తరము గా దెవరికి - ధర్మ సూక్ష్మము నెన్న
ధర్మ కర్మ మేది ? ధరణి మీద ?
స్వార్థ రహిత మైన చర్య ధర్మము సుమ్ము,
పరమ పాప కర్మ - స్వార్థ నిరతి.

మతం

మానవులకు కలదు మత మొక్కటే - సదా!
నిజము నరయ నాడు నేడు నొకటె
పృథివి వెల్లి విరిసె పెక్కు వ్యాఖ్యానముల్
అర్థ వాద రూప హాస్య కథలు.

ధనం

ఎంత కీర్తి యున్న ఏమి లాభము లేదు ;
ధనము లేని యెడల పనులు కావు ;
ఆర్థికమ్ముగా స్వయం పోషకము గాక,
బాగు పడునె ? ఏ వ్యవస్థ యైన ?

హాస్యం

ముఖము మీది మేలి ముసుగు వే తొలగించి,
చూపు చతుర హాస్య సూత్రధారి ;
సమ్య గనుభవమ్ము - సత్య దర్శనముతో,
సపది ముక్తి చెందు సహృదయుండు.

కవిత

మనుజు కుండవచ్చు - మంచి సంకల్పముల్;
కాదు - కవితయే జగద్ధితమ్ము ;
లాభ మేమి ? తుదకు శాక్యమ్ము లేకున్న ?
మేటి పనులు చేయు మెదడు మేలు.

నిద్ర

లేదు నిదుర కంటె లేదు - భూలోకాన
అమృత మంజు మంజులానుభవము;
సర్వతోముఖ మగు సామ్యవాదము చెల్లు;
ప్రభు వరుండు పేదవాడు సముడు.

## యోగి

మేన దివ్య సచ్చిదానంద సంక్రాంతి,
అనుభవించు యోగి అవని యందు,
అతని దర్శనమ్మె అమృత కైవల్యమ్ము,
వెలుగు లెడద లందు వెల్లివిరియు.

## ప్రఖ్యాతి

అరయ వేరు - గగన హర్మ్య సౌందర్యమ్ము,
విచ్చు విరుల సొగసు - వేరు వేరు;
సృష్టి లీల వేరు - కృతక ప్రతిభ వేరు!
చిన్మయత్వ మేది ? శిల్ప మందు ?

## ప్రకృతి

అచట కల దొక పది అంతస్థుల భవంతి,
ఆకసమ్ము నొరసి అలరు చుండు,
ముందు కలవు పూల మొక్క లెంతర పెక్కు;
విచ్చు విరులు గొప్ప వింత గొలుపు.

## ధర్మ నిర్వచనం

శౌచ దాన దయలు సత్య మస్తేయమ్ము,
అతిశయించు ఇంద్రియాల అదుపు ;
దయ యహింస శాంతి తపము నీ దశకమ్ము
ధర్మ మనగ పరగు ధరణి లోన.

## ప్రథమం

జన్మ - ప్రథమ మేది ? సౌఖ్య సంతోషమే ;
స్థల మదేది ? మనుజ సంఘమె సుమ ;
సమయ మేది ? ఇంక - ఇప్పుడే - ఈనాడె !
ఉభయ తారకము - పరోప కృతియె.

బాల్యం

పరమ పావన దశ బాల్యమ్ము బ్రదుకులో,
యావనోదయ మన ఆపద సుమ ;
తరచు పెరిగి పోవు - అరిషడ్ గుణము లెల్ల ?
నరుల లోన వయసు పెరుగు కొలది.

సంగీతం

గుండె దున్ని పంట పండించు గానమ్ము,
మేటి విద్య లెల్ల మెదడు పెంచు;
క్షాళనమ్ము చేయు సంగీత మాత్మనే,
వెల్లి విరియు అమృత వృష్టి నింపి.

ఆత్మ నిష్ఠ మైన - అవహేళనము కొంత,
అవసరమ్ము - మనిషి కష్టం డపుడు ;
జ్ఞాని - కోరుకొనును - మానస స్నానమ్ము
దుర్గుణాలు కొన్ని తొలగ వచ్చు.

వంకర

వేరు నరక మేది ? నైరాశ్య హృది తప్ప ?
నరక నాకములకు ధరయె నెలవు ;
స్వర్గ మనిన ఏమి ? సంతృప్త హృదయమే !
రమ్య హాస లీల ! రామకృష్ణ.

నాగరికత

బట్ట కట్టు కొనక - బయలు దేరరు - జనుల్,
మనిషి కప్పి పుచ్చు మనసు గూడ;
మసలు మానవుండు - ముసుగు దొంతర దాల్చి;
నాగరికత - కృతక నటన హేల.

### ప్రకృతి

అబ్బురమ్ము గొలుప దజ్ఞాన తిమిరమ్ము
అరయ ప్రకృతి అద్భుతావహమ్ము;
సృష్టి వింత లరయు జిజ్ఞాస లేనిచో,
జంతు సముడు నరుడు జగతి యందు.

### అవగాహన

కూడ బెట్ట వచ్చు - కొండంత జ్ఞానమ్ము,
చదివి చదివి మనిషి శ్రమను సలిపి ;
అబ్బకున్న యెడల - అవగాహనము సుంత,
ఇసుక రేణు వంత - ఏమి ఫలము ?

### సహనం

మనిషి కూర్చు కొనును తన అభీష్టము మేర
జీవితమ్ము లోన స్నేహితులను,
ఇరుగు పొరుగు వారి నెట్లెన్ను కొనగల్గు ?
సహన శీలమె అవసరము సుమ్ము.

### అనుప్రాస

వీను దోయి - భాషలో ననుప్రాసమ్ము
ఊయెల వలె తలపు లూప గలదు,
జోల కొట్ట గలదు - లాలించి బుజ్జగించి,
నిదుర మత్తు హాయి హృదికి గూర్చి.

### అంతరాత్మ

అంతరాత్మ లేక అవనిలో ఉండునా ?
మనుజ జన్మ మెత్తి మసలు వాడు ?
మానవునకు తెలియు మంచి చెడ్డ లటన్న;
చెప్ప డతడు స్వార్థ చింత వలన.

### లతలు

కొన్ని లతలు ప్రాకు కుడి వైపు సదా
దివ్య భవ్య యోగ దృష్టి గలిగి !
నెట్ట గలవు ముట్టి - వృక్ష ఆధారముల్;
వెలుగు బాట వెంట వెడల గలవు.

### సుకవి

సుకవి - భువికి దిగిన - ఒక దేవదూతయే !
జగతి నుద్ధరించు - ప్రగతి శీలి;
కవి సమాజ మందు - నవనవోన్మేషమ్ము
వెల్లి విరియ జేయు వెలుగు జిలుగు.

### ఆశయాలు

అహము కట్టు కొనును ఆశయమ్ముల గూడు,
నేడు రేపు పేర పాడు చేయు;
ఆశయ వ్రత మన్న ఆత్మార్పణ రిరంస !
శలభ మాధ్య సార సంగ్రహమ్ము.

### భజన

జ్ఞాన మివ్వ లేదు గాని - గానమె ఇచ్చు ;
మానసికము - శాంతి - మానవులకు ;
పాలు పంచు కొనిన - భజన - మాత్రమె చాలు,
దివ్య శాంతి భువికి దింప గలదు.

### మేడ

మాత - మాతృ భాష = మాతృ దేశము పైన,
భక్తి చూప బ్రదుకు రక్తి కట్టు;
ప్రగతి బాట కవ్వి ప్రథమ సోపానముల్,
మేడ నెక్కి వచ్చు మేటి వ్యక్తి.

ఆధారం

ప్రాకు తాడు గట్టి - పైకి చిక్కుడు మొక్క;
అరయ వచ్చు దిన దినాభి వృద్ధి;
అభ్యుదయము చెందు ఆధార మున్నచో;
శక్తి గట్టి మనిషి బ్రదుకు అట్లె.

నాగరికత

అరయ - నాగరికత ఆభాస దీప్తినే
వెల్లి విరియఁ జేయు విశ్వ మందు ;
సహృదయుండు తరచి సత్యమ్ము దర్శించు;
మనసు లోన నవ్వు కొనును తరచు.

కాలం

నాలుగవ కొలతయె కాలమ్ము జగతిలో !
స్థితి గతులకు విలువ తీర్చిదిద్దు,
జయము కూర్చు ఉచిత సమయ సంధానమ్ము ;
వ్యర్థ మగు అకాల యత్న గరిమ.

మానవత

మానవత్వ ముడిగి - మన సమాజము నేడు
క్రుల్లి పోయి కంపు గొట్టు నిజము;
కులము మతము లాస్తి మాసి పోయిన గాని,
భరత దేశ మింక బాగుపడదు.

కులం

కులము జులుము ధనము జులుము తగ్గిన గాని,
భరత దేశమునకు ప్రగతి రాదు,
ప్రతిభ గౌరవింప బడుత - సంఘము నందు,
అంతరించు గాక ఆస్తి హక్కు.

వీడుకోలు

వీడుకోలు నిడుట - విధ్యుక్త ధర్మమ్ము,
అస్తమించు రవికి - అపర సంధ్య ;
స్వాగ తార్ఘ్య పాద్య మర్పించి గిడుగిల్ల
హృదిని కొలువ దగును ఉదయభాను.

త్యాగం

తేజరిల్లఁ జేయు - దివ్యత్వ దీధితుల్,
కదిపి లేపి త్యాగ గరిమ - ప్రజల ;
పూజనీయులైరి - బుద్ధుండు - రాముండు
త్యాగ యోగ తరల ధర్మ దీక్ష.

చిరు కవితలు కొన్ని - స్థిర చిరంజీవముల్ ,
పుడమి మీద తరము పుట్టు చుండు;
సులభ సూక్త ముక్త - సుషమా విశేషముల్;
నాట్య మాడు ప్రజల నాల్క లందు.

కవిత

అరయ - చిచ్చు బుద్ధి - అవ్వాయి చువ్వయా ?
కవిత - ధాము ధాము - రవము కాదు ;
చందమామ చిందు - చలువ వెన్నెల వెల్లి,
మనసు లోని స్థిర సమాధి కవిత.

జాలి గుండె

మనిషి - మనిషి కాదు - మానవత్వము లేక,
చదువు మెదడు ధనము పదవు లున్న ;
సానుభూతి చాలు - జాలి గుండియ చాలు;
ఎంచి చూడ చాలు - మంచితనము.

## విప్లవం

ఫ్రెంచి విప్లవము ప్రపంచమ్మునే ఊపె,
నరికి సార్వభౌము శిరము గూడ,
ప్రజకు నవ్వు లేదు - రక్త పాతము హింస ;
విఫలమయ్యె తుదకు విప్లవమ్ము.

## గురువు

ఎంచ ఉత్తమ గురువు ఎవ్వండు జగతిలో ?
బ్రదుకు లోని అనుభవమ్మె సుమ్ము;
మొదటనే పరీక్ష - పిదప బోధన సేయు;
జ్ఞాన ఖని ప్రయోగశాల సుమ్ము.

## మరగుజ్జు వృక్షాలు

అరయ - బోను సాయి మరగుజ్జు వృక్షాల
జలదరించె - గుండె - చాల సార్లు ;
సృష్టి మర్మములను ఛేదించు ప్రజ్ఞతో
ఎక్కు గాత - నరుడు పెక్కు మెట్లు.

## మూఢుడు

జన మనోహర మని - తన ఉపన్యాసమ్ము
వగల మారి వెధవ పొగడ వచ్చు ;
వాని మాట నమ్మువాడు - మూఢాత్ముండు,
మూఢు సహము తరము మోసపుచ్చు.

## నర్సు వృత్తి

అధికమైన దేది ? అన్ని వృత్తులలోన;
పృథివి లోన - నర్సు వృత్తి సుమ్ము;
పూని చేయు టన్న - దీన మానవ సేవ ;
పడయు నవ్వు ఇహము పరము గూడ.

### కవిత

మేలు - పాల మీద మీగడే సర్వథా,
పాలు మేలు నీళ్ల పాల కంటె,
కవిత యందు గూడ - గడ్డ మీగడ మేలు,
వద్దు గాలి ధూళి పట్టే చెత్త.

### మెదడు

మెదడు లోని అలలు చదలలో పయనించి,
దూర సహృదయు దరి చేర వచ్చు,
అంద చేయ వచ్చు బృంద సంకేతముల్,
తెలియ లేము మెదడు అలల నేడు.

### స్వగతం

నాకు కీర్తి వచ్చె - నా యోగ్యతను మించి,
చదువు ధనము పెద్ద పదవి వచ్చె;
గొప్పవారు కలరు గుర్తింపు లేకుండ,
వారి చూచి సిగ్గు పడెద నేను.

### స్వగతం

ప్రీతి కలదు నేతి పెసరట్లపై - నాకు
తెలుగు కవిత పైన - తేనె పైన,
చిత్త శుద్ధి పెట్టు చీవాట్లపై గూడ,
మంచి వాని తేట మాట పైన.

### శిష్యులు

శిష్య వరులు కలరు చిన్మయాత్ములు - నాకు;
స్వేచ్ఛ కలిగి నట్టి స్వచ్ఛ కవులు
బ్రదుకు లోన వారు నాకు నీడలు కారు,
గురువు కంటె మిగుల గొప్పవారు.

స్వగతం

సన్యసించి నాను - సంసార బంధాలు
సాహితీ తపస్సు సలుప గోరి ;
పద్య కవిత వ్రాసి - పద్యోరస సమాధి,
కడగి - సహృదయులకు - కలుగ జేయ.

స్వగతం

బ్రదుకు లోన తరము భగవన్మహిమ సక్తి,
అనుభవించి నట్టి వ్యక్తి నేను,
మానసమున పడసినాను - జీవన్ముక్తి,
నేను నాస్తికుడను కాను కాను.

తెలుగు వెలుగు

కవన విశ్వ మేలు నవరత్న మకుటమ్ము,
తూర్పు - దెసల తెలుగు తల్లి - వెలుగు,
మిసి మిసి మన చేరు రస సహస్రారమ్ము
దేశ భాష లందు తెలుగు లెస్స.

నిలువుటద్దాల మేడ

అన్ని సరిహద్దులను దాటి పోయితి నేను,
దిగ్దిగంత భిక్షుకుడనై తిరిగినాను;
తరచినాడ ప్రగతి వాద తర్క వార్ధి;
నిలువుటద్దాల మేడ నా తెలుగు కవిత.

సులభ శైలి

ఋషి మనీష గూర్చి - ఋజు జీవిత చరిత్ర
సంగమించు సులభ శైలి తోడ,
బ్రదికియున్న తెలుగు భాషలో వ్రాయుచో
ప్రాణ నాడి - అదు - ప్రగతి తోచు.

స్వగతం

తెలుగు పద్య విద్య వెలుగొందఁ జేయగా ;
సభలు దీక్ష తోడ జరిపి నాడ ;
నేను బ్రదుక గలను - నిష్కామ యోగినై ;
ఉర్వి మీద ఆయు వున్న వరకు.

కవి పాత్ర

మమత లేవి నాకు మనసు నందున లేవు !
గొప్ప పాత్ర నేది కోర లేదు ,
జీవితమ్ము లోన సిద్ధింప కవిపాత్ర ;
వాసి గాంచు నట్లు వేసినాను.

స్వగతం

బ్రదుకు తోడ తరచు రాజీ పడితి నేను,
కోరినాను - ఎదుటి వారి మెప్పు ;
నోరు విప్ప లేదు - క్రూరత్వమును గాంచి,
మమత యుండి గూడ మంచి మీద.

అతని నిర్యాణం

హాని - దేశమునకు - అతని నిర్యాణమ్ము !
అంత కంటె నాకు హాని కలిగె ;
కానుపించ దింక - గగనాన ధ్రువ తార
లోక మెల్ల నాకు చీక టయ్యె.

పూల దండ

కోరి పూల దండ కొరకె - సర్వస్వమ్ము
పణము బెట్టినాను బ్రదుకు లోన;
మెడను పూలదండ పడక వారము చాలు;
గడవ - చుట్టు ముట్టె నెడద బెంగ.

## మనుజ పార్లమెంటు

వంద సంవత్సరాలు ముందు పుట్టితి నేను,
కవిత లెపుడు భావి కాలికులకె ;
వచ్చి తీరు నెపుడొ మనుజైక రాజ్యమ్ము ;
మేటి మనుజ పార్ల మెంటు తోడ.

## నిశ్చయాలు

జీవితమున నాకు లే వభిప్రాయముల్;
ఉండ వచ్చు నాకు ఊహ లెన్నొ;
నేను తరచు మార్చినాను నా యోజనల్;
లేవు నిశ్చయమ్ము లేవి నాకు.

## మౌనం

ఎనుబ దేండ్లు వచ్చె - ఏను మూఢుడ నంచు
నిక్కువముగ నాకు నేడు తెలిసె ;
మౌన నియమ నిష్ఠ - మంద బుద్ధికి మేలు ;
నేను చేసినాను - నీతి బోధ.

## మంచితనము

మేటి గౌరవమ్ము - మేధావిపై లేదు ;
పెద్ద పదవి పైన పేర్మి లేదు ;
కలదు - ధనికు పైన - కార్పణ్యమే - నాకు,
మంచితనము గౌరవించ గలను.

## నా లోపాలు

నా రచనము లందు - నా యందు లోపాలు
హితుల కంటె నాకె హెచ్చు తెలుసు,
మంచి పనుల నెన్నొ - మనసార భావించి
చేయ నట్టి వ్యర్థ జీవి నేను.

### పద్య కవిత

పాత క్రొత్త కలిపి చైతన్య విస్ఫూర్తి,
సులభ సరళ సరస సూత్ర ఫణితి,
చేసినా నమభవ సిద్ధమౌ భాష్యముల్ ;
తెలుగు పద్య కవిత తీర్చి దిద్ది.

### వంతెన

ఏను బ్రదుక లేను - ఏరుగా బాటగా ;
బ్రదుక దలతు నొక్క వంతెన నయి ;
నలుప దలతు సంధి - సామరస్యము గూర్చి,
బ్రదుకు నందు భిన్న వాదములకు.

### స్వగతం

బ్రదుకు తోడ నేను రాజీ పడిన వాడ,
లేదు విధి నిషేధ మేది నాకు ;
బ్రదుకు గాత ఎదుటి వారు నిర్భయముగా,
బ్రదుకు కొరకె నేను బ్రదుక గలను.

### కవిత

అచ్చమైన కవిత అచ్చు వేయక ముందె,
నాట్య మాడు ప్రజల నాల్క లందు,
ఘన కవనము తరచు గ్రంథాలయాలలో
గాఢ నిద్ర వోవు కనులు మూసి.

### స్వప్నాలు

వచ్చుచుండు నాకు స్వప్నాలు నిదురలో ;
లలిత కళల తళుకు బెళుకు కలిసి,
చిత్ర లేఖనములు శిల్పాలు కన్పించు ?
అమృత గాన కవిత లవఘళించి.

స్వగతం

జ్ఞాన యోగ మన్న - సందేహ వికటమే ;
దైవ భక్తి లేదు జీవితమున,
కష్ట తరము సుమ్మ - కర్మ మార్గము సదా,
మూఢ జడుడ నాకు ముక్తి లేదు.

ఏకైక లయ

మనుజు క్రియలు వేరు - మనసు యోజన వేరు !
వేరు బ్రదుకు తెరువు తీరు వేరు,
హృదియు మెదడు కలియ ఏకైక లయ తోడ,
ధన్య మగును బ్రదుకు - ధరణి మీద.

శబ్ద కాలుష్యం

కలుగ జేయు శబ్ద కాలుష్య మద దంతి,
మానసమున కాన రాని హాని;
కనులు చెవులు మెదడు కాంక్షించు విశ్రాంతి,
నిద్ర కంటె - ధ్యాన నిద్ర మేలు.

శ్రద్ధ

ప్రతిభ తోడ కూడి పాండిత్య మున్నచో;
కవికి గూర్చు నంఘ గౌరవమ్ము;
ఉన్న యెడల శ్రద్ధ - వ్యుత్పత్తి క్రమముగా,
సుకవి పెంచు కొనుట సులువు ప్రతిభ.

మతం

ఎంచి చూడ - మతము - హేతువాదము కాదు;
కాదు - మత మటన్న - కర్మ కాండ !
అనుభవైకవేద్య మధ్యాత్మ యోగమే !!
మతము కంతరాత్మ మనిషి బ్రదుక.

### విపరీత వ్యాఖ్యలు

తలచువారు కలరు - దాన మిచ్చుట గూడ,
రోగ మంచు - దురద భాగ మంచు,
విశ్వ మందు వెలయు విపరీత భాష్యాలు !
మంచి చెడు గటంచు ఎంచ వచ్చు.

### యుగళ మేళనం

వెలుగు చుండు - బల్బు - విద్యుత్తు ప్రవహింప,
ఋణము ధనము శక్తి రెండు కలియ,
లయము సృష్టి అభ్యుదయ మౌను సర్వమున్
యుగళ మేళనమ్ము ప్రగతి సిద్ధి.

### స్త్రీ పురుషులు

స్త్రీ పురుషుల మధ్య - శృంగార మొక్కటే,
సహజ బంధ మనుట సబబు కాదు ;
స్త్రీ పురుషులు చేరి - స్నేహ భావము తోడ,
సహకరింప వచ్చు సంఘమందు.

### దురదలు

దురద లెవియొ కొన్ని దూరియుండుట కద్దు,
మనిషి మనసు పొరల మాటు లందు ;
పనులు కొన్ని - మనిషి - ధన కాంక్ష లేకుండ,
దురద తీర్చు కొనుట కొరకె చేయు.

### మోసం

శఃసడింప రాదు - మోస పోయిన వాని,
సానుభూతి వీడి చవట యంచు,
ఎదుటి మాట నమ్ము - హృదయమ్ము గలవాడు ;
పురుగు పట్టి నట్టి పూవు లుండు.

ఆరోగ్యసూత్రాలు

అందజేయ వచ్చు - ఆరోగ్య సూత్రముల్,
తరచి ప్రకృతి యోగ దర్శనమ్ము;
మాన్ప లేదు వ్యాధి - మందు నిశ్చయముగా
చూడ దగును జబ్బు సోక కుండ.

ఉద్రేకం

ఉన్న యెడల గుండె ఉద్రేక పూర్ణమై,
అవఘళింప జేయు అద్భుతములు !
గళము నరుకు కొనును గండ కత్తెర తోడ,
సంహరించు వంద శాత్రవులను.

ధనం - పదవి

పదవి - ధనము పేదవారి ఆకర్షించు,
అగ్ని - శలభ తతుల నట్లు తరచు ;
పేదవారి పిల్చి పిప్పి చేయును గదా ;
ధనము పదవి తరచు ధరణి లోన.

గొడుగు

గోచరించ నట్టి - గొడుగు లుండును కొన్ని,
నాడు - రాజ లాంఛనమ్ము - గొడుగు ;
కానరాని గొడుగు - కాపాడి ఈనాడు
వ్యక్తి కిచ్చు సంఘ బలము కొంత.

కార్యశూరుడు

ఉండు - వెదక వలయు - ఒకచోట గానమ్ము,
ఉండ వచ్చు కవిత ఒక్క చోట,
కావలసిన వెల్ల - కన్పింప వొక చోట,
కార్య శూరు డన్ని కలుపు గాత.

తూకం

మానవులకు - తిండి - మంచిదే మంచిదే !
అరయ - తక్కు వైన - నరక సమము ;
కూర్చు ప్రాణ హాని కొంత ఎక్కువ యైన,
లోక సంగ్రహమున తూక మాత్మ.

సంఖ్యాబలం

ఇప్పు డేది బలము ? - ఇది ప్రజా స్వామ్యమ్ము ;
సంఖ్య కిపుడు గొప్ప శక్తి - వచ్చె ;
శాంబరీ సమష్టి సంఖ్యా బలము కూర్చు,
నేత యెక్కు నింగి నిచ్చె నలను.

ఆటలు

వెల వెల వెల బోవు - విద్యార్థి తెలివెల్ల
వేడుక మెయి ఆట లాడ కున్న;
నిజము తాండవించు - నిమ్నోన్నతాలలో,
గ్రంథజాల మందు - కాదు కాదు.

రచన

రచన లోన - కానరాని దారము వోలె,
పదము పదము కూర్చు ఫణితి యుండు;
అది రచయిత సొంత ఆత్మీయతాముద్ర,
సంతకమ్ము దాటు శైలి గూడ ;

జ్యోతి

చిన్మయత్వ సిద్ధి - స్వీయానుభూతియే !
గ్రంథ పఠన వలన రాదు రాదు ;
గుడులు గోపురాలు గురుదేవులును వద్దు ;
తనకు తానె జ్యోతి - మనుజు డగుత.

బొంకు

పోరు పలుపు తరము బొంకు సత్యము తోడ,
జయము గాంచ దొక్క సారి గూడ,
అరయ - పలుపు బొంకు లన్యోన్య యుద్ధాలు !
సంకుల రణ మందు చావ గలపు.

ఆత్మ

ఋషి - మనీషి - జ్ఞాన ఋజు శీలి వేదాంతి,
ఆచి తూచి చాటె - ఆత్మ ఉనికి,
మంచి పనులు చేయ మానవత్వము చూప
ఆత్మ చర్చ ఎవరి కడ్డు పడదు.

ఏడ్పు

ఏడ్పు అనిన నాకు - ఇష్ట మేదియు లేదు,
నాకు - కూర్మి పేర్మి - నవ్వు మీద,
కలదు - ఏడ్పు మీద గౌరవాదర బుద్ధి,
కంటి నీరు రాదు - కరుణ లేక.

మోసం

నమ్మి కొంత మంది - నష్ట పోవుట కద్దు,
వయసు మళ్లి - శిశు హృదయము కలిగి,
తుదకు మోసగాని బ్రదుకు రాణించునా ?
కుళ్లి పోయి కంపు గొట్టి - కుములు..

త్రికరణ శుద్ధి

త్రికరణ పరిశుద్ధి తేలికే ! బ్రదుకులో!
మనిషి తెలిసి దిద్దు కొనుట - చర్య ;
పంచవచ్చు ఈ ప్రపంచమ్ములో - ప్రేమ ;
ద్వేష - భావములను విడిచి వేసి.

### మానవుడు

భాష కలదు జంతు పక్షి సంతతి లోన !
అతిశయించు ఇంద్రియములు గలవు;
పుడమి మీద బ్రదుకు భూత జాలము నందు;
మిన్న మానవుండు మెదడు లోన.

### నేత

నేత కుండ వచ్చు - నీతీ నిజాయితీ,
ఎట్లు నెగ్గ గలుగు - ఎన్నికలల ?
ధనము లేక డాబు దర్పాలు లేకున్న,
కురియు టెట్లు ఓట్ల కుంభ వృష్టి.

### ప్రశ్న

గురువు కాను - నాది పరిమిత జ్ఞానమ్ము,
వెట్టి ప్రశ్న లెన్నొ వేయ గలదు;
ఎరుగ కున్న నేమి ఏ సమాధానముల్ ?
జ్ఞాన మివ్వ గలదు - చాలు - ప్రశ్న.

### అపరిచితుడు

నేను గడిపి నాడ - నీ సన్నిధిని చేరి,
క్రొత్తవాడ నగుచు కొంత సేపు ;
అందినాడ పిదప - అతిథి సత్కారముల్ ;
కడకు మిత్రుడ నయి వెడలినాడ.

### నిజం

భాష ఉండు అర్థవాద రూపము నందె,
అర్థము సరిపోవ దక్షరాల ;
అసలు సత్య మనిన ఆహార్యమున దాగు,
నిజ మటన్న వేరు నీడ - వేరు.

### కొలతలు

ఆడు కొనును మనిషి మూడు కొల్తల తోడ,
వేల కొలత లున్న విశ్వ మందు,
దేశ కాల పాత్ర దిక్ ప్రమాణము లెల్ల,
సూక్ష్మ దృష్టి యున్న చూడ వచ్చు.

### మంచితనం

అనుభవైక వేద్య మైనదే ప్రజకెల్ల ;
మంచితనము నిర్వచించ లేము ;
నాస్తికుందు గాని ఆస్తి కుండే గాని ;
పెంచుకొనుట మేలు మంచితనము.

### కంటి నీరు

చూడవలెను - పారిశుద్ధ్య నైర్మల్యమ్ము,
ముందు అంతరంగ మందు - మనిషి ;
కంటి నీరు - కవిత - కడిగి వేయును గుండె,
కరుణ - అమృత రసము కురియ గలదు.

### గీటురాయి

ఆదరింప వచ్చు - ఔదార్యమును చూపి,
ఓడినట్టి వాని ఉత్తముందు,
రక్తి కట్ట జేయు - బ్రదుకు - ఔదార్యమే !
మేటి శీలమునకు - గీటురాయి.

### సామరస్యం

సంగమించు గాత - శాస్త్ర విజ్ఞానమ్ము
మతము - తత్త్వచింత - బ్రదుకు లందు,
విద్య - అనిన - ఆ త్రివేణీ సమాగమే ;
సామరస్య సూక్ష్మ సంధి - శాంతి.

### అమ్మ

అర్థ శాస్త్ర పరిధి కంద రానిది - అమ్మ
ధరణి మిథ్య కాదు - అమ్మ ప్రేమ !
సృష్టి లోన మాతృ హృది యున్న దను మాట;
మార్క్సు శంకరుండు మరచినారు.

### అనుభవం

వినదగు జ్ఞానులు చెప్పిన
వినదగు జాగ్రత్తగ వయోవృద్ధులు చెప్పన్ ;
ధనమును చదువులు పదవులు
అనుభవమునకు సరికావు యావజ్జగతిన్.

### జ్వరం

మురికి - కిలుము - బూజు నరశరీరము లందు,
పేరుకొనును కానుపించకుండ !
కాల్చివేయు రక్త కాలుష్యముల నెల్ల,
నర శరీరమునకు వరము - జ్వరము.

### నాదబిందు కళలు

వ్యంగ్య వైభవమ్ము - వాచ్యార్థముల దాటు;
శబ్ద పరిధి పెరిగి చదల దాటు;
చిందులాడు ధ్వనులు ఛందస్సునే దాటి,
కవన నాద బిందు కళలు దాటి.

### ముసలి పక్షులు

పట్టరాదు ముసలి పక్షి గుంపుల నెల్ల ,
ఊక విసరి పొంచి యుండి - మనిషి ;
ముదురు తెలివి తేట లెదిరి పక్షము నందు,
ఊహ మేర మీరి ఉండవచ్చు.

కంటనీరు

కంట నీరు పెట్టి - కరుణార్ద్ర హృది తోడ
ఎవడు వయసు మళ్లి - ఏడ్వగలడు ?
ప్రక్కవారి మరచి బహిరంగముగ ఏడ్చు ,
అతడొక మహర్షి - అమృత హృదుడు.

బాల్యహృది

చింది కంటి నీరు - చిన్నారి శిశువులే,
వేగ ఏడ్వ గలరు - వెక్కి వెక్కి,
బాల్య హృదయమున్న బహిరంగముగ ఏడ్చు ;
వయసు మళ్లి నట్టి వాడు గూడ.

స్వేచ్ఛ

ప్రగతి కవసరమ్ము - క్రమ శిక్షణము కొంత;
స్వేచ్ఛ ఆర్థికాభివృద్ధి - వణము;
నగటు మానవుండు - సంఘ జీవితములో,
తెలియ లేడు స్వేచ్ఛ విలువ తరచు.

స్వేచ్ఛ

స్వేచ్ఛ కోరువాడు జీవితాంగణములో,
స్వేచ్ఛ నివ్వవలయు ఇతరులకును;
బ్రదుకు - రంగు రంగు పడుగు పేకల నేత,
బ్రదుక నిమ్ము పరుల బ్రదుక నిచ్చి.

అధినరుడు

అభిలషింతు - ఐహికాధ్యాత్మికము మధ్య,
ప్రగతి యోగ సేతు బంధనమ్ము;
మార్పు చెందు గాక - మనుజ స్వభావమ్ము
అవతరించు గాక - అధినరుండు.

### కావ్యం

అంతరించి పోవు ఆహార మానాడె,
మనుజు పొట్ట చేరి మాయ మగును
అంతరించనుండ అంతరంగము చేరి,
కావ్య మిచ్చు నట్టి క్రాంతి - క్రాలు.

### సామ్యవాదం

ఒకట నీటి కడవ - ఒకట రాతిని గూర్చి,
కావడి నిడి తూగి కదలు నొకడు ;
అది విమూఢ జనుల న్యాయ పర్యాయమ్ము ;
సామ్యవాద విహిత సరలి కాదు.

### గురుడు

ఎదిగి నట్టి వాని కెవడు బుద్ధిని చెప్పు ?
కాదు తల్లి భార్య - కారు సుతులు ,
చెప్ప వచ్చు గురుడు చెప్ప వచ్చును తండ్రి ;
పీను లొగ్గి అతడు వినిన యెడల.

### ప్రతిభ

నేల మీది వాస్తవాల యెల్లలు దాటి,
ఎగుర గలదు స్వప్నహేల తరచు,
తోలు కన్నుదోయి స్థూల దృష్టికి హద్దు,
కవి వరేణ్య ప్రతిభ - క్రాంతదర్శి.

### అసలు హేతువు

అవసరమ్ము చరిత అవగాహనమ్ముకై,
ఏ సమస్య కైన హేతువుండు ;
దాచి వేయవచ్చు తరచు ఆహార్యమ్ము,
కాన రావు మూల కారణములు.

### ఆరోగ్యం

చదువు ధనము మెదడు - బ్రదుకులో వ్యర్థమే,
మేలు రాజు కంటె - కూలి మనిషి !
అగ్ర గణ్య మేది ? ఆరోగ్య భాగ్యమే !
నరుడు చేయు గాక - విరత తపస్సు.

### వచన కవిత

ప్రతిభ యెంత యున్న కృతకత్వ మొక కొంత
పద్య విద్య యందు పరిఢవిల్లు ;
వెలుగు వెల్లి విరిసి తొలి ఉషస్సుల వోలె,
కానుపించు వచన కవిత లోన.

### మార్పు

శాశ్వతమ్ము మార్పు - సహజసిద్ధము మార్పు,
అరయ విశ్వ చరిత కంతరాత్మ ;
నిత్య నూతనమ్ము - నిత్య సత్యము మార్పు ;
సృష్టి శిల్పమునకు - జీవ నాడి.

### సత్యం

ఎంచి చూడ సత్య మేకైక ముఖి కాదు !
తోలు కనులు చూడ జాలవు గద ;
భూమి మీద - తరచు - కామ రూపము దాల్చి ,
ప్రజల కనుల ముందు నిజము నిలుచు.

### తెలుగు

కలుగ - జేయ గలవు - కవిత - సంగీతమ్ము,
విలువ కట్ట లేని వెలుగు తలుకు,
వెలుగు దూర గలదు విశ్వ మంతటి లోన,
అరలు దాటి మనసు పొరలు దూరి.

సహనం

జీవితమ్ము కోరు - వైవిధ్య సహనమే
సహన గుణ సమృద్ధి - సంస్కృతి యన,
సహన గుణము గలిగి - సహజీవనము సల్పు,
ఉర్వి లోన ఉత్తమోత్తముండు.

జాగృతి

మంచివారు నిదుర మైకమ్ములో నుండ,
దుండగీండ్లు - ఇండ్లు దోచ వచ్చు;
నిర్విరామ నిత్య నిర్నిద్ర జాగృతుల్;
ఆత్మరక్ష కొరకు - అవసరమ్ము.

ఆరోగ్య విద్య

విద్య లందు మేటి - వైద్యమే బ్రదుకులో !
శుద్ధ భాగ్య సూక్ష్మ సూత్ర రచన ;
ఔషధాల కంటె - ఆరోగ్య విద్యయే,
జీవితమ్ము నందు శ్రేష్ఠ తమము.

భావయుక్తి

చచ్చు పుచ్చు పద్య సంధానమున కంటె
సరస వచన రచన చాల మేలు ;
సాహితీ కళ యన - ఛందస్సు మాత్రమా ?
ఎంచి చూడ భావయుక్తి కూడ.

పని

మనిషి ఉన్న యెడల - పనిలో నిమగ్నుడై
దిగులు చీకు చింత వగలు మరచు,
బాధ లెల్ల బాపు పరమౌషధం బేది ?
పనియె పనియె పనియె బ్రదుకు లోన.

కారయిత్రి

భావయిత్రి యున్నవారు కో కొల్లలే !
కారయిత్రి లేక కవియె కాడు ;
ఊహ లుండ వచ్చు-వ్యుత్పత్తి లేకున్న
గొప్ప కావ్య రచన కూర్చ లేడు.

కవిత

సాహితీ రచనము - ఛందస్సు మాత్రమా ?
కవిత - వ్యాకరణము కాదు కాదు;
పలుకు రస యుతమ్ము వాక్య మొక్కటి కైత;
అక్షరము రసయుత మైన కవిత.

స్వచ్ఛంద సంస్థలు

సహజ సరళ శాంతి - సహకార సంక్రాంతి
మధురమైన ఐకమత్య బలము;
స్వేచ్ఛ పాదుగ గలవు - స్వచ్ఛంద సంస్థలే;
సంఘజీవి - నరుడు - జగతి లోన.

ఉపవాసం

ఉత్తమోత్తమమ్ము - ఉపవాస విశ్రాంతి !
అంతరంగమునకు - ఆట విడుపు !
కడిగి వేయు కాయ కాలుష్యముల నెల్ల
బుద్ధి లోన సూక్ష్మ శుద్ధి గూర్చు.

హాస్యం

జ్ఞాన మిచ్చు సహజ సహనమ్ము సర్వదా,
విద్య కంతరాత్మ వినయ గుణమె ;
ధరణి మనుజు డనిన త్రసరేణు సదృశుడే !
హాస్య రసము మేలు అహము కంటె.

### మనసు

ప్రతి మనుజుడు బాధ పడు మనో వ్యాధితో,
జీవయాత్ర సహజ సిద్ధముగను,
మానసికము గాని బాధ - మనిషి లోపల లేదు ;
అన్ని రుగ్మతలకు ఆది - మనసు.

### నిర్భరానందం

సహృదయుండు చదివి సొంతమ్ము కావ్యమ్ము ,
అర్ధ రాత్రి నిదుర నంద వచ్చు ;
నిలుచు పఠిత హృదిని - నిర్భరానందమ్ము ;
చివరి క్షణము వరకు జీవితమున.

### మంచి వ్యసనం

అరయ బ్రదుకు నందు - ఆనందమే - బ్రహ్మ ;
బొందె తోడ ముక్తి పొందు టెట్లు ?
వ్యసన మివ్వ గలదు - అతిలోక సంతృప్తి !
అవసరమ్ము - మంచి - వ్యసన మొకటి.

పనులు జరుగ వలెను - మనసున్న ఏమౌను ?
మంచి ఊహ లంతరించ వచ్చు
నోరు చేరకుండ - జార వచ్చును చేయి;
వేచి పిదప లెక్కపెట్ట దగును.

### గురువు

చిన్న ప్రమిద చాలు - చిమ్మ చీకటి లోన ,
కనులు ఛూడ లేని కాల మందు ;
చదువు చెప్పు గురుడు మెదడు దప్పిక తీర్చు,
గమ్యమునకు చూప గలడు దారి.

### చికిత్స

తీరిక నిడ - మనుజ దేహమే - స్వచికిత్స,
సహజ సిద్ధ సరణి - సలుపు కొనుము,
ఉర్వి లేదు వైద్య ముపవాసమున కంటె,
మంచి నీరు కంటె - మందు లేదు.

### పూల దండలు

మెడను పూలదండ పడినచో మెనువెంట
శోభ వెల్లి విరియు చూపు లందు,
పూల సోయగమ్ము - పూల గుండెల తావి,
చుట్టు ముట్టి సభను - పట్టుకొనును.

### అజ్ఞాతవాసం

గుండె లేని నీచ ఘోర కర్కోటకుల్,
నీతి లేని వారు - నేత లైన ;
అర్జునేమి చేయు ? అజ్ఞాతవాసమే!
మంచి సమయ మరుగు దెంచు వరకు.

### అతిథి సత్కారములు

చిరుత స్థాయి లోన - చేయ నేరరు పనుల్ ;
గొప్ప గుండె యున్న కొంతమంది ;
అమిత భక్తి కూర్తు రతిథి సత్కారముల్,
చేసి వ్యయము ధన్య జీవు లగుచు.

### సహనం

పృథివి లోన కలవు - పెక్కు వైవిధ్యముల్
మనిషి బోలు మనిషి మహిని లేదు,
రణము వద్దు వివిధ రాద్ధాంతముల్ వద్దు
సర్వ తారకమ్ము - సహన గుణము.

## మంచితనము

పాశవికత కొంత - ప్రతి - మానవుని లోన;
కొంత మంచి తనము - కూడి యుండు;
పాశవికత నణచి - బ్రదుకులో మునుజూండు;
మంచితనము పూని పెంచు కొనుత.

## మరణం

పుడమి మీద నరుడు పుట్టి నప్పుడు ఏడ్పు,
సంతసించ వలయు చావటన్న ;
అరయ - ఆత్మ కెపుడు చెఱసాల దేహమ్ము ;
మరణ మనిన గొప్ప వరము సుమ్ము.

## నీతి

కూయ వచ్చు - నీతి కూత కోతలు కొన్ని,
హేతువాది ఆచరింప లేడు;
సంస్కరింప రాదు సంఘ లోపము లెల్ల;
జాలి గుండె యున్న చాలు చాలు.

## ముసలితనము

మళ్ల కొద్ది వయసు - మరణమ్ము దరి యౌను;
పెరిగి పోవు పనులు - తరుగు వ్యవధి;
వ్యయము చేయరాదు వార్ధక్య దశ లోన,
సమయ మెపుడు ఒక్క క్షణము గాని.

## తేటి

వెలుగు నీడ జిలుగు - విధి నిషేధము లన్న,
పుడమి బ్రదుకు - మనిషి గడుప వలయు ;
బ్రదుకు వాడి ముళ్ల పొదల చిట్టడవియే !
తేటి వోలె మనిషి తేనె లాను.

కార్య సాధకుడు

పొగడు వారి కంటె - తెగడు వారలె హెచ్చు;
చిత్త శుద్ధి - సంఘ సేవ చేయ;
దొరల వచ్చు కొన్ని పొరపాట్లు పనులలో
బాధపడడు కార్య సాధకుండు.

మౌన దక్షుండు

చాలు - ప్రశ్న - జ్ఞాన సమ్యక్ పరాకాష్ఠ,
పాండితీ ప్రచండ మండనమ్ము !
దాగు ప్రశ్న లోన - తగు సమాధానమ్ము ;
మౌన దక్షు డగుత జ్ఞాన పరిధి.

మహాకవిత

నరుడు నడువ గలడె - ధర దిగంబరుడుగా ?
వివిధ శాస్త్ర కళలు విద్య లట్లె;
దాపరికము లేక - తలపు లన్నియు చెప్ప,
అది మహా కవిత్వ మగును తరచు.

ముఖస్తుతి

మనుజ సంఘ మందు - మర్యాద కోసమై
మెచ్చికోలు తెలుప వచ్చు - వచ్చు,
గడుసు పీనుగులు ముఖస్తుతుల్ చేయగా !
పరవశుండు కాడు ప్రాజ్ఞవరుడు.

కాలం

తిరిగి పోవుచుండు గిర గిరా కాలమ్ము
ఆగకుండ క్షణము - సాగి పోవు !
వేయ దెపుడు చరిత వెనుకంజ సర్వదా,
జరిగి నట్టి క్షణము - తిరిగి రాదు.

### కుక్కలు.

ఈసడింప వచ్చు - ఈర్ష్యాళువులు చేరి;
తప్పు చేయు నట్టి గొప్ప వాని,
మొరుగగ వచ్చు చేరి దరికి కుక్కలు కొన్ని,
ఏన్గు - రాజ వీథి నేగు నపుడు.

### స్వగతం

మాతృ భాష లేదు - మాతృ దేశము లేదు,
మతము జాతి. - స్వల్ప మమత లేల ?
వసుధ యెల్ల నాకు స్వగ్రామమై తోచు !
లేవు లేవు ఎల్ల లేవి నాకు.

### కర్మయోగి

చేయలేని వాడు - చేయు తీరును చెప్పు ;
చేయ గలుగు వాడు - చేసి చూపు ;
కలము కదుపు నాల్క కదుప నేరడు సుమ్ము ;
కార్య శూరుడైన - కర్మయోగి.

### క్రాసు

త్యాగ యోగమునకు - ఆదర్శ చిహ్నమ్ము
క్రాసు కంటె వేరు గలదె జగతి ?
హృదిని విప్పి - ఐదు వది చేసి భక్తితో
క్రాసు కేను మ్రొక్క గలను సతము.

### కొవ్వువత్తి

అరయ మారుచుండు - పరమాణువులు సదా
వేరు కాదు సృష్టి వెరసి యెపుడు,
కాలి క్రొవ్వు వత్తి - కోలు పోయెడి దేమి ?
వస్తు రూప మందు వచ్చు మార్పు.

రంగులు

ఉపకరించు రంగు లుద్దీపనములుగా,
అంద చందములను చింద చేసి ;
రస సమాధి కూర్పు - రంగు రంగుల కూర్పు
శోభ గొలుపు వ్యంగ్య వైభవమ్ము.

నగటు మనిషి

నీతి - నీతి నీతి - నీతి సత్యావి పల్కు,
మాట లెన్నొ చెప్పు నోటి తోడ,
కడిగి పెదవి ఎపుడు కదుప కుండగ చేయు,
మంచి పనులు నగటు మనిషి - తరము.

బ్రదుకు

జగతి లోన - ఖండ సత్యాల మధ్యలో ;
నెరవ వ్రలయు బ్రదుకు నరుడు సతము ;
బ్రదుకు - తర్క గణిత పారమ్యమా ? కాదు ;
సామరస్య సార సంగ్రహమ్ము.

విద్య

ఉండరాదు సుంత - స్వోత్కర్ష మెదడులో,
ఒలుక రాదు అహము పలుకు లందు,
తెలియ దంచు తనకు - తెలియు వాడే జ్ఞాని,
వినయ రహిత విద్య - విద్య కాదు.

కవిత

కవిత - ఇంద్ర ధనువు - గగన మందున తోచు;
సుందర తమ దృశ్య సుభగ శోభ;
కనుల ముందు తోచు - కరము లందగ లేవు;
అనుభ వైక వేద్య మా వివృత్తి.

మనస్సు

తథ్య మేది ? ఏది తాత్కాలిక భ్రమ ?
మాయ సృష్టి లేదు - మనసు లేక;
స్వప్న మైన గూడ - అభాస సత్యమే;
మనసు - చూడ మేటి దినుసు సుమ్ము.

కలలు

ధరణి లోనె కలవు నరకమ్ము స్వర్గమ్ము,
బ్రదుకు కొంత దుఃఖ భాజనమ్ము;
స్వర్గ సుఖము పొంద వచ్చు స్వప్నాలలో;
కలల అవసరమ్ము కలదు భువిని.

ఆయువు

యౌవనమ్ము అధిక మైన - ఆనందమే
ముసలి తనము వల్ల మురిప మేమి ?
అనుభవించలేని ఆయుస్సు వ్యర్థమ్ము;
వద్దు - శవము సమము బ్రదుకు వద్దు.

ప్రగతి

తర్కినాల మీద - దాన దర్పము మీద,
నమ్మకమ్ము లేదు నాకు సుంత;
ప్రగతి దోహద మగు బహుమతుల్ సంధించి
ప్రోత్సహించ వచ్చు యువక జనుల.

కవిత

విశ్వ మందు పూలు వికసింపగా నేల ?
ఏరు లెల్ల పొంగి పార నేల ?
వెల్లి విరియ నేల వెన్నెలల్ జాబిల్లి ?
అల్లె వ్రాయు - సుకవి అమృత కవిత.

కవిత

మనుజు డరుగ గోరు మరొక లోకము లోకి,
క్రుళ్లి పోయి కంపు గొట్టు నిహము,
కవన జగతి లోన కలదు సౌందర్యమ్ము,
కలవు నాదబిందు కళల హాయులు.

కవిత

కవిత - కొండలకును కల్పించు పక్షముల్,
మించునకు నిలుకడ మేళవించు;
నింగి వెన్నెలలకు నెత్తావి కైసేయు
కవిత దివిని భువిని కలుప గలదు.

పిచ్చి

అమిత తృప్తి నిచ్చు అజ్ఞాన యోగమ్ము
చొరవ గూర్చు వింత వెరపు గూర్చు;
అంత కంటె గొప్ప ఆనంద మేమిచ్చు ?
విశ్వ మందు ఒక్క పిచ్చి తప్ప.

చరిత్ర

గొప్ప గ్రుడ్డి తనము - గొప్ప అంధత లేక,
గత చరిత్ర వ్రాయ గలుగు నెవడు ?
చూడవలె సుదూర సూక్ష్మ స్ఫటిక శిలల్ !
కంటి ఎదుటి కొండ - కానకుండ.

కవిత

స్వీయ గృహము నాకు చెరసాలగా మారె !
రెక్కలను నరికిన పక్షి నైతి;
ముసలి తనము చెడ్డ ముప్పు తెచ్చును గాని,
కాచు గాత నేడు కవిత నన్ను.

జనని

కుంటి చెవిటి మూగ గ్రుడ్డి దైనను బిడ్డ,
జనని ప్రేమ చూపు జగతి లోన,
మాతృ హృదయ మున్న మగవాడు కవిగారు,
రక్తి చూపు స్వీయ రచన లందు.

కవిత

గుండె - లోన తరచు - గొప్ప అంధత లేక
కవిత వ్రాయ లేడు కవి వరుండు;
నిండి యుండు బ్రదుకు ఖండ సత్యాలతో
ప్రతిఫలించు కవిత బ్రదుకు నతము.

అతీంద్రియ శక్తి

అవతరింప వచ్చు అతిలోక శక్తితో,
అవని మీద మనుజు లప్పుడపుడు;
జరుగ వలెను ఇంక పరిశోధనలు ముందు
గణిత శాస్త్ర లలిత కళల యందు.

దైవ భక్తి

చెవిటి కుంటి గ్రుడ్డి సేవ చేయుట మేలు
హాజి కాశి తీర్థ యాత్ర లేల ?
జీవితమున మేలు దైవోపహత సేవ
లేదు దైవభక్తి లేదు నాకు.

బ్రదుకు

స్వీయ శక్తి తోడ చేయ గల్గిన దేమి ?
కార్య సిద్ధి అగును కలుప యుక్తి ;
బ్రదుకు లోన కష్ట మెదురీత సర్వదా,
ప్రకృతి శక్తి నరసి వాడ వచ్చు.

### అతిథి

అతిథి రాక కొరకు ఆహార్యమును దాల్చి,
ఇంట నుంటి గంగి రెద్దు వోలె;
ఆలసించి అతిథి ఏలకో రాలేదు !
కవిత వ్రాయ తీరిక లభియించె.

### ముసలి

క్రొత్త మిత్రుల సమకూర్చుకో లేనిచో
వదల వచ్చు ముసలి వాడు ధరణి,
అపరిచితులు వచ్చి - ఆదరించిన మెచ్చి
అతడు బ్రదుక వచ్చు అవని మీద.

### మరణం

ముసలి తనమునకు సముచిత విస్మృతి యేది ?
పలు సమస్యల సుడి బ్రదుకటన్న
విరుగుడు కలదొకటి - మరణమ్ము మాత్రమే
శాంతి పాత మదియె - స్వస్తి అదియె.

### జ్ఞాన విప్లవం

కలవు - వేల కొలది కొలతలీ జగతిలో !
మనకు తెలియు మూడు కొలత లైన;
అగుత నాంది గీతి ఐన్‌స్టీను వాదమ్ము
విజయ మగుత జ్ఞాన విప్లవమ్ము.

### ఉత్తమ పురుష

ఉత్తమ పురుష ప్రయోగమా ! జాగ్రత్త
ఏక వచన మైన హేయ తరము,
అహము లేని ఏమహానుభావుడో తప్ప;
వ్రాయ నేర డొక్క వాక్య మైన.

## దేశాటము

తెలివి తేట పెరుగు దేశాటనము వల్ల,
మేలు పరపరాగ మేలనమ్ము;
ఆయువు నవపరిచయాలు పెంచును - గద;
గ్రంథ మాత్ర పఠన కాదు - విద్య.

## ఆయువు

అనుభవాలు పెక్కు - ఆయుస్సు సమకూర్చు
అనుభవమ్మ కవిత కాత్మ సుమ్మ !
కనులు తెరచి - మూసి గ్రంథ రాజము లెల్ల;
చదువ వలయు మనుజ హృదయ - వేత్త.

## వ్యాధి

కడగి - రోగములను కన్న బిడ్డల వోలె;
పేర్మి కొంత మంది - పెంచగలరు
బ్రదుక లేరు వారు వ్యాధు లేమియు లేక;
అంద గలరు ప్రజల సానుభూతి.

## ముక్తి

రస సమాధి కలదు - రతి కేళిలో కొంత,
కొంత మేర - ముక్తి - గోచరించు,
మంగళావరణము - మరణ కైవల్యమ్ము;
ఆత్మ చేరుట - పరమాత్మ లోన.

## అమృత పాయి

అమృతపాయి నగుచు ఆర్భాటములు వీడి;
విశ్రమింపఁ దలతు వెనుక వరస;
తాల్ప దలతు నేను తంబురా పాత్రనే,
ఉండు గాక గాయకుండు ముందు.

### భావయిత్రి

భావయిత్రి పక్షి - పద్దు పంజర మేది,
రెక్క లెపుడు కత్తిరింప రాదు,
ఈద గలదు సరసి - ఎగురు ఆకసములో;
అవని నడువ లేదు కవన హంస.

### ప్రతి హింస

క్రూర ఘోర హింస - నేరమ్ము జరిగెనో,
ప్రతిగ - అట్టి హింస - పాడి గాదు;
తప్పు తప్పె అది సమర్థ నీయము గాదు;
పగ వగ కసి కూడ పాపమె యగు.

### ఆటవెలది

పద్య శిల్ప మందు - పరిణామ రమ్యతల్
సూక్ష్మ దృష్టి నెరపి - చూపవచ్చు;
ఆటవెలది పద్య మందు - సీసము నందు,
ప్రగతి - శిల్ప సుందరముగ - తోచు

### స్వగతం

నిర్వికల్ప హృదయ నిర్వాణ కల్పమే,
భావయిత్రి పొంగు వారి పొరల,
విన్ను చేరగలను నిఃఖేద నిష్ఠతో,
కడలి లోన ఏరు కలియు నట్లు.

### గుంపు

గుంపు లోన ఒక్క గోవిందయగ మారి;
వెడల నేల స్వేచ్ఛ విడిచి పెట్టి ?
సాహసించి యల్ప సంఖ్యాకులను చేరి,
శిరము నెత్తి జగతి తిరుగ వచ్చు.

## వరం

బాగు చేయ దగును వసుధ యంతయు ముందు ;
వద్దు చర్చ గిర్చ - వరము గూర్చి,
ప్రజకు కానరాడు భగవంతు డనువాడు !
కనుల ముందు జనులు కలరు కలరు.

## మధ్యవర్తి

కలవు - పెక్కు వాదములు - ప్రపంచము నందు,
న్నిర్ణయింప రాదు నిజము నెపుడు,
ఉండగలను సతత ముయ్యాల ఊవుగా
మధ్యవర్తి నౌచు మానసమున.

## శోభ

కవన పఠనమునకు - గాత్ర మాధురి - శోభ;
జ్ఞానమునకు శోభ - మౌన నిష్ఠ
విజయమునకు శోభ - వినయ విన్యాసమ్ము,
శీలమునకు శోభ - చిత్త శుద్ధి.

## ఏకాంతం

లోక మందు - తరచు - ఏకాంత విశ్రాంతి,
కొంత మేర మేలు కూర్చ వచ్చు ;
ఎంత కాల మోర్చు - ఏకాంత వాసమ్ము?
ఏ మనీషి గాని ఋషియె గాని.

## కవులు

ప్రతిభ గలిగి దొడ్డ కృతులు వ్రాసెడి వారు,
పెక్కు మంది కలరు - పృథివి లోన ;
కలము కదుప కుండ - నిలువెల్ల కవితయై
కలరు బ్రదుకువారు కవిత కొరకె.

తృప్తి

యోగ్యు డైన వాని కుపకార మొనరింప
గొప్ప తృప్తి కలుగు - గుండె లోన ;
అంత కంటె - మేటి ఆనంద యోగమ్ము,
పుడమి లోన నరుడు పొందలేడు.

వేట కుక్క

వెడలె - అడవి వైపు - వేట కుక్కల దండు
తరలె తిరిగి ఇంటి దరికి వేగ,
అడవి దరిని రేగ అన్యోన్య కలహాలు ;
కోర లెల్ల - రక్త పూర మగుచు.

తంబురా

తాల్చి చేతిలోన - తంబురా శ్రుతులొల్కి
వెనుక కూరు చుండ - వేడ్క నాకు,
సహకరింప దలతు - సంగీత సభ లోన,
వేరు పేరు పేర్మి కోరు కొనను.

స్రష్ట

కానరాడు - సర్వ కల్యాణ గుణు డంచు,
చాట వచ్చు మతము స్రష్ట గూర్చి,
మంచి వారు గూడ మరణ మొందగ నేల ?
కంప మొంది పుడమి - కడలి పొంగి.

స్వాగతం

కలవు పెక్కు వాదములు ప్రపంచము నందు;
నిర్ణయింప లేరు నిజము ప్రజలు,
ఊగు నిజము సతత ముయ్యాల ఊపుగా
మధ్యవర్తి నౌచు మనల దలతు.

## అతి తెలివి

బ్రదుకు లోన - పైకి రాని వా రున్నారు
వారు తెలివి లేని వారు కారు ;
అతి తెలివి ప్రబలుట పతన హేతువు గదా
పెక్కు మంది యందు పృథివి లోన.

## బొంకు

చవట కూడ - సత్య సంధుడు కావచ్చు !
నీతి నిష్ఠ - బ్రదుకు నెరప వచ్చు;
చాల గలిగి ప్రతిభ శక్తి సామర్థ్యముల్,
పల్కి బొంకు నరుడు బ్రదుక లేడు.

## ఉపకారం

యోగ్యు డైనవాని కుపకారమును చేయు,
గొప్ప తృప్తి కలుగు గుండె లోన,
అంత కంటె మేటి ఆనంద యోగమ్ము
పుడమి మీద నరుడు పొందలేడు.

## కడలి

అలతి అలతి విషయములపై శ్రద్ధచూపించు
అతడు గొప్ప వ్యక్తి యగును తుదకు,
అల్ప మేది కలదు ? యావజ్జగత్తులో ?
కలియ - నీటి కణము కణము - కడలి.

## వీరుడు

సాటి వారు కడగి సహకార మందింప,
వీరు డంచు ఒకడు పేరు గాంచు,
అరయ గొప్ప వార లధమర్ణులే గదా
తెరకు మరుగు వారి నరయ లేము.

ఎండమావులు

అఖిల సుఖముల వయి దానంద యోగమ్ము
వలపు పరిధి దాటి గలదు - ప్రేమ,
విలువ గలది శాంతి- విశ్రాంత మతి కంటె
ఎండమావుల కొర కేల వేట ?

బ్రదుకు

సంప్రదాయములకు శక్తి హెచ్చుగ నుండు,
బ్రదుకు మాయదారి భ్రమల పుట్ట ;
సాధ్య మగును కొంత సంఘ సంస్కారమ్ము
విద్య జనుల లోన వృద్ధి చెంద.

పొగడ్త

తన్ను పొగడ - ఉబ్బి తబ్బిబ్బు కారాదు,
ప్రతిభ యుండి కూడ - ప్రాజ్ఞు డెవడు ;
మధుర వాక్య వేత్త - మర్యాద కోసమై,
ప్రోత్సహించు కొరకు - పొగడ వచ్చు.

మతం

మతము వద్దు -శుద్ధ మానవత్వము చాలు ;
ఏల సంప్రదాయ శృంఖలాలు ?
తలప మతము భావ దాస్యమే సర్వత్ర;
మంచి తనము చాలు - మతము వద్దు.

అభిమతం

ఊపవచ్చు చేతు లుచ్చారణము తోడ;
స్థాయి మార్చ వచ్చు - స్వరము నందు;
అభినయమ్ము తోచు వ్యవహార సరళిలో !
తరచు జతులు గతులు తాండవించు.

జారు పాటు

ఎక్క వచ్చు నొక్క డెవరెస్టు శిఖరమ్ము ;
కొండ లందు జారి యుండ వచ్చు ;
విశ్వ మెల్ల అతని విజయమ్ము నగ్గించు,
మరచి జారుపాటు మాట తుదకు.

వెలుగు

వెలుగు నిండి యుండు - విద్యార్థి గుండెలో !
బండ బారు వేత్త గుండె కాయ;
చీకటి పడ కుండ జిజ్ఞాసు నయనాల
నాట్య మాడు పావనత మొగాన.

పికాసో

మరువ రాని గొప్ప మహనీయుడా వ్యక్తి,
చిత్ర లేఖకుండు - శ్రీ పికాసో;
అతని కళను అతని ఖ్యాతి నవ్వల పెట్టి
అతని చిత్త శుద్ధి నభినుతింతు.

కారణం

కలసి యుండ వచ్చు - కారణమ్ములు పెక్కు
ఏక కార్య మందు లోకమందు,
వేరు చేయ లేరు విడదీసి ఎవరైన ;
కడగి ఒక్క ముఖ్య కారణమును.

మంచి పని

చిత్త శుద్ధి తోడ చిన్న వైనను పనుల్,
కొన్ని చేయ వచ్చు కోరి - మనిషి ;
భక్తి శ్రద్ధ చాలు - పావనత్వము చాలు ;
ఎంచి చేయ వచ్చు మంచి పనిని.

## చదువు

చదువు లెల్ల - పాల సమము లోకము లోన,
మేటి జ్ఞాన మమరు మీగడ వలె,
వెన్న వూస బోలు - విద్యా విశేషమ్ము ;
ఇక - వివేక మనిన ఘృతము సమము.

## విలువలు

గుండెలో గుణములు - గుడి కట్టు కొని యుండు
విడువ జాల నట్టి విలువ లుండు,
త్యాగ యోగి యగును - వ్యక్తి జీవితములో ;
నిలుకడ గల గొప్ప విలువ లున్న.

## ప్రతిభ

ప్రతిభ - అనిన - పట్టపగటి మార్తాండుడా ?
విన్ను మేలు కొలుపు వేగు చుక్క,
కమ్మ తెమ్మెర వెద చిమ్మ - పుప్పొడి తావి ;
మిన్ను మన్ను కలుపు మించు తీగ.

## నీరు కొలది

తెలివి అన్న - నీరు కొలది తామర సుమ్ము,
కాదు వ్యర్థ దర్ప గరిమ కాదు ;
అవసరమును బట్టి - ఆధిక్యమును చూపు,
సహజ సుందర మగు శక్తి శోభ.

## కవి

అతడొక కవి - సంశయాత్ముండు సర్వదా
నిజము కూడ నమ్మ నేర డతడు,
చవట - ఒకడు మెచ్చ - సభలో అతని కైత,
నమ్మి - అతని చంక నాక సాగె.

## గురువు

శిష్య హృదుల యందు జిజ్ఞాస రగులించు
గొప్ప గురువు చదువు చెప్పు నపుడు,
ప్రతి దినమ్ము గురువు పాఠాలు తోమునా ?
వదల కుండ శిష్య వరుడు చదువు.

## శోభ

సభకు శోభ - హాస్య చతుర సద్యః స్ఫూర్తి,
చిన్ని కన్నియలకు సిగ్గు శోభ,
నరుని సిరికి శోభ - కరుణార్ద్ర హృదయమ్ము,
మేఘమునకు శోభ మించు తీగ.

## వేటగాడు

పువ్వు పువ్వు కరిగి పుప్పొడుల్ సమకూర్చి
తేటి గుంపు కూర్చు తేనె పట్టు !
ఎలుగు బంట్లు తేనె - వెలగ గుజ్జులు కూర్చ
వేగ - వేటగాడు దోచుకొనును.

## యువత

ప్రగతి నడ్డగించు ప్రౌఢ విద్వాంసుండు,
శ్రోత్రియుండు మార్పు చూడ లేడు !
చురుకు పాలు గల్గి - సూక్ష్మ దృష్టిని గల్గి,
క్రొత్త దనము యువత కూర్చ వచ్చు.

## పండ్లు

పండ్లు తినిన మొదల - ప్రతిరోజు వరుసగా,
వైద్యు డేల చేర వలెను - దరికి ?
అతిశయింప గలవు - ఆయురారోగ్యముల్ !
జీర్ణ శక్తి పెంపు చేసి కొనిన.

## చేతలు

విశ్వసించు నటుల - వేయి నాల్కల తోడ,
చేత లెల్ల నొక్కి చెప్ప గలవు,
కూత లైన యెడల చేత లేమియు లేక,
కలసి పోవు తుదకు గాలి లోన.

## అహం

అవని యెంత శాల సువిశాల సృష్టియో ?
అరయ మనిషి యెంత అవని మీద ?
విద్య అనిన యేమి ? వినయమ్ము మాత్రమే,
అల్ప మేది కలదు ? అహము కంటె ?

## పాత్ర సేవ

విసరి వేయ దగును - వెంటనే జపమాల
కవిత వ్రాయు నట్టి కలము గిలము.
ఉండ వలయు నుంత ఉపకార హృదయమ్ము ;
పరమ పావనమ్ము పాత్ర సేవ.

## బ్రదుకు కంటె

బ్రదుకు కంటె పెద్ద పరిధి కప్పుడ వచ్చు,
కొంత మంది తరము గొప్ప వారు ;
మనసు కూడ మారు - కనుదోయితోపాటు
తరల వికట భూత దర్పణముల.

## ఆత్మార్పణం

చూడ ఎట్లు పుట్టు ? శుద్ధ శూన్యము నుండి,
హేతు వేది లేక ఏది యైన ?
అవతరించు నెడల ఆత్మార్పణము హింస;
వెరపి కారణము వెదక వలెను.

### పావనత

చిరు చిరు పొరపాట్లు దొరల వచ్చును గదా
పేర్మి చేయు నెడల పెద్ద పనులు;
పనులు చేయు వాని మనసు పావన మెంచు,
మానవ స్వభావ మర్మ వేత్త.

### కవిత

కవిత విలువ హెచ్చు గడువ కాలము కొంత
బ్రదుకు నందు పాత వస్త్ర్ర వోలె ;
ఘన విమర్శకుండు - కాలమ్ము జగతిలో,
చేవ దేరి నిలుచు శ్రేష్ఠ కవిత.

### విగ్రహం

విశ్వ మందు చూడ విజితేంద్రియు డెవండు ?
నీతి వచ్చు దండ భీతి వల్ల ;
చదువు వల్ల సంఘ సంప్రదాయము వల్ల ;
విగ్రహమ్ము మనిషి నేర్చు కొనుత.

### శాంతి

సంఘ సంస్కరణము - సర్వదా మంచిదే,
ప్రగతి కూర్చు లేదు - పాతదనము ;
సంప్రదాయ శాంతి - సంక్షోభమున కంటె,
సంఘమునకు మేలు సలుప గలదు.

### వేడ్క

ఇరువు రనుభవించు నెడల ఆనందమ్ము
ఎంచ విలువ ఇనుమడించ వచ్చు,
ఎవ్వ డనుభవించు ఏకాంత సౌఖ్యమ్ము ?
బహు వచనము వేడ్క బ్రదుకు నందు.

కాగడా

పగటి కాగడాలు ప్రజ్వలింపగ లేవు,
రాత్రి చిరుత ప్రమిద రక్తి కట్టు,
ప్రతిభ - దేశ కాల పాత్రానుబద్ధమై,
పేరు కెక్కు వచ్చు పేర్మి మీర.

ధ్వనులు

నిర్వహించు నెడ గుణీభూతమౌ ధ్వనుల్
అక్షర పున రావృతావృతముగ,
వాచ్య పరిధి దాటి - వ్యంగ్యార్థములు మీరి,
మెదడు హృదిని కలిపి కదుపు కుదుపు.

గానం

గాన మనిన శబ్ద కాలుష్యమా ? కాదు !
ఘోష కాదు - కంఠ శోష కాదు ;
సరస సరళ శబ్ద సమ్మేళనము సుమా,
సాధు శీధు సార సంగ్రహమ్ము.

కవిత

పూచినట్టి గొప్ప పూల గుత్తియ కాదు ;
కొమ్మ కాదు - కవిత - రెమ్మ కాదు ;
కాదు - తీగ కాదు - గగన మంటెడు చెట్టు ;
కాన రాని తావి - కవిత యనిన.

విశ్వ మానవుడు

వ్యక్తి మాసి పోవు వర్గీ కరణ మందు ,
మతము - జాతి - భాష మతము మిథ్య !
మంచి తనము చాలు మానవత్వము చాలు,
మాన్య డెవడు ? విశ్వ మానవుండె.

దేవుడు

దివ్య భక్తు డొకడు దేవాలయము చేరె,
కొత్త కట్టడమ్ము కోరి చూడ ;
కోలుపోయె నతడు క్రొత్త చెప్పుల జోడు;
దేవు డూరు కొనియె తెలియనట్లు.

తల్లి దండ్రులు

కలిగి యుండ్రు - ప్రేమ - కన్న బిడ్డల మీద,
తల్లి దండ్రు లెల్ల - ధరణి మీద,
పిల్ల లెల్ల - అట్టి ప్రేమ చూపరు గదా,
తల్లి దండ్రి పైన - దయ వహించి.

కవిత

కవిత - ధాం ధమరుతి కంచు ఢంకా కాదు;
యతి గణములు ప్రాస గతులు కాదు ;
తావి తెమ్మెర దాటి - పూవు రేకుల దూరి,
తేటి కొదమ ఆను తేనె - కవిత.

ప్రతిభ

శిలను చెక్కి మార్చు శిల్పమ్ముగా చేసి,
ప్రతిభ - చెప్పరాని ప్రజ్ఞ - సుమ్ము ;
కలదు కలము లోన - ఉలి లోన కుంచెలో!
రమ్యతా రిరంస - రస పిపాస.

కవిత

అనుభ వైక వేద్యమా ఆత్మ విస్ఫూర్తి
పృథివి కవలి వెల్గు వెల్లి మునక,
జ్ఞాన జాగృ దమృత సద్యః పునర్జన్మ !
సంక్రమింప వచ్చు - చదువ - కవిత.

అవకాశం

అప్పమైన ప్రతిభ - అవకాశములు లేక,
రక్తి కట్ట బోదు బ్రదుకు లోన,
అడవి వెన్నెల సిరి - అబ్ధిలో రత్నాలు
ఎవరి కుపకరించు అవని లోన.

జంట

వధువు వరుల యందు వైవాహిక స్ఫూర్తి,
చూడ - కుదర వలెను ఈడు జోడు
కలియు చుండు జంట కారణాంతరముచే,
రక్తి కట్ట బోదు బ్రదుకు తుదకు.

ఛందస్సు

ఛంద మందు పెక్కు స్వారస్యములు కూర్చి,
పూర్ణ బిందు రవము పొందు పరచ,
ప్రాస మందు అక్షరాలు సంయుక్తమై
నాద బిందు కళలు నాట్య మాడు.

ఆత్మ

నిదుర అనిన యేమి ? నిదురలో కల లేమి ?
మనసు నిదుర మేలు కొనుట యేమి ?
ప్రాణ మన్న యేమి ? ఆత్మ యన్నను ఏమి ?
చావు పిదప మిగులు నట్టి దేమి ?

పాప పుణ్యములు

నరకమునకు పోడు - ఉరి తీయ బడువాడు,
పాప పుణ్య సూక్ష్మ పరిధి వేరు ;
స్వర్గమునకు పోడు చావ మంచము మీద,
దేవుని తుల తీరు తెలియ వశమె.

### వెలుగు

చెకుముకి చిరు శిలలు - చేర్చి - రాపిడి చేయ,
నిప్పు పుట్టి రవలు నింగి కెగయు,
మేళవించు నెడల మెదడు గుండెను చేర్చి
వెల్లి విరియు వెలుగు విద్య లందు.

### విప్లవం

పెద్ద పులి - తిను తన పిల్లల్ని అంటారు
పెద్ద పులిని పోలు విప్లవమ్ము,
విప్లవమ్ము తినును స్వీయ సంతానమ్ము,
ఎడద లేక కానబడక కనులు.

### స్నేహం

మోహ మమరు - అమరు స్నేహానుబంధమ్ము,
కారణాల వల్ల కాదు కాదు ;
కష్ట మైన గాని - నష్ట మైనను గాని,
జన్మ చివరి వరకు సాగ వచ్చు.

### అంధానుకరణ

ఆంగ్ల యుగము నందు - అంధానుకరణమ్ము,
భరత ఖండ మెల్ల పాడు చేసె ;
లేప రాదు ఇళ్లు - లో పునాదులు లేక,
గాలి వాన వలన కూలి పోవు.

### శోభ

అందచందములకు అభిషేక మకుటమే ;
కలియ చురుకు దనము తెలివి కూడ,
వేల్పు విల్లు కూర్పు విను వీథికే శోభ ;
పుడమి అడుగు మోసి ఆమె నడువ.

### దివ్యగాన గీతి

అర్థ మైన యెడల వ్యవహార భాషయే !
కాని యెడల దివ్య గాన గీతి ;
సామవేద మందు స్వరము చిందులు త్రొక్కు
నాద బిందు లయలు నాట్యమాడు.

### ధనం

స్వార్థ పరత తాను సంఘ మంతటి దోచి,
ధనము బ్యాంకు లందు దాచ వచ్చు ;
ధనము ఏమి చేసు కొనును చచ్చెడి వేళ ?
కుళ్ల బెట్ట రాదు - కొంత - చాలు.

### టెలిఫోను

కలిసి వచ్చు పనులు - టెలిఫోను ఉన్నచో,
కాని - కార్యదర్శి - లేని యెడల,
చెవులు చిల్లు పడును చిరుగంట మ్రోతతో;
అంత కంటె కాల హరణ మేది ?

### శ్రమ

జరుగ వెపుడు పనులు - సంకల్ప మాత్రాన;
ఉండ వలెను శక్తి యుక్తి కలిసి,
శ్రమయె - విజయమునకు జనయిత్రి సర్వదా,
పగటి కలలు వేరు పనులు వేరు.

### సింహం

కూరుచుండ - కొండ గుహ లోన సింహమ్ము
కనుల పండు వౌచు కాంచినాను.
అడవి నెల్ల నేలు - ఆ ఠీవి - ఆ జూలు,
చూపు లందు వెరపు సొగసు చిందు.

పెండ్లి

భావ మందు - కొంత - పావనత్వము లేక,
పెండ్లి చేసి కొనుట పెద్ద తప్పు ;
సానుభూతి కలిగి - స్థాయి భావము కల్గి,
కలిసి మెలసి మెలగ వలెను - జంట.

జన్మదినం

జన్మదినము సతత సంతోషమును గూర్చు,
బాల్య యౌవనాల పరిధి లోన,
వెడలు వయసు మల్ల వేరు దారుల లోన,
సంతసమ్ము మరియు జన్మదినము.

అమ్మ

బ్రదుకు లోన అమ్మ మొదటి కర్తవ్యమ్ము
కూర్చు కొనుటె బిడ్డ కొరకు తిండి !
కడగి ఆమె ఒక జగన్మాత కావచ్చు ;
అట్టి ప్రేమ చిలికి అందరి పయి.

తప్పు

తప్పు లేని వాడు - ధరణి లోపల లేడు,
తప్పు ఒప్పు కొనుట గొప్ప గెలుపు,
అనుభవించు నరుడు అవనిలో నరకమ్ము
దాచి పెట్టి నట్టి - తప్పు వలన.

కత్తి వంటి కలం

సాహితీ తపస్వి - స్పందించ వలె వేగ,
కత్తి వంటి పదను కలము కదిపి,
సంఘ మందు తరచు జరుగు అన్యాయముల్,
శిరము నెత్తి చాటి చెప్ప వలెను.

ప్రేమ

మనిషి ప్రేమ నెవడు కొనబోడు ధనముతో !
వెఱ్ఱి వాడు తప్ప విశ్వమందు ;
ఆ ధనమ్ము దాచి - వ్యయము చేయగ వచ్చు,
పుడమి కలవు పెక్కు పుణ్య కృతులు.

వనరులు

పడవ - నీరు లేక - పడి సాగదేటిలో;
ప్రమిద ఆరిపోవు చమురు లేక,
వనరు లున్న చాలు మనిషి సాగును వేగ,
తారు రోడ్డు మీద కారు వోలె.

నీరో చక్రవర్తి

అగ్ని దగ్ధ మగుచు ఆరాట పడ - రోము ;
జనుల మాట మరచి చక్రవర్తి,
వాయులీన జంత్ర వాద్యమ్ము వాయించె,
స్థాయి రస సమాధి - సంక్రమింప.

ఆశ

ఆశ చివరి వరకు అడుగంటకయె యుండు,
చిత్రము కద మనుజ చిత్త వృత్తి,
ఔషధాలు కోరు అంధ వృద్ధుడు కూడ,
ధరణి చుట్టు ఆశ తిరుగు చుండు.

ఇహం - పరం

కలవు సృష్టి లోన - తెలియ నట్టివి కొన్ని,
వదలి పెట్ట వచ్చు వ్యర్థ చర్చ,
ధరణి పైన ఉన్నదా ? పునర్జన్మమ్ము ?
పరము విడిచి చూడవలె నిహమ్ము.

## పావనత

గాన పటిమ కంటె - జ్ఞాన యోగము కంటె,
పదవి కంటె - మేటి మెదడు కంటె
కవిత కంటె - ధనము కంటె - పావనతయే
జీవితమ్ము లోన - శ్రేష్ఠ తమము.

## చదువు

చదువు వేరు - హృదయ సంస్కారమది వేరు,
దాన గుణము వేరు - ధనము వేరు;
సాహసమ్ము వేరు - శౌర్య సంపద వేరు ;
ఉన్న యెడల కలసి ఉజ్జ్వలమ్ము.

## నిజం

గుర్తు పట్ట - కవిత - కొంత కాలము పట్టు ;
అమృత కవిత యోజనాత్మకమ్ము ;
సాహితీ సహృదయులు - సమకాలికులు కారు ;
నిజము తేల గలదు నిలుకడ మెయి.

## దీర్ఘదర్శి

జీవితమ్ము నందు భావి లాభము గూడ
ఆచి నిర్ణయాల తూచ దగును,
మేటి మేలు కలుగు నేటి నష్టము లోర్వ,
దీర్ఘ కాల దర్శి - తెలివి వేరు.

## బోధ

బోధయందు కాదు పునరుక్తి దోషమ్ము ;
నిజము చెప్ప వలయు ప్రజకు నొక్కి,
చాటి చెప్ప వలయు సత్యమ్ము పలుసార్లు ;
మనిషి విన్న దాని మరచు తరచు.

ధ్యానం

కాంక్ష లెల్ల తరచు కామ రూపము దాల్చి
కానుపించ వచ్చు - కలల లోన,
అవసరమ్ము కొంత ధ్యాన యోగము గూడ,
అలలు లేని అబ్ధి యగుత మనసు.

దేశాటనం

తెలివి తేట లెదుగు దేశాటనము వల్ల,
చదువ దగును మనుజ హృదులు తెరచి,
స్వ పర భేద వీక్ష - ప్రత్యక్ష మగు గాక
జ్ఞానమునకు ఆత్మ - స్వానుభవము.

కవిత

కవిత - శ్లేష శబ్ద గత చమత్ కృతి - కాదు ;
చక్కిలి గిలి కాదు - వరస కవిత,
సహృదయుండు - విడిచి - ఇహలోక వాసనల్
కోరుకొనుత మరొక క్రొత్త జగతి.

స్నేహితుడు

ప్రస్తుతింప వలెను బహిరంగముగ మిత్రు,
తెగడ వలె పరులకు తెలియ కుండ,
సానుభూతి తోడ సహియించ వలె నుమ్ము,
స్నేహితుండు తప్పు చేయు నపుడు.

స్వగతం

వచ్చె మరుపు నాకు - వయసు మళ్లుట వల్ల,
మరపు నాకు గొప్ప వరము నేడు,
నాకు కవిత యిపుడు ఏకాంత సేవయే !
మధుర మంజు రస సమాధి సమము.

### మందహాసం

మాట కరుకు దనము మంచి దెన్నడు కాదు ;
లోని మంచి మనసు కాన రాదు ;
చిందు కాక మోము మందహాసము సదా,
మార్దవమ్ము మేలు మాట లందు.

### కవిత

కావలసిన వేవి కవిత వ్రాయుటకున్నె,
కాదు పెద్ద పదవి - కాదు ధనము;
బ్రదుకు గడవు కొరకు సదుపాయ విశ్రాంతి;
సాహితీ తపస్సు సలుప గలరు.

### జ్ఞానం

భిన్న వాద భూత భేతాళ వాసమ్ము
వసుధ - క్రుళ్లు కంపు వల్లకాడు,
జ్ఞాన మనిన నిత్య సంగ్రామ రంగమా ?
సామరస్య యోగ సాధనమ్ము.

### తిక్కన

వ్రాసె తిక్కన కవి పదిహేను పర్వాలు,
భావ నిష్ఠ తోడ - భారతమ్ము ;
ఒక్క చోట గూడ - కక్కుర్తి పడలేదు
శ్లేష కొరకు చిత్ర భాష కొరకు.

### ఆటవెలది

ఆట వెలది నాకు అభిమాన పాత్రమ్ము,
అలతి అలతి పలుకు లంత కన్న;
అర్థ ముండ వలెను ఆకాశ కుహరమ్మె,
అంద నట్టి ఎల్ల లధిగమించి.

### ధర్మం

ధర్మము బహుళార్థ తరళ కిమ్మీరమే,
విశ్వలైక వర్ణ నిరతి కాదు ;
ఇంద్ర ధనువు శోభ ఏడు రంగుల తోడ,
ఆడు - పురులు విప్పి కోడె నెమలి.

### తెగడ్త

పలుక వచ్చు సులువు పరముఖ ప్రీతికై,
మెచ్చి కోలు కొంత మేళవించి ;
మొగము ముందు తెగువ తెగడ గల్గిన వాని,
శౌర్య వంతు డనుచు చాట వచ్చు.

### కవిత

అరయ మనుజ చరిత - పరిణామ గతిలోన,
క్రాంత దర్శనమ్ము - కవన సృష్టి;
అభ్యుదయము కూర్చు ఆదర్శములు చూపి,
కవిత తెచ్చు గద జగద్ధితమ్ము.

### స్వగతం

ముగ్గిపోయి నట్టి ముసలి పండును నేను,
ఎపుడో రాలి పోదు - ఎవరి కెరుక ?
విత్తనాల కింక - విలువ యుండును గాన,
శిష్య సంతతి కిక - క్షేమ మగుత.

### శిష్యుడు

మేలు గురువు శిష్య మేలు కోర్పిన చాలు,
శిష్య మీద స్వారి చేయ రాదు ;
పెరుగ లేదు మొక్క పెద్ద వృక్షము కింద,
శిష్య డెదుగు గాక స్వేచ్ఛ తోడ.

ప్రగతి

కత్తి తోడ జరుగు ఘర్షణల్ పలుమారు,
రక్తపాత మెపుడు ప్రగతి కాదు ;
సాంస్కృతిక పరాగ సంపర్కముల వల్ల ;
ప్రగతి ఉద్భవించు జగతి యందు.

వేళ్లు

చేర్చి గలవు వేళ్లు చెట్ల కాహారమ్ము,
భూమి తొలిచి కొనుచు పోయి పోయి,
కనులు ముక్కు కాళ్లు కలిగి నట్టులె తోచు,
ఎరువు దొరకు చోటు లరయ గలవు.

లఘిమ

వాసి మిన్న - రాశి భాసమానత కన్న,
అణువు మిన్న అతి బృహత్తు కన్న ;
అగ్గి రవ్వ మిన్న - హంస తల్పము కన్న,
సూక్ష్మ లలిత లఘిమ సుందరమ్ము.

బ్రతుకు

బ్రదుకు - అనిన - కావు పండుగల్ పబ్బాలు
కూడు గుడ్డ కూర్చు కొనుట కాదు ;
మేటి మెదడు కాదు - మేడ మిద్దెలు కావు ;
గుండె లోన వెలుగు కూర్చు కొనుట.

అదృష్టం

జయము రాదు శక్తి సామర్థ్యముల వల్ల
ఉండ వలె అదృష్ట యోగ గరిమ,
అభ్యుదయము లేక అజ్ఞాత వాసమ్ము ;
ప్రతిభ చేయ వలసి వచ్చు తరచు.

వేత్త కుండు గొప్ప విజ్ఞాన గరిమమ్ము
సంక్రమింప దొక్క జన్మ లోన ;
జ్ఞాన మగును జన్మ జన్మ సంస్కారమ్ము,
జీవనాడి తోడ చిట్ట చివర.

భారతీయత

భారతీయమైన - దారిద్ర్యమున దాగి,
పలు తెరగుల సంపదలు చెలంగు,
భూత దయను ఇచట బోధించె బుద్ధుండు,
ధనము కన్న మిన్న ధర్మ మిచట.

గుహ్యహేతువు

కాన రాదు గాని - గాలి వాటము మార్పు,
కదుపు ముక్కు దిక్కు గాలి కోడి ;
వదిలి పెట్ట వచ్చు - బాహ్య చిహ్నము లన్ని,
అసలు గుహ్య హేతు వరయ వలెను.

బ్రదుకు

ధరణి లోన లేదు పరిపూర్ణ మనుజుండు,
తప్పు లేవి లేని ధన్య జీవి,
లోటు లెన్నొ ఉన్న లోకంబు లోననే,
నరుడు తెలిసి బ్రదుకు నెరప వలెను.

అందం

అందమున్న మేలు - ఆడంబరత - లేక,
సరళ వేష భాష చాలు చాలు,
బ్రదుకు లోన అంతరంగ సౌందర్యమ్ము,
చలువ మించు వెన్నెలల సృజించు.

గానం

కానుపించ దాత్మ కందోయి కెపుడైన
కానుపించు ఒడలు కనుల ముందు,
ఆత్మకవసరమ్ము - అమృత సంగీతమ్ము,
తిండి అవసరమ్ము దేహమునకు.

ధర్మం

మతము భాష సీమ మమత లేవియు లేక
మనిషి బ్రదుకు గాక - మనిషి వోలె,
దీన జనుల సేవ - మానవత్వము చాలు;
దయను మించు నట్టి ధర్మ మేది ?

హాస్యం

జనుల కేది గూర్చు సద్యో రస విషద్య ?
వసుధ లోన హాస్య రసము తప్ప;
నరక సదృశ మైన చెరసాల జగమెల్ల !
హాస్య మొకటి గొప్ప ఆట విడుపు.

మతం

యుద్ధ మందు మనిషి ఓడి పోవుట వేరు,
వీరమరణ మొందు తీరు వేరు ;
పలువురు మతమునకు స్వచ్ఛంద దాసులే !
నెగ్గి నట్టి వారు నేల లేరు.

అందకత్తె

అందకత్తె యంచు అమ్మాయి ననరాదు,
కలదు గాన వెల్తి తెలుపు తోలు;
అవయవాల కూర్పు ఆకర్షణము లేదు,
కనుల తళుకు బెళుకు కానరాదు.

మనస్సు

వేయి పురులు విప్పి - వింత నాట్యము చేయు,
మనిషి మనసు ఇంద్ర ధనువు మించు,
నేల - నందన వని నెత్తావి తెమ్మెరల్,
గడుసు కలల నడుమ నడువ గలదు.

వ్యాస యోగి

మానవ స్వభావ మర్మజ్ఞు డెవరయా ?
భారత కవి యైన వ్యాస యోగి ;
వాఙ్మయము సకలము వ్యాసు నుమేచ్ఛిష్ట !
అంచు వేత్తలు ప్రవచించి నారు.

విధి వంచకుడు

వేత్త నీతి శాలి విధి వంచితుడె యైన
ఏమి చెప్ప నేర్తు రెవ్వ రైన ?
కాన రాని పాచికల పాత జూదమ్ము;
ధరణి మనుజ జీవితమ్ము తరచు.

మజిలీలు

కర్మ యోగి కొక్క గమ్యమ్ము ముఖ్యమా ?
కదలు యాత్రికుండు కనులు తెరచి,
మార్గ మందు ఉన్న మజిలీల వివరాలు
గుండె లోన అతడు కూర్చు కొనుత.

సహృదయత

జరుగ వచ్చు కవికి సన్మానములు పెక్కు,
అతని ప్రతిభ హేతు వనగ రాదు,
బ్రతుకు తెరచి చూడ - రసము యన్విష్టమ్ము ?
అది సహృదయ చరితార్థ సిద్ధి.

మలిసంజ

ముగ్ధ మోహనముగ - మూఢ విశ్వాసముల్
బుడగ లట్లు పగిలి పోయి నపుడు
అలము నింగి నేల మలిసంజ కెంజాయ,
ఇంపు సొంపు పెంపు లెసగ మెసగ.

ప్రక్క వాద్యాలు

రక్తి కట్టు చుండు -ప్రక్క వాద్యాలతో
కలుగు హెచ్చు శోభ - గాత్రమునకు ;
ఎట్లు జయము కూర్చు - ఏకాంత యత్నమ్ము ?
నేత - ఎంత గొప్ప నిపుణుడైన.

ధన్యజీవి

ధనము విలువ తెచ్చు కొనెను ధారుణి లోన,
కాలమునకు విలువ కట్ట లేము;
ధన్య జీవి యెవరు ? ధనము కాలము గూడ
పొదుపు చేయు వాడె బ్రదుకు లోన.

ప్రేమ

ప్రేమ అనిన - కాదు -శృంగార సంగమ్ము,
కాదు - కేవలమ్ము కామ కేళి ;
విశ్వ మైన ప్రేమ - నిర్వ్యాజ మైత్రియే ;
త్యాగ భోగ యోగ యాగ దీక్ష.

స్వగతం

మెదడు తప్పు - క్రుంగె - మేటి అంగము లెల్ల,
కన్ను చూపు చెదర కున్న దింక ;
తెలుగు మలచి పద్యముల వ్రాయు చున్నాను
క్రొత్త పాతల జత కూర్చి పేర్చి.

## వింత నిజం

ఎన్నొ కలవు శక్తు లింద్రియాతీతముల్ ;
ఎట్లు వాని నెల్ల ఎరుగ దగును ?
వింత నిజము - మూర్ఖ విశ్వాస మనరాదు ;
వచ్చు జ్ఞాన విప్లవములు పెక్కు.

## మంచి పని

పనిని మంచి దొకటి - భగవంతు మొగమునే,
చూచి చేయు నెడల అది తూచి ;
అతని ప్రేమ దేవు డాపాద శీర్షమ్ము,
సుఖము నొసగి - సర్వ శుభము లొసగి.

## భేషజం

క్రొత్త జగతి కోరుకొను సంఘ సంస్కర్త
ధరణి వాస్తవాలు మరువ రాదు
చావ రాదు - రోగి - శస్త్ర వైద్యము వల్ల,
భేషజమ్ము - తెచ్చు - పెద్ద ముప్పు.

## వింత ప్రేమ

పడెను వింత ప్రేమ సుడి గుండమున యందు,
వలచె తన్ను దాని వయసు వచ్చి,
పొంగి పొరలు నిత్య శృంగార లహరిలో
మునిగి తేలు ముగ్ధ మోహమందు.

## తెలియ రాని శక్తి

పక్షి కెట్లు గలిగె వృక్షమ్ము గూటిలో
గుడ్లు పొదుగు నట్టి కూర్మి బుద్ధి ;
పుట్టి నట్టి చోట పెట్ట నేలకొ గ్రుడ్లు ?
కడలి నెల్ల ఈది కడగి చేప ?

## సృష్టి

గణిత బద్ధ మౌచు గ్రహ తారకా సృష్టి,
సంచరింపచుండు చదల పైన ?
సృష్టి నెల్ల నడుపు ఏదియో ! ఏదియో !
తెలియ రాని శక్తి - కలదు కలదు.

## తెలియనట్టిది

మనుజు లందు కలుగు మైత్రి బంధము లందు
తెలియ నట్టి దెదియొ కలిసి యుండు,
హేతు వాద మున కతీతమౌ అంశాలు
శాస్త్రమమ్ము కూర్చు - మైత్రి కూర్చు.

## దయ

ఆచరణము ముఖ్య మాశయమ్ముల కంటె,
రోత గొలుపు-శుష్క నీతి బోధ,
ధర్మ మేది కలదు త్యాగ యోగము కంటె ?
దయయె-గరిమ నాభి ధర్మమునకు.

## సృష్టి

ఎట్లు చేరు పెరను - బుజు రేఖలో వ్రాలి
తిరిగి పూవు పూవు తేనె టీగ ?
ఆకసమ్ము లోన అల్లాడి దూరాలు
గూడు నెట్లు చేరు కొనును పక్షి ?
గోళ గోళ మెట్లు గురుతరాకర్షణన్
గగన మందు సతము కదలి యాడు ?

## భారతీయ భార్య

భారతీయ భార్య - పరమ పావన మూర్తి ,
ఆమె మారు పేరు త్యాగమునకు ;
కడగి శక్తి యున్న - కాలేయమును బోలి,
సేవ చేయు చిట్ట చివరి వరకు.

## కరుణ

కరుణ కంటె జగతి - కవిత గొప్పది కాదు ,
రోత గొలుపు వట్టి నీతి బోధ ;
ఉత్తమోత్తమమ్ము ఉపకార చర్యలే,
త్యాగ గుణము లేశ మైన మేలు.

## నాటకం

నాటకమ్ము - కవన ధాటీ ఘటన కాదు !
తరళ లోక వృత్త దర్పణమ్ము ;
చిత్ర జీవ పాత్ర చిత్రణోన్మేషమ్ము ;
నవ రస రుచిరమ్ము - నాటకమ్ము.

## స్వగతం

కవిత నాకు జీవ కైవల్య యోగమే !
రమ్య భవ్య దివ్య రస విషద్య;
ద్వంద్వ బద్ధ మైన - ధారుణీ స్థలి నుండి
నను మరో ప్రపంచమునకు చేర్చు.

## కవిత

క్రాంత దర్శనమ్ము - కవిత జీవితములో,
కవిత అవిన అవని కవలి వెలుగు !
కవిత రస సమాధి - కవిత - కైవల్యమే,
బొందె తోడ - ముక్తి పడయ వచ్చు.

### కవి - గాయకుడు

గౌరవింప బడును కవి కీర్తి శేషుడై
ఖ్యాతి - బ్రదికి యున్న కవికి రాదు ;
వర్తమాన మందు - ప్రజల మన్నన లంది,
గౌరవింప బడును - గాయకుండు.

### ప్రకృతి శోభ

నల్ల కల్ల బొల్లి నాట్య విన్యాసమే,
నాగరికత - పట్టణాల లోన,
సెలవు లందు వెడలి సెలయేటి కెరటాలు
చూడ వలయు ప్రకృతి శోభ కోరి.

### మొదటి వరుస

మొదటి వరుస లోన - పదవిలో ఉన్నట్టి
పెద్ద లుండ వచ్చు - పేర్మి తోడ ;
వెనుక వరుస లోన - విజ్ఞాని కూర్చున్న
గొప్ప తనము కేమి కొదువ రాదు.

### ఆత్మ వంచనం

బ్రదుకు నేరప వలెను - బహుళ భ్రమల మధ్య,
సంఘ జీవి మనిషి జగతి యందు,
బ్రదుక లేడు మనిషి - పర వంచనము లేక
వద్దు వద్దు ఆత్మ వంచనమ్ము.

### జగదేక కవి

అర్థ పర్థ మేది ? - అభిమాన కవి యున్న ??
కలవు గొప్ప గొప్ప కవిత లెన్నొ !
సహృదయ రసికులకు - జగదేక కవి లేడు;
శత సహస్ర ముఖ విశాల ప్రతిభ.

మరో ప్రపంచం

విప్ల వాగ్ని కీల - విస్ఫులింగ జ్వాల,
కక్కు నట్లు కలము కదుప నేల ?
కాను పించు గాత - కార్యాచరణ మందు
మన మరో ప్రపంచమునకు నాంది.

బహుజన హితం

సంఘ మందు హెచ్చు సామాన్య - జన సంఖ్య,
బహుజన హిత మెంచ వలయు - నేత,
నీతి బహుజనతకు ప్రీతి చేకూర్చుటే !
సగటు మనిషి సుఖము ప్రగతి సుమ్ము.

కవిత

మధుర లయలు హొయలు మాటలందునె గాక,
చిందు లాడు మౌన మందు గూడ,
సాగు లయలు వగలు చూపులందున తోచు,
విశ్వ లయ రహస్య భేది కవిత.

జన్మదినం

జన్మదినము నీకు సంతోష మిడుగాక
సార్థకమ్ము దాని సలుపు టెట్లు ?
స్వార్థము విడనాడి - ఆ ఒక్కనాడైన,
పర హితార్థ మీవు బ్రదుక వలెను.

సంఘసేవ

దేవు డున్న - దివిని - దేవుండు లేకున్న;
మనుజు లుర్వి నున్న మాట నిజము;
కలియ వచ్చు ఆస్తికులు నాస్తికులు చేరి
సర్వ సమ్మతమ్ము సంఘ సేవ.

దంపతులు

విరుగకుండ వంగు - వెదురు బొంగుల వోలె,
మెలగ వలయు దంపతులు సతమ్ము;
కరకు వాడి పదును ఖడ్గాలు కారాదు;
కలసి యుండ వలెను కత్తెర వలె.

విలేఖరి

నేడు చూడ విద్య గూడ వ్యాపారమై
సర్వ శాఖ లందు స్వార్థ మలమె,
ప్రగతి శీలి యైన పత్రికా రచయితే
ప్రస్తుతమ్ము దేశ భక్తి వరుడు.

నీతి నిష్ఠ యున్న నిత్య నిర్నిద్రుండు;
పత్రికా రచయిత భావుకుండు
సంఘసేవకుండు సమ్యగ్ వినీతుండు
సౌమ్య వాక చక్య సాహసుండు.

కవిత

వసుధ లోన - కవిత - వర్తమానము గాదు,
భావి కాల యోగ భావుకమ్ము ;
జగతి హితము కొరకు - స్వార్థమ్ము విడనాడి,
కప్పురమ్ము కరణి - కవి బ్రదుకుత.

నవ్వు

చింద వలెను పెదవి మంద హాసము సుంత,
నరుడు వెక్కి వెక్కి నవ్వరాదు ;
కనుల లోన నవ్వు కన్పింప వలె గాని,
గోల చేయ రాదు గాలి కలిసి.

మౌనం

పెదవి విప్ప వచ్చు పేత్త వేదిక మీద,
శిష్య తతికి బోధ చేయు కొరకు ;
వక్త - సభల చేయు - వ్యర్థ ప్రసంగముల్,
మౌన మరయ జ్ఞాని మాతృ భాష.

ఉపనిషత్ బోధ

తల్లి - తండ్రి - గురువు దైవమ్ములతో సాటి,
వారి పూజ చేయ వలెను - పూని ;
ఉపనిషత్తు లోని - ఉజ్జ్వలోజ్జ్వల బోధ,
సర్వ ధర్మ సార సంగ్రహమ్ము.

ఏకసూత్రధారి

పాచక ప్రవరులు - పదిమంది కూడుచో,
పాడు చేయ గలరు వంట వార్పు,
ఏక సూత్ర ధారి ఎవ్వడో ఒక్కండు,
తెర మరుగున పనులు తీర్చు గాత.

కొలతలు

స్థూల దృష్టి తోడ - చూడ - దిక్కులు నాల్గు ;
ధరణి మూడు కొలత లరయ వచ్చు ;
చాల కొలత లున్న - జగతిలో ఉన్నాము,
సూక్ష్మ బుద్ధితోడ చూడ గలుగ.

ప్రేమ

ప్రేమ మయిగ - బ్రదుకు - భామినీ మణి సదా,
స్వార్థపరుడు - పురుష సత్తముండు,
ప్రేయసి - రుచి చూపు ప్రేమామృతము తెచ్చి
అమ్మ - మారు పేరు త్యాగమునకు.

అనుభవం

మేటి అనుభవమున మేధావిగా వారు,
వసుధ వయసు మళ్లి ముసలి వాడు,
అనుభవమ్ము విలువ - అధికమ్ము బ్రదుకులో;
తెలివి కేమి ? చదువు బలిమి కేమి ?

వేషధారి

కలదు విశ్వ మందు కవి వేషధారులే !
జగతి వంచనమ్ము సలుపు వారు ;
అమరి యుండు గుండె ఆత్మవంచన కొంత,
చేత ముఖ్య మరయ కూత గాదు.

సుకవి

ప్రతిభ తళుకు బెళుకు - పరిహాస రసికుండు
గ్రంథ సంచయుండు క్రాంత దర్శి;
కపట మెరుగ నట్టి ఉపకార హృదయుండు,
సుకవి చక్రవర్తి సూక్ష్మ వేది.

స్వగతం

నేను జీవితమున - నిత్యశంకితుడనే !
లేవు నిశ్చయములు లేవు నాకు,
తెరచి గుండె తలుపు తిరుగాడ తలపోతు,
స్వేచ్ఛ కోరు కొనుచు స్వేచ్ఛ నిత్తు.

మూఢుడు

తనకు తెలియ దంచు మనిషి చెప్పిన చాలు,
కలదు జ్ఞాన మంచు - తలప వచ్చు;
నిక్కి తెలుసు నంచు నొక్కి వక్కాణింప,
ఎంచవచ్చు మూఢు డంచు అతని.

### కల్లలు

మంచి పనులు చేసి - మౌనమ్ము వహియింపు,
తప్పు పనులు తరచు ముప్పు తెచ్చు;
కల్ల బొల్లి కథల నల్లి చెప్పుట తప్పు;
ప్రజలు మోసగింప బడరు పిదప.

### సహనం

సత్య ఖండములకు - జగతి జిందాబాదు ;
బ్రదుక దగును పరుల బ్రదుక నిచ్చి;
వరలు గాత - వివిధ భావ వైరుధ్యముల్ !
సహన ముండు గాత - సంఘ మందు.

### ఆలోచనలు

నమ్మకమ్ము లేదు - నాకు నమ్మకముపై;
క్షణము క్షణము మారు సంఘ మందు;
అప్పటి కనువైన ఆలోచనలు చాలు;
జగతి లోన నిత్య సత్య మేది ?

### ఓర్పు

ఓర్పు వలన ఎన్నియో లాభములు వచ్చు,
సానుభూతి కలుగు జనుల నుండి ;
ఓర్పు ఒక తపస్సు - ఒక సాధనా దీక్ష ;
వేచి యుండు శక్తి - విజయ మిచ్చు.

### నేపథ్యసేవ

నిలుచు వారు కలరు నేపథ్య సేవలో
యశము కొరకు ప్రాకులాడకుండ !
శుభ ముహూర్తమునకు శోభాభిరాములై,
సభకు వచ్చు ప్రముఖ జనులు కలరు.

## స్వేచ్ఛ

స్వేచ్ఛ లేని యెడల - ఏది ఆనందమ్ము ?
చేయువచ్చు తప్పు స్వేచ్ఛ కొరకు ;
అరయ బ్రదుకు లోన - ఆనందమే - బ్రహ్మ !
పరమ ధర్మ నీతి ధరణి లోన.

## శిష్యుడు

అంత మేలు గాదు - అంధానుసరణమ్ము ;
గురువు వెంట బడుట గూడ తప్పు !
గురుని పైన ఎంత కూర్మి పేర్మిలు గల్గ,
స్వేచ్ఛ వీడ రాదు శిష్య వరుడు.

## యాత్రలు

తా చదువు కొనినవి - తా చూచి నవి యెల్ల,
అంతరంగ మందు అతికి యుండు;
వెడలి వచ్చు నెడల - వివిధ సీమల కేగి.
ఎదుగు వ్యక్తి గుండె ఎల్ల లెల్ల.

## గడ్డి విరులు

చూడ నేల సొగసు సూర్య చంద్రుల లోన,
పర్వత శిఖరాగ్ర పంక్తు లందు ?
మిణుగు పురుగు లందు - మింటి తారల యందు,
గడ్డి విరుల సొగసు కాంచ వచ్చు.

## వెఱ్ఱి

వెదకి చూడ విపుల విశ్వమ్ము సర్వమ్ము,
లేడు వెఱ్ఱి సుంత లేని వాడు
ఎంత జ్ఞాని యైన ఎచటనో మెదడులో
వేప కాయ యంత వెఱ్ఱి దాగు.

సహజ శక్తి

ఈది నదిని కడలి యెట్లు చేరును చేప ?
పుట్టి నట్టి చోట పెట్టు గ్రుడ్లు ;
ప్రకృతి సిద్ధ శక్తి - ప్రాణి కోటుల కెల్ల,
సృష్టి యందు సంక్రమించుచుండు.

కాలం

చాల చోట్ల తోచు - కాలమే ధనమౌచు,
కాల మహిమ తెలియ కష్ట తమము;
కలి యుగమ్ము నందు కాల తత్త్వజ్ఞుడే,
ఉత్తముండు యోగి సత్తముండు.

మరవి

వింత లందు వింత - విశ్వ మందున ఏది ?
మానవ స్వభావ మర్మ మహిమ !
మనుజు మెదడు సృష్టి మకుటాయమానమ్ము ;
మనుజు నదుపు చేయు మరణ మొకటె.

అమ్మ

మిగత జగతి యెల్ల - మిథ్య యైనను గాని,
తథ్య మైన దొకటి - తల్లి - కలదు,
సర్వ మనుజ చరిత స్వార్థ లోభమె యైన
అమ్మ మారు పేరు త్యాగమునకు.

బంగారం

వాడు నెట్లు మనిషి బంగారము - గడించి ?
మారు చుండు సరళి మనిషి బట్టి ;
ముండ కొరకు కాముకుండు కూర్చును నగల్,
ధనిక లోభి పెట్టె దాచి పెట్టు

తాల్పు దేహమందు దర్పాభిరాముండు
ప్రజకు ధర్మ దాత పంచి పెట్టు,
వ్యయము చేయు భోగి వాహనాదుల పైన
విడుమ వారసులకు వెట్టి వెధవ.

## నిద్ర

నిద్ర దేహమునకు - నిత్యావసర మెంచ,
మౌన మవసరమ్ము - మానసమునకు,
అందజేయు నిద్ర ఆయురారోగ్యముల్,
మనసు కడుగ గలదు మౌన నిష్ఠ.

## కవి

బ్రదుకు లోన - కవిత - వ్యక్తిత్వ లేశమే
సుకవి యెవడు ? వాక్య శూరుడె గద ;
మిన్న మంచి పనులు - మేటి మాటల కన్న ;
స్వప్న భోజనుండు - వ్యర్థ జీవి.

## సామరస్య నీతి

పాలకులకు నీతి - పాలించు విభజించి
ఏన చేయు గలుగు నట్టి దేమి ?
స్వస్తి చెప్ప వలె వివాద ఘర్షణ కెల్ల,
ప్రజల నీతి సామరస్య మగుత.

## వ్యవధి

మేటి భ్రమల మధ్య - మిధ్యా జగత్తులో
గడపు బ్రదుకు మనిషి కనులు మూసి,
వీలు వ్యవధి ఏది ఆలోచనము సల్ప ?
ఈ పురాతన భువి స్వేచ్ఛ ఏది?

ప్రగతి

ప్రగతి కూర్చు లేదు స్వపరాగ పర్వమ్ము
అలరు కుక్కిమూలి పిందెలెపుడు
సంఘ జీవితమున సాహితీ జగతిలో
పరపరాగ మెపుడు ప్రగతి సుమ్ము

మంచితనం

గడును దనము కన్న - కార్య దక్షత కన్న,
మంచి తనము మేలు మనుజు లందు !
ఇహము నందు ఉన్న - ఏ తులా భారమ్ము
మంచి తనము విలువ మించలేదు.

పాట

పాట లోని మాట సూటిగా గురి చేరి
గుండె - కలవరమ్ము కూర్చు వచ్చు,
గాఢ నిద్ర నున్న ప్రౌఢ చైతన్యమ్ము
మేలు కొనిన మన్ను మిన్ను గలియు.

వ్యంగం

వ్యంగ్య గర్భితమ్ము లన్యాపదేశముల్,
గౌరవింప దగిన కవిత లౌను;
మించు భావయుక్తి మిరుమిట్లతో వెల్గు
హొయలు గలిగి శ్రుతులు లయలు గలిగి.

గుప్త కాంక్ష

గుప్త కాంక్ష దాగు సుప్త చైతన్యాన
మనుజ మాత్రు పొరల మనసు లోన
వ్యర్థ వాద మేల ? అజ్ఞాన జలధిలో
మునిగి తేల వచ్చు మనుజు లెల్ల.

నాస్తికత

నాస్తికత్వ మంచు - ఆస్తికత్వమటంచు
హేతు వాదమంచు ఏల చర్చ ?
వద్దు వద్దు వ్యర్థ వాదోపవాదముల్
ప్రగతి కొఱకు పాటు పడుట మేలు.

వినయం

జగతి లోన నేడు సర్వజ్ఞు డెవ్వండు ?
వినయ సహనములు వివేకి సొత్తు;
తెలియదంచు తాను తెలియువాడే జ్ఞాని !
మేలు - తెరచి యుంచు మెదడు మిన్న.

భ్రమలు

పదవి - వాహనములు చదువు సంపద లెల్ల,
బ్రదుకు లోన పెక్కు భ్రమలు గొలుపు ;
భ్రమలు చుట్టు ముట్ట వచ్చు జీవితములో
వదల రాదు మానవత్వ మెపుడు.

రాజకీయాలు

రాజకీయమందు రాజీ పడుట మేలు ;
కొంత కొంత వరకు - గుండె లోన,
అయిన అంతరాత్మ నణచి వేయగ రాదు,
మేటి నీతి గీత దాట రాదు.

యాత్ర

అసలు యాత్ర కాదు ఆకాశ యానమ్ము
అరయ నట్టి దేమి ? అక్షి యుగళి ?
పాదచారి యగుచు పయనించ మనుజుండు
కోడె నెమ్మి వోలె ఆడు మెదడు.

### కవిత

ప్రజల కనుల ముందు - గిజిగాని గూడులా
గోచరించు గాత - గొప్ప కవిత ;
పడుగు పేక పోలె పదము లర్థము గూడి,
పసిడి మిసిమి పట్టు బట్ట యగుత.

### ప్రగతి

జగతి దిక్కు లెల్ల సాపేక్షకమ్ములే !
ఏది పడమర - మరి యేది తూర్పు ?
ప్రగతి అనిన - పర పరాగ సమ్మేళనే,
సామరస్య బృంద జంత్ర హేళి.

### దేశికుడు

దేశికుడన మాంసదేహ మాత్రుడు కాడు
మిన్ను త్రోవ తోచు వేల్పు విల్లు :
కడగి పెట్ట వచ్చు గిడిగిళ్లు శిష్యుండు;
మన్ను మీద నిలచి కన్నులద్రువ

### కవిని

నేను కవిని - బ్రదుకు నిర్వహించెద సదా
అంకితమ్ము సేసి యశము కొరకె;
నేను పూల దండ నెత్తావి త్రోవలో
నయన యుగలి మూసి నడువ గలను.

### కవిత

బహు గుణ గణ చతుర బంధమే కవనమ్ము;
చెల్లి దేకదేశ సిద్ధి - ఎపుడు ;
మించు హొయల భాష - మిరుమిట్లు భావముల్
అల్లిక జిగి బిగియు - అమర వలయు.

### నవ్వు

నరుని చర్య లందు చిరునవ్వు మాత్రమే
శ్రేష్ఠ తమ మటంచు చెప్పదగును,
పెదవి పైన నిలువు వేదాంతి విజ్ఞాని;
వెన్నెల వెదజల్లు పిన్న నవ్వు.

### కరుణ

పృథివి చుట్టు - తిరుగు పెక్కు నక్షత్రముల్
నేడు భూత కాల నీతి మారు
తోచు - తిరుగ కుండ - ధ్రువతార ఒక్కటే
పరమ ధర్మ నియతి - కరుణ స్థిరము.

### జ్ఞానం

కనులు మూసి చేర గమ్యమ్ము సరిపోదు;
అరుగు గాత మెదడు తెరచి - నరుడు !
మనిషి నేర్చు కొనుత మజిలీలలో గూడ,
సరసయాత్ర జ్ఞాన సంగ్రహమ్ము.

### మూడు

ఎనుబదేండ్లు దాటె - ఇహ లోకమున నాకు
మూడు దుఃఖ తాపము కలిగించు ;
కులము ధనము పదవి జులుములే ఈనాడు
పెత్తనమ్ము చేయు పృథివి మీద.

### మతములు

జగతి లోని సర్వ సంస్థాగత మతాలు,
ఎల్లకాల మెట్లు చెల్ల గలవు ?
ఊత కఱ్ఱ లెప్పు డుపయుక్తములు గావు,
తెలియ తనకు తానె దీప కళిక.

ముక్తి

మనిషి తనకు తాను మార్గ దర్శకు డౌత,
క్షణము క్షణము మారు జగతి లోన,
ఎచట కలదు ముక్తి కైకైక సూత్రమ్ము ?
మనిషి బోలు నట్టి మనిషి లేడు.

కవిత

ఎంచ - కవన ఫణితి - ఎక్కిళ్ల కెరటాలు,
తుమ్ము దగ్గు లట్లు తోచరాదు
కవిత తోచ వలెను కమ్మ తెమ్మెర వోలె !
క్వణిత కచ్ఛపీ రవమ్ము వోలె.

మంచి పనులు

కవి వరుండు కట్టు గాలి మేడలు పెక్కు ;
కాగితాలు చాలు కలము చాలు ;
బ్రదుకు లోన మంచి పనులు చేయుట మేలు
ప్రగతి వచ్చు జగతి బాగు పడును.

నవయుగోదయం

అతిశయింప - శ్రోత్రియ బ్రాహ్మణ బ్రువుల్,
ప్రగతి అభ్యుదయములు రావు - రావు ;
సంఘ మెల్ల మార - సర్వతోముఖముగా
నవ యుగోదయమ్ము నాంది పాడు.

ఛందస్సు

ప్రతి కవీశ్వరునకు - ప్రత్యేకముగ ఉండు;
ఒక్క శ్రుతియు మరియు నొక్క లయయు;
సాహితీ రచనకు - సరిపోదు ఛందస్సు !
అదనము లగు నియతు లవసరమ్ము.

ఉత్సవాలు

ఉత్సవాలు సభలు ఉత్సాహ మందించు;
దులుపు మనసు లోని కిలుము గిలుము;
ఎగుర వేయు హృదయ గగనాన జెండాలు
మేలు కొలుపు నిదుర మెదడు లెల్ల.

విప్లవం

ఏల విప్లవమ్ము రాలేదు ? మన నేల ?
పడిరి దళిత జనులు బాధ లెన్నొ ;
భూత దయ అహింస బుద్ధుండు బోధించె;
పండి నట్టి గుండె భరత ప్రజది.

కవిత

సరస కవిత యైన - సామెతై రూపొందు,
నాట్యమాడు ప్రజల నాల్క లందు;
కవిత నిదుర పోదు - గ్రంథాలయాలలో;
పారు సతము నీటి యేరు వోలె.

నా శిష్య సంపద

చిత్త శుద్ధి యున్న శిష్య సంపద నాకు
కలదు నాల్గు దెసల తెలుగు నేల ;
గురువు మించు నట్టి గొప్ప వ్యక్తులు వారు;
పావనత్వ మందు ప్రతిభ యందు.

కవిత

గున్న మావి మీద-కోకిల ధ్వని వోలె,
కన్నె కనుల నవ్వు వెన్నెల వలె,
మంజు మంజుల మృదు మణిత కాకలి వోలె,
అవతరింప వలయు కవిత లయలు.

భావి

చప్పు కవి వరుండు - సమకాలికులు తధా
కవిత మిగులు భావి కాల మందు ;
విలువ యున్న కవిత - నిలిచి యుండును సదా
అంతరించ కారణాంతరాలు.

కవిత

సరస కవిత యనిన - శబ్దార్థముల యందు,
చతుర సామరస్య సాధనమ్ము ;
అవతరించు గాత - అర్ధ నారీశమై,
యోగ పద్య యుగళ యోగ సంధి.

కవిత

కావడి ఒడు పట్లు - కవన శబ్దార్థాలు,
ఉండ వలెను రెండు కుండ లట్లు ;
యుగళ గీతి లోని ఉయ్యాల ఊపులై
లాస్య మాడ వలెను లయలు శ్రుతులు.

చిద్రసర్షి

బోధి సత్వు డవర బోధాయన మనీషి,
జిడ్డు కృష్ణ మూర్తి చిద్రసర్షి ;
జనుల హృదుల పసిడి సంకెళ్ల ఛేదించె,
దులిపె యుగ యుగాల కిలుము బూజు.

సరీశతం

వృత్తి చేత నొజ్జ నైక వేత్తగా
చెప్పి తర్పకులను చేర్చి - చదువు;
జ్ఞాన వృద్ధు లున్న సభలోన వక్తగా
వేది మీద నిలుచు వేడ్క - తీరె.

భావ లయలు

కలియ భాష లోన - తళుకు బెళ్కులు కొన్ని,
కవిత కొంత రక్తి కట్ట వచ్చు,
ఉన్న యెడల తూగు టుయ్యాల లయ హొయల్
భావ మందు గూడ - భళిర - భేష్.

గురుడు

నిత్య జాగృత మగు ప్రత్యక్ష సన్నిధై
ఉండు గురుడు శిష్యు గుండె లోన,
అక్షయానుభూతి - సాక్షాత్ ప్రభా భాతి
నెమరు వేయ దగిన నీతి - కూర్పు.

పాత్ర దానం

ధరణి పెక్కు మంది ధనవంతు లున్నారు;
పలువు రుండ వచ్చు ప్రతిభ కలిగి;
గుండె పండి నట్టి గొప్పవాడెవడయా ?
గుప్త పాత్ర దాన కోవిదుండె

పద్య కవిత

ప్రజల గుండెలో చిరంజీవియే గదా,
విద్యు దంగ రంగ పద్య విద్య;
జంత్ర గాత్ర గాన సంసార సంయుక్త;
నాల్క - పద్య కవిత నాట్య మాడు.

పద్య కవిత

పుట్టే - పుబ్బ లోన - గిట్టవా? మఖ లోన?
వచన కవిత లెల్ల - మనుధ లోన
జీవ శక్తి కలదు - ఛందస్సు లోననే
పద్య కవిత - చిరము బ్రదికి యుండు.

వృద్ధుడు

పదవి యున్న వారు - ప్రజల ఆదరణమ్ము
పూల దండ తోడ పొంద వచ్చు ;
కాటి కొరకు రెండు కాళ్లు సాచిన వృద్ధు ,
పిలుచు వార లెవరు పీఠ మిచ్చి.

నటుడు

మనసు లోన అతడు మగ ఆట వెలదియే,
నొసలు వెక్కిరించు - నోరు పొగడు;
నవ రస రుచిరుండు - నాట్యాభిరాముండు
చిందు నతడు నాద బిందు కళలు.

భార్య పలుకు

కార్చి నపుడు నీవు కన్నీరు గుట్టుగా
ఏను - వెక్కి వెక్కి ఏడ్తు వేగ;
నీకు దెబ్బ తగుల నాకు నెత్తురు కారు;
కూడి యుందు నిన్ను మేడ కూల.

నవ్వు

వినను - చదువ లేను వేదాంత కవనాలు
నాకు చాలు కొన్ని నవ్వు పూలు ;
బ్రదుకు - పూత పసిడి - పచ్చి బొంకుల దిబ్బ ;
మందహాసమె ఋషి మాతృ భాష.

నవ్వు

మానవాళి కెల్ల ఆనంద యోగమ్ము,
సహజ సిద్ధ మైన జన్మ హక్కు ;
నవ్వు లధిగ మించ నమనోన్మేషుడై
నగటు మనిషి పరవశత్వ మొందు.

### పద్యకవిత

పద్య కవిత యన్న - ప్రతిభ మాత్రమె కాదు
రస సమాధి అవసరమ్ము తుదకు,
ఉండవలెను కొంత వ్యుత్పత్తితో బాటు;
ఛంద మమర చేయు స్వర జతి గతి.

### మార్పు

సాహసింప వలెను - సంప్రదాయము మార్పు,
క్రొత్త నీరు ప్రగతి కోరు కొనును ;
పరుగు లెత్త రాదు - కొరివి దయ్యము వెంట,
నిత్య నూత్నమైన నీతి "మార్పు."

### గురువు

భక్తి కలుగ జేయు పాఠ్యాంశముల పైన
గొప్ప గురు వటంచు చెప్పరాదు ;
శిష్య తతుల - గురువు - జిజ్ఞాసువుల చేసి,
గ్రంథ పఠన పైన - రక్తి పెంచు.

### పాఠశాల

బడి యటన్న స్కూలు భవనాలు మాత్రమా ?
బ్రదుకె ఒక్క పెద్ద పాఠశాల ;
మనిషి చదువు సాగు మరణ పర్యంతమ్ము,
అవని యెల్ల బడియె అరయ గలుగ.

### కరుణ

బ్రదుకు లోన ఏది ప్రథమ కర్తవ్యమ్ము
త్యాగ నియతి నిరతి - దాన నిష్ఠ;
బ్రదుకు అనిన క్రూర రాక్షసత్వము గదా,
కరుణ లేక దాన నిరతి లేక.

దాత

కవిత కన్న మిన్న - కరుణార్ద్ర హృదయమ్ము ;
దాత కన్న ఎవరు ధన్య జీవి ?
లోచు రాత్రు లందు - ధ్రువతారయ్యై నింగి,
నేల - దీప గృహము వోలె - క్రాలు.

సత్కారం

జరిగె నేని గొప్ప సత్కార యజ్ఞమ్ము
జగతి లోన - ప్రతిభ చాటు కొరకె ;
ధన్యు డగును దాత - ధర్మ దానము చేసి,
పుచ్చు కొన్న వాడు - పూజ్యు డగును.

దాత

ఆకు లున్న - చెట్టు - అందమైనది కాదు ;
పూవు పిందె లున్న - తీవి వేరు ;
అమరి యుండ వచ్చు - ఐశ్వర్యములు పెక్కు ;
ధన్య జీవి కాడు దాత కాక.

గుప్తదానం

త్యాగయోగ మయము - స్వార్థ రాహిత్యమే
తీర్పు చెప్పవచ్చు దివ్యత అని ;
ఉర్వి ధన్యు డెవ్వ డుపకార శీలియే !
గుప్త పాత్ర దాన కోవిదుండె.

దాత

సరళ కవిత వ్రాయు సంకల్పమున కంటె,
సరళ జీవితమ్ము చాల మేలు ;
ఆత్మ సుఖము కొరకు - వ్యయము చేయని వాడు ;
దాన మిచ్చు వాడు ధన్య జీవి.

### ధనం

ధనము కూర్చి వచ్చు - తంటాలు పడి పెక్కు ;
శాక్య చాకచక్య లాలసుండు ;
ఒక్క త్యాగ యోగి ఒక స్థిత ప్రజ్ఞుండు
ధనము ప్రోగు చేసి - దాన మిచ్చు.

### దానం

బ్రదుక లేడు కొంత పర పీడనము లేక,
ధరణి మీద నున్న నరు డెవండు
బ్రదుకు లోన పాప పరిహార మున్నదా ?
దాన గుణము భూత దయయు తప్ప!

### ధనం

ఎట్లు ధనము వచ్చు ? చెట్లపై కాయునా ?
మనము నిదుర లోన మునిగి తేల ?
వేయ వలెను ఎత్తు పైయెత్తు తెలివితో,
శ్రమ పడవలె పగలు రాత్రి గూడ.

### రూక

అవసరమ్ము బట్టి ఆయా స్థితులు బట్టి ;
రూక విలువ మారు లోక మందు ;
విద్య కొరకు వేరు - వేరు జూదము నందు ;
దాత చేతి రూక ధన్య తమము.

### ఆయుధాలు

ఆయుధాలు లేని రాయబారము లెల్ల
చతుర గాత్ర గాన సభయె అగును,
జంత్ర వాద్య బృంద సహకారమే లేక ;
గాన విద్య రక్తి కట్ట బోదు.

### అదృష్ట యోగం

చదువు శీల శక్తి సామర్థ్యములు గల్గి,
రక్తి కట్ట నట్టి బ్రదుకు లెన్నొ,
ఓ అదృష్ట దివ్య యోగమా నీ స్పర్శ
మనుజ జన్మ లేశ మాత్ర చాలు.

### కవిత

సహృదయుండు మెచ్చి - చదువ మూడవ సారి,
గొప్ప దంచు - కవిత - చెప్ప వచ్చు ;
చదువ మరల మరల బ్రదుకు సాత్మ్యము గూర్చు,
అది ఉదాత్త కవిత ఉర్వి మీద.

### జ్ఞానం

కలలు విద్య లంధ గజ దర్శనము గదా,
ఎఱుక - భాగహార హీన లవము,
నరుడు ప్రాప్య దృగి అనంతమ్ము జ్ఞానమ్ము !
విద్య కాత్మ - సహజ వినయ గరిమ.

### దాత

ఎవరు మరణ మొంద అవని భారము తగ్గ ;
లోటు లేదు ప్రజకు చేటు లేదు ;
మరణ మొంద దాత కరుణ సాంద్రత తగ్గ ;
ఎండి పోవు పుడమి గుండె కొంత.

### ఒక్క పద్యం

పలుకు పొంకము జిగి - తలుపు బింకము కల్గ,
పద్య మొకటి సత్ ప్రబంధ సమము ;
ఏల మోయ వలయు ? ఎండు కట్టెల మోపు ?
తావి చిమ్ము ఒక్క పూవు చాలు.

దాత

ధనము వ్యయము చేయు మనిషి - స్వార్థమునకై
తేలి - లాభ లోభ దృష్టి లోన,
పరుల కొరకు ఎవడు వ్యయము చేయునో వాడె,
త్యాగ యోగి దాత ధన్య జీవి.

దాత

అవని ధనమె అన్ని అవతారముల నెత్తు ;
ధనము మహిమ ఎన్న - తరము గాదు ;
వ్యయము చేయు భోగి స్వార్థమ్ము కోసమై ;
త్యాగ భోగి దాత - ధన్య జీవి.

ఒంటె

ఒక కురూపి - ఒంటె - ఉపకరించును సదా ;
మంచి గుండె గలిగి - మానవులకు ;
మాంస భక్షి - క్రూర హింసా స్వరూపియే,
అంద మున్న నేమి వ్యాఘ్ర మున్న ?

కాలయాపనము

కావలసిన పనిని - గంధర్వు లెవ్వరో
తెర మరుగున నిలిచి తీర్చవచ్చు !
విలువ యైన పనియె విశ్రమించుట గూడ,
కాల యాపనమ్ము మేలి కళయె.

విజయం

గొప్ప విజయమునకు గుప్త కారణ మేది ?
స్థిర గభీర ధీర చిత్త శుద్ధి ;
హేతు పూత మైన - ఏకైక లక్ష్యమ్ము;
త్యాగ యోగ గర్భిత మగు నీతి.

### దేవు దయ

అగ్ని పర్వతాల ఆగ్రహావేశముల్,
ధారుణీ ప్రకంప తాండవాలు,
పెను తుఫాను లోని బీభత్స జృంభణల్,
ఎట్లు దేవు దయను ఋజువు చేయు ?

### గ్రహాయానం

ధరణి చాల మంది దారిద్ర్య బాధచే,
కగ్గి కుమిలి క్రుంగి క్రుగ్గు చుండ,
ఖర్చు పెట్ట నేల ? గ్రహాయానముల పైన,
క్రొత్త ఆయుధాలు కూర్చు కొనగ ??

### శాంతి

కోరి కోరి ఒక ఎడారినే నిర్మించి,
గొప్ప శాంతి యనుచు - చెప్ప రాదు ;
వసుధ - భిన్న వాద వైరుధ్యముల మధ్య ;
శాంతి నెరప వలెను సంధి చేసి.

### ఆటబొమ్మ

అమ్మ పాలు బిడ్డ కాయు రారోగ్యముల్,
దేహ బలము పుష్టి తీర్చి కూర్చు ;
ఆట బొమ్మ కూర్చు ఆనంద యోగమ్ము,
బిడ్డ మనసు పరిధి పెంచ గలదు.

### ధనం

ధరణి కష్ట తమము - ధన సమార్జన సుమ్ము;
లలిత కళయె వ్యయము సలుపు తీరు,
అతిశయించు ప్రగతి యావజ్జగత్తులో,
ధనిక వరుడు పాత్ర దాత యైన.

రససంఖ్య

నవ రసమ్ము లంచు - కవులు చెప్పగ వచ్చు,
స్థాయి భావ యోగ సంఖ్య లెన్ని ;
వేల రసము లెన్ను వేదాంతి జగతిలో !
అనుభవమ్ము బట్టి మనసు తెలిసి.

కవిత

కవిత కుండ వలెను - గగన తారల యెత్తు ;
గాలి విస్తరణము కడలి లోతు;
కేలి సలుప వలెను - గిజి గాని గూడులా;
అల్లిక జిగి బిగుతు లల్ల లాడ.

కవిత

వదల వచ్చు గాక - వచనమ్ము ఛందస్సు,
కలదె కవిత కంత కంటె హాని ?।
ఛంద మంద జేయు - చైతన్య యమకముల్;
అచ్చమైన కవిత కవసరమ్ము.

ఆర్జవం

ఆర్జవమ్ము మనిషి వ్యక్తిత్వమున కాత్మ ;
దేహ పుష్టి కాదు - తెలివి కాదు ;
సానుభూతి కలిగి సహృదయుండగు వాడు
ఉత్తమోత్తముండు - యోగి వరుడు.

పద్య కవిత

కలియు వచన కవిత - గాలిలో ధూళిలో
ప్రగతి శీలమైన - ప్రతిభ యుండి
పద్య కవిత - పొదుగ బడి - ఛందము నందు
నాట్య మాడు - ప్రజల - నాల్కలందు.

### కన్య

గర్భ వతియె యైన - కన్య-పెండ్లికి ముందు
ఎవరి కెరుక ఆమె హృదయ బాధ ?
కష్ట తమము ఆమె గర్భ విస్రావమ్ము ;
అవసరమ్ము కరుణ కామె కపుడు.

### ఉగాది షాడబం

ఆరు రుచుల పైన - ఆంధ్ర జాతికి ప్రీతి ;
ఇది వసంత ఋతువు - ఇది ఉగాది ;
ఆరగింప రండు - సారస్వతము నందు ;
షాడబమ్ము చవులు - సరసులార.

### ధనం

కలి యుగమ్ము నందు - కామ రూపిణి యేది ?
ధనము ధనము మరియు ధనము ధనము !
వేయ గలదు - ధనము - వేలవేల్ వేషాలు;
ధనము లొంగ దీయు ధరణి నెల్ల.

### శ్రోత్రియత

బ్రతుకు తోడ కొంత రాజీ పడక యున్న,
సుంత సుఖము లేదు శుభము కాదు
మనసు తలుపు మూసి - మడి కట్టు కున్నచో ;
శ్రోత్రియత్వ మెల్ల కుళ్లి చచ్చు.

### స్వగతం

ఏవగింతు నేను భావ దాస్యము సదా
అభ్యసించి నాడ ఆంగ్లభాష ;
సంగ్రహించి అపర సంజీవనీ విద్య ;
క్రొత్త తెలుగు కవిత కూర్చినాను.

## సాహితీ వరివస్య

వడలు చుంటి దినము వార్ధక వ్యధలతో
మందు లేవి జరను మాన్ప లేవు ;
సర్వ రోగ హరము - సాహితీ వరివస్య;
బొందెతో విముక్తి పొంద వచ్చు.

## స్వగతం

జ్ఞాని కాను నేను - సంశయ గ్రస్తుండ ;
నాకు లేవు ఎట్టి నమ్మకాలు ;
మతము గితము లేదు మానవత్వము తప్ప ;
భక్తి లేదు దేశ భక్తి లేదు.

## భాషలు

భాష లేవి యైన - బంగారమును బోలు,
విశ్వ కవిత వేరు - వేరు నగలు ;
కూర్చి నాడ - కడిగి - క్రొంగొత్త భూషలే ;
తెలుగు తళుకు మెరుగు తీర్చిదిద్ది.

## స్వగతం

నేను నదిని గాను - నేను వంతెనను సుమ్ము,
వెలుగు బాట వేసి కలుప గలను,
చూడ బ్రదుకు నందు - సూది దారము నేను
కత్తిరింపు లతికి కలుప గలను.

## కవిత

కలలు రేప గలదు - కలవరింతల తోడ,
కైపు కలుగ జేయ గలదు - కవిత,
అమృత యోగ సిద్ధి - ఆసహస్రారమ్ము
కవిత - మార్చు రస జగత్తు లోన.

### నాస్తికుడు

విద్యమాన మైన విశ్వ శిల్పము మధ్య,
　　ఆత్మ వంచకుండు నాస్తికుండు !
మతము చెప్పు నట్టి మాయ దేవుడు లేడు;
　　తెలియ రాని శక్తి - కలదు కలదు.

### ప్రకృతి సౌందర్యం

వెఱ్ఱి ఒత్తిడులను - విశ్వ మెల్లెడ గూర్చు ;
　　నవ్య నాగరికత నరుల లోన ;
జగతి లోని ప్రకృతి సౌందర్యా వీక్షణే ;
　　వెఱ్ఱి బాపు రూఢి వేద్య - సుమ్ము.

### హేతువాదం

పట్టి విడువ నట్టి - బ్రహ్మ రాక్షసి సుమ్ము;
　　బ్రదుకు లోన హేతు వాద మనిన,
దరికి చేరు వాడు దాసుడే జాగ్రత్త !
　　మౌన మూని యే నమస్క రింతు.

### విలువ

విలువ కల్గ నగును - వినియోగమును బట్టి,
　　వివిధ వస్తువులకు - విశ్వ మందు,
ఎంచి చూడ అగ్ని మంచిదా ? చెడ్డదా ?
　　అట్టిదే ధనమ్ము అవని లోన.

### త్యాగం

తనకు మాలి నట్టి - ధర్మ మేదియు లేదు
　　జగతి లోన మనుజ సంఘ మందు ;
హాని జరుగ గలదు - అసమర్థు చేతిలో,
　　త్యాగ యోగ మునకు - ధర్మమునకు.

### క్రైస్తవులు

గంగి గోవు వంటి క్రైస్తవ ప్రజ నేడు,
భరత దేశ పౌర వరులు కలరు ;
వర పరోపకార పారీణ జీవనుల్ ;
చదువు వారి కయ్యె బ్రదుకు తెరువు.

### ఆత్మ సౌందర్యం

పాంచ భౌతిక మగు - బాహ్య రూపము నందు,
కాన రాదు - వ్యక్తి ఘనత తరము ;
వ్యక్తి లోన దాగు ఆత్మ సౌందర్యమ్ము ;
చూడ గలడు తరము సుకవి యొకడె.

### ఆత్మ

సాగరమ్ము కంటె సమ్మోహనంబేది ?
గగన సీమ దిగ్ దిగంత పరిధి ;
గగన సీమ కంటె గంభీర తర మేది ?
అంతరంగ నిష్ఠ మైన - ఆత్మ.

### రాజ్యాంతం

ఎవరు తీర్చి దిద్దు ? అవినీతి లేకుండ,
రాజకీయ నవ్య రంగ హేల ?
నరక యాత్ర ధ్రువము పరిపాలనాంతాన
కోత లేల = నీతి కూత లేల ?

### వ్యసనం

అందఁ చేయఁ గలదు - ఆనంద సందీప్తి,
వ్యసన మొకటె మనుజ బ్రదుకు నందు,
ఉన్న యెడల ఉత్తమోత్తమ వ్యసనమ్ము,
విశ్వ మందు అది కవిత్వ మొకటె !

### ప్రగతి

సాంస్కృతిక పరాగ సమ్మేళనము వల్ల ,
అవతరించు ప్రగతి అవని యందు,
విశ్వ మానవత్వ వేదాంత చంద్రికల్,
విందు గాత తెలుగు గుండె లందు.

### దాత

చెడు గుణాల నెంచి - చీదరించుట మాని,
ఆదుకొనుట మేలు - ఆర్త జనుల,
పర హితార్థి - దాత - ప్రత్యక్ష దైవమే,
దాత కన్న మిన్న - ధరణి లేదు.

### వృద్ధ కవి

తిండి ఔషధములు రెండు చేయువు మేలు;
శ్రేయ మెట్లు కలుగు వృద్ధ కవికి ?
చేయ సత్కృతులను - ఆయురారోగ్యముల్,
కూడి వ్రాయు సుకవి గొప్ప కవిత.

### సృష్టి

చిత్త కార్తి లోన - శృంగార పరిధిలో
కుక్క లెల్ల - చేరి - కూడు చుండు;
సృష్టి తిరుగు చుండు - ఋతుచక్ర పరిధిలో
సృష్టి యెల్ల గణిత చిన్మయమ్ము.

### స్వాగతం

కలలు కలవరించు అలల నా మెదడులో,
పుడమి కౌగిలించు కడలి కలదు,
పగిలి ప్రజ్వ రిల్లి - గగన మంటగ గోరు,
గొప్ప అగ్గి కొండ గుండె - కలదు.

### సన్న గొంతు

స్వరము పెంచరాదు - సంభాషణము నందు,
ఆగి పలుక దగును జాగ లిచ్చి;
నోరు చించరాదు నొక్కి వక్కాణించి,
చాలు నిజము చెప్పు - సన్న గొంతు.

### దానం

ధర్మ మొకటి కలదు దాన గ్రహీతకే
దాన మివ్వ వలెను తాను గూడ;
దీన సేవ చేసి దాన కార్యము తీర్చి;
తాను తీర్చు గాక దాత ఋణము.

### ధార్మికుడు

అరసి యెవడు చేయు ఆర్త రోగికి సేవ ?
ఎవడు దాన మిచ్చు నెరిగి పాత్రు ?
సత్య మెవడు చాటు సాక్షియై తెగువతో,
ధరణి మీద అతడు ధార్మికుండు.

### వ్యయం

ఆయ మందు ఘనుడు అర్జించు ధనరాశి
బ్రదుకు తెరువు నెరిగి పొదుపు నెరిగి ;
అంత కంటె ఘనుడు - వ్యయము చేయును సదా
ధర్మ కార్యములకు దాన మిచ్చు.

### మనస్సు

ఏది హెచ్చు ఎత్తు ? - ఎవరెస్టు శిఖరమా ?
అంతకంటె ఎత్తు ఆకసమ్ము !
ఏది హెచ్చు లోతు ? - ఏ సముద్రము గాదు ;
ఎత్తు లోతు లందు హెచ్చు - మనసె.

దానం

స్నిగ్ధ దాన గుణము జీవత్ ప్రవాహమై,
పారుగాత తర తరాల మేర,
ధన్యు డగును గ్రహీత తాను దానము చేయ;
ప్రజ్ఞ ప్రతిభ గుర్తు పట్ట గలుగ.

కవితా పఠనం

కలుప - కుండ కొంత గానమ్ము కవితలో,
చదువ కూడ దెపుడు సభలలోన,
నాద బిందు కళల నాట్య విన్యాసమ్ము,
కవిత - సపది రక్తి కట్ట జేయు.

హాస్యం

సత్యముండు తరము సరదా పలుకు లందు;
హాస్య మునకు నిజమె అంతరాత్మ
కోరుకొనిన - సుకవి - గొప్ప సత్కారముల్,
ఉండ లేదు నవ్వ కుండ వేత్త.

సుకవి

సరస కవిత సభల చప్పట్లు కాదయా !
ధ్యాన యోగ సంభృతమ్ము - కవిత;
కవి యటన్న - కీర్తి కాయుడే చరితలో,
కాదు బ్రదికి యున్న వాడు సుకవి.

శవ దర్శనం

బ్రదికి యున్న అప్తు పలుమారు దర్శించి
సాయ పడుట మేలు శక్తి కొలది,
వెడలి వచ్చి వ్యయము కడు ప్రయాసకు నోర్చి,
ముసలి శవము చూడ మురిప మేమి ?

అభిసారిక

విలిపి సిగ్గు వద్దు - శృంగారవతి రమ్మ
నడలి పోవ నీవి ముడియు రైక,
ప్రణయ రాజ్ఞి వద్దు - ప్రత్యక్ష విరహమ్మ
మేన వెన్నెల మిస మిసలు మేలు;

అలతి సిగ్గు లేల ? అభిసారికవు నీవు,
ప్రణయ రాజ్ఞి ! నీవు ప్రౌఢ సఖివి;
వేగ ముద్దు లిడుము - కౌగిలింపుము దేవి,
ముట్టడింపు నన్ను మొదట నీవు;

ఆలసింపకుండ అరుగు దెంచితి నీవు
దారి నెరుగు బాటసారి వోలె,
అరుగు దెంచె ముందె - ఆమోద పవనాలు,
కమ్మ తెమ్మెర కెరటమ్ము లట్లు.

గుండె లోన పొదిగి కొంటె కోర్కెలు కొన్ని
దరికి చేరినావు తరుణి నేడు;
రెక్కలిక మొలుచుత పక్షి పిల్లల కెల్ల ;
ఎగురు గాత కొత్త గగనములకు.

చిందు చందమామ మందహాసము నేడు,
మబ్బు మాటు నుండి మనల చూచి;
కొమ్మ-గువ్వ జంట - గుస గుసల్ వెలయించు
మనల చూచి రెమ్మ మాటు నుండి.

మొదటి వంతు నీది పిదప అంతయు నాది;
మనకు కలుగు రస సమాధి యింక,
చూపు నాకు చాలు జ్యోత్స్నా దిగంబరి !
చాలు చాలు పావురాల రవళి.

### బ్రదుకు

బ్రదుకు నవ రస రుచిరమ్ము గాని – ఏకైక
తాళ రాగ గర్భితమ్ము కాదు ;
వివిధ వేద్య విషయ విస్తీర్ణమై – తోమ ;
హింగుళ మయ వర్ణ సంగమమ్ము.

### పుడమి

నరక బాధ తరచు ధరణిలో పడవచ్చు,
పుడమి చాల వరకు పుచ్చి పోయె,
త్యాగ యోగ మహిమ – ధరణి పైనను గూడ
అమృత వృష్టి గురియు అప్పుడపుడు.

### గురువు

అతడు పాడె – ఆవిహంగిణీ రాగమ్ము,
వినెను శిష్యురాలు వీను లొగ్గి;
శిష్యురాలి హృదిని చెరిగిపోవని ముద్ర,
పడెను వచ్చు బొట్టు పగిది – నవది.

### కవిత

కవిత అన ప్రచండ కండూతి మండికే;
దండ యాత్ర చేయు గుండె మీద;
అంటు వ్యాధి అదొక అజన్మ రోగమే ;
ఆ విషా దిగ దిక మానవులకు.

### లంచం

కలియు ఫోను చేయ గాలిలో తరముగా,
లేఖ చదువు వారు లేరు – లేరు;
చూచు వాడు కలియ చెప్పు శుష్క ప్రియాలనే;
ఎంచ పనులు జరుగు లంచ మివ్వ.

### మతం

గతము నందు సతము మతము స్వేచ్ఛను మాపి
బానిసలుగ చేసె మానవులను ;
తెలియ నట్టి దాని తెలిసి నట్లుగ చాటు ;
మతము విడువ వలెను మనిషి వేగ.

### మనిషి

కవి వరుండు పిదప కావచ్చు జగతిలో,
మొదట మనిషి యగుత బ్రదుకులోన,
చదువు మెదడు పదవి బ్రదుకులో వ్యర్థముల్!
పండకున్న మొదట గుండెకాయ.

### వేత్త

పుట్టి నట్టి వాడు గిట్టుచుండును గదా
తరచు మానవుండు మరచు నిజము ;
మరువ నట్టి వాడు - మాన్యుండు వేదాంతి,
వేత్త లందు వేత్త - విశ్వ మందు.

### శిష్యుడు

బాల్యమందు జతగ పలక బలపమ్ము చదువులో,
ప్రకృతి - ప్రజకు పెద్ద పాఠశాల ;
అనుభవముల జ్ఞాన మార్జించి శిష్యుండు ;
గురువు గారి వీడు కొనుట మేలు.

### మానస వృత్తి

తల పెవరిది యైన - తన వాక్కులో పెట్టి,
స్వీయ ముద్ర సుకవి వేయ వచ్చు ;
అతని మానస సుత - ఆ అభిప్రాయమ్ము,
సొంత పుత్రి మించు సొగసు నందు.

మితభాషణ

ప్రతిభ యుండ వచ్చు - పాండితీ గరిమతో
మాప వచ్చు - భక్తి శ్రోత కెల్ల;
మేటి కవికి - ఉచిత మిత భాషణము మేలు
విసుగు చెందరాదు వినెడి వారు.

దాన

మురికి నీరు చెత్త - ధరణి నెల్లడ చేర,
బాగు పరచు నట్టి వార లెవరు ?
కురిసి కుంభ వృష్టి - వరద వచ్చిన నాడు,
పుడమి ఎల్ల శుభ్రపడును తరము.

వైరాగ్యం

యోగి ఎన్ని నాళ్లు ఉపవాస దీక్షతో ;
తిండి వదిలి పెట్టి - ఉండ గలడు ?
మేలు కాదు మితిని మీరి వైరాగ్యమ్ము ;
బుద్ధి చాలు జ్ఞాన సిద్ధి కొరకు.

తెలియదు

అర్థ రహిత వాక్కు - యాదృచ్ఛిక మనుమాట
తెలియ దంచు తనకు తెలుప మేలు ;
స్తోత్ర గాన కవన శిల్ప లాల శ్రుతుల్,
తరళ గుప్త దీప్తి దాగ వచ్చు.

ఆగ్రహం

ఆగ్రహమ్ము మొదట అవివేకమై తోచు,
పిదప - సిగ్గు చేటు - తుదకు తుదకు,
ఉత్త ఆగ్రహమ్ము - ఉన్మాద సదృశమ్ము,
అణచి వేయ వలెను ఆగ్రహమ్ము.

బ్రదుకు

అరయ మనిషి పుట్టు వారంభ శోకమే ;
తమ్మి మొగ్గరమ్ము సుమ్ము బ్రదుకు,
చావు ఎప్పుడైన - సర్వత్ర దుఃఖమే !
బ్రదుకు సుఖము శుభము మెదడు వాడ.

ఆశు కవిత

తేలు ఆశు కవిత గాలిలో ధూళిలో
మరు నిముసమె శ్రోత మరచి పోవు ;
నెమరు వేయ దగిన - అమృత యోజన సుమ్ము
కవిత హృదిని మెదడు కలుప గలదు.

జ్ఞాన యోగి

ఎరుగ వలెను కడగి ఎదిరి వాదము గూడ,
కాదు ఎవరి గుత్త గంటు - నిజము ;
పూర్ణ సత్య మేది పుడమి లోపల లేదు,
సంశయాత్మకుండు జ్ఞానయోగి.

దొంగ గురువులు

ధరణి లోన దొంగ గురువు లున్నారహో ;
చేర దీయ గలరు శిష్య వరుల !
పెట్ట వద్దు మనసు - పృథివిలో తాకట్టు
ఎవరి వద్ద నైన ఎచట నైన.

బాహ్యదర్పం

బ్రదుకు - లేని పోని రాచ ఠీవిని గోరు,
గొప్పదనము నటన - కూర్పు కొంత,
అంతరంగ మందు అమరుగా వినయమ్ము,
తప్పు గాదు బాహ్య దర్ప గరిమ.

విద్య

వ్యయము పర్యటనము - బహుళ ప్రయాసయే !
అయిన-ప్రగతి సిద్ధి కవసరమ్ము,
గ్రంథ పఠన మొకటె బ్రదుకులో సరిపోదు;
విద్య - విశ్వరూప వీక్షణమ్ము.

స్వేచ్ఛ

చదువు కూర్చ వలెను స్వాతంత్ర్య సంసూక్తి
ఉండ రాదు గురు డెవండు గాని ,
సర్వ భీతి హరము స్వాతంత్ర సంప్రాప్తి,
విద్య జీవనాడి - స్వేచ్ఛ సుమ్ము.

స్వగతం

ఆట విడుపు కవిత - అంతర్యమున నాకు,
బ్రదుకు పాఠశాల చదువు లందు,
గెంత గలను కెరలి - క్రీడాస్థలము చేరి,
చదువు చెప్పు గురువు వదలి

ఏక నిష్పత్తి

విశ్వ దినము లెల్ల విషువత్తులా ? కావు;
స్థలము బట్టి మార్పు తరము వచ్చు;
నిలువ జాల దేక నిష్పత్తి జగతిలో,
జీవితమున వెలుగు చీకటులకు.

స్వగతం

తెలియ రాని గొప్ప దివ్య శక్తిని నేను
అనుభవించు చుందు క్షణము క్షణము,
నేను నాస్తికుడను కాను - జీవితములో,
వాద మేల ? అనుభవమ్ము చాలు.

### ఎస్కిమోలు

జీవయాత్ర పైన - క్షేత్ర ప్రభావమ్ము,
కాల మహిమ కూడ కానిపించు
పాలు పెరుగు శాక పాకాలు లేకనే
ఎట్లు బ్రదుక నేర్తు రెస్కిమోలు.

### మంచి నిదుర

ధనము వలన కలుగు - ధైర్య విశ్వాసముల్ !
నీతి వలన మంచి నిద్ర కలుగు,
యౌవనమ్ము పెరుగు - ఆట పాటల వల్ల ;
పౌరుషమ్ము పెరుగు పదవి వలన.

### ప్రాణ చైతన్యం

ప్రతిభ కలదు కలదు ప్రాణ చైతన్యమ్ము ;
మోసు లెత్తి పెరుగు మొక్కలందు !
సృష్టిలో నిగూఢ సచ్చిదానందమ్ము
ద్రష్ట తెలియు సూక్ష్మ దృష్టి యున్న.

### బ్రదికి యున్న కవి

ప్రజ్ఞ నున్న వారు - ప్రత్యక్ష కాలికుల్ ;
గౌరవింప లేరు కవిని తరచు,
యోగ దృష్టి యున్న - ఉత్కృష్టు డెవ్వడో ;
ఉగ్గడించు - బ్రదికి యున్న కవిని.

### పద్య కవిత

తెలుగు పద్య కవిత - దివ్య సంగీతమే ;
యతులు ప్రాసలు గణ తతుల తోడ ;
మధుర భాషణులకు - మార్దంగిక శ్రుతుల్;
లయలు హొయలు గలిపి లాస్య మగుత.

పద్య కవిత

తెలుగు పద్య కవిత - ఘల్లు ఘల్ నాట్యమే ;
భావ రాగ గతులు ధ్వనులు గలిగి ;
వివిధ వృత్త పాద విన్యాసములు గల్గి ;
శబ్ద కింకిణీక సరణి గలిగి.

అంతరార్థం

వీర పూజ - విగ్రహారాధనలు - వద్దు ;
వద్దు - నామ జపము - వద్దు వద్దు ;
శబ్ద మర్థ వాద సంకేతమే గదా !
అంతరార్థ బోధ లరయ దగును.

అవకాశం

అరయ గోచరించు అవకాశ శిరముపై,
ముందు భాగ మందె మొలిచి జుట్టు ;
తడసి చూడ బట్ట తల మాత్రమే యుండు
పట్టు దొరకు ముందు జుట్టు నందె.

ఆటవెలది

మధుర కవనమునకు - మార్దంగ లయ గూర్చి
రాగ భావ యోగ రక్తి గొలిపి,
నుడుల వంపు సొంపు - వడులు ప్రాసలు నింపి,
చాటు కవిత - పాడు - ఆటవెలది.

వినయం

ఉన్నతుండు దాచు - స్వోత్కర్ష గుండెలో ;
వెల్లడించు తరచు వినయ గరిమ,
వినయ గుణమె గొప్ప విజ్ఞాన లాక్ష్యమ్ము ;
డాబుసరి నుడులు బడాయి వద్దు.

## బ్రదుకు

భ్రమకు సత్యమునకు - వ్యత్యాస మది యేది ?
మాయదారి మిథ్య మనిషి బ్రదుకు ;
గుండె నావరించు ఎండమావుల ప్రోవు ;
మానస సరసీ హిమాని బుడగ.

## అమాయికత్వం

మంచి తనమునకు - అమాయి కత్వమటంచు,
మారు పేరు పెట్టినారు ప్రజలు;
మోసగాని శక్తి - మూర్ఖత్వ మని తెలు !
దీర్ఘ దృష్టి తోడ తెలిసి చూడ.

## తేజస్వినా వధీత మస్తు

శిష్యు డెవడు ? భక్తి జిజ్ఞాస కలవాడు
అహము విడిచి నట్టి ఆర్ద్ర హృదయుడు ;
వెలుగు వెదకు కొరకు నిలుచు తోడుగ సదా
పరమ గురువు శిష్య వరుడు నాకు.

## ఆరోగ్యయోగం

విద్య లందు మేటి - వైద్యమే బ్రదుకులో,
శుద్ధ భాగ్య సూక్ష్మ సూత్ర రచన;
ఔషధాల కంటె ఆరోగ్య యోగమే
జీవితమ్ము నందు శ్రేష్ఠతమము.

## ఉద్యమం

అమిత తృప్తి వచ్చు - ఆదర్శమ్ముల తోడ,
వెల్లివిరియు - ఎండ - వెన్నెల వలె,
శ్రమలు గూడ మధుర సౌఖ్యమ్ములై తోచు,
ఉద్యమమ్ము లోని కురికి నపుడు

### గురువు

పొగడ వచ్చు పచ్చి బొంకు లెన్నియొ చేర్చి
 తిట్ట వచ్చు ప్రేమ తీర్చి దిద్ది,
అర్థ మెరుగ కున్న అతడే అవివేకి
 దీవెనలగు గురువు తిట్లు గూడ.

### స్వగతం

చేరి బహుమతు లిడినారు ప్రేముడి ప్రజల్,
 మతి గతింప వయసు మళ్లి నాకు,
పులకరించి అట్టి ప్రోత్సాహమున చేసి,
 కవిత వ్రాసి నాసు కరగి గుండె.

### కవి

సహృదయులను రసికుల సమకాల జగతిలో
 వ్రేళ్ళ మీద లెక్క పెట్ట వచ్చు ;
గుండె దున్ని విత్తి పండించు కవి వరుల్;
 పేదవారలగుట వింత గాదు.

### నేత

నిష్కళంక మైన నీతీ నిజాయితీ
 ప్రజల సేవ యందు ప్రాణ నాడి,
జనుల కెల్ల అన్ని జమలు ఖర్చులు చూపి,
 ఇంపు పెంపు సొంపు నింప వలయు.

### బద్ధకం

సౌఖ్య మనిన నేమి ? జనుల కీ జగతిలో ??
 సహృదయునకు శ్రమయె సంతసమ్ము ;
వేడ్క ఇవ్వ లేదు విశ్రాంతి సర్వదా
 పరమ హేయ మేది ? బద్ధకమ్ము.

### మనిషి

వింత జగతి లోన - వింత మానసముతో
మనిషి వింత జనుల మధ్య బ్రదుకు,
బోధిసత్త్వు డొకడు పుడమిపై జీవించు;
రాక్షసుడయి ఒకడు బ్రదుకు నెరపు.

### పాత చరిత

చదువుకున్న వారు - సంస్కార యుతు లెల్ల,
మరువ దగును పాత చరిత వేగ,
రోత గొలువు నట్టి పాత పంచాంగముల్,
మూల త్రోయ వలెను - మూట గట్టి.

### కవికి విగ్రహం

కవి గతించు పిదప కాంస్య ప్రతిమ తెచ్చి
రచ్చ దరిని నిలుప లాభ మేమి ?
బ్రదికి యున్న కవికి వస్త్ర సత్కృతి సల్ప,
శారదాంబ కొంత సంతసించు.

### ధన వ్యయం

అవని ఘనుడు ధనము నార్జించ గలవాడు,
అతని తెలివి తేట లద్భుతములు !
అంత కంటె ఘనుడు ఆర్జించి ధన రాశి,
సవ్య మైన వ్యయము సలుపువాడు.

### మనస్సు

మనుజ దేహమందు మనసు శుభ్రము చేయు
నిత్య జపము నీతి నియమ నిష్ఠ;
మందు కంటె మనుజా మనసు ముఖ్యము సుమ్ము
బ్రదుకు నందు రోగ వారణమున

### కృతజ్ఞత

దాన గుణము కంటె - ధాత్రి గొప్పది లేదు
ప్రగతి యోగ భాసుర ప్రతీక,
దారుణము గదా కృతఘ్నులే బదుకులో,
నిశ్చయముగ పరమ నీచ తమము.

### నమ్మకాలు

వ్యసన సదృశ మైన భ్రమ లోన పడరాదు;
స్వీయ యోజనమ్ము వీడ రాదు,
గ్రుడ్డి నమ్మకాలు గుండె లోపల నున్న
పొదుగ కుండ చూచి బ్రదుక దగును.

### బహుజన సిద్ధాంతి

మిత హిత ఋత వాగ్మి మేధావి తేజస్వి
అతడు సతత మందహాస ముఖుడు ;
బహుజన సిద్ధాంతి బహుజన ప్రియవాది
పనులు చేయు ప్రజల ప్రగతి కోరి.

### ఆంగ్లభాష

విద్య లందు విశ్వ విజ్ఞాన పేటికల్
భరతదేశ మందు తెరచు కొరకు,
కూర్చె ఆంగ్లభాష గొప్ప తాళపు చెవుల్,
నవయుగోదయములు నాట్య మాడ.

### కలం

శత సహస్ర నేత్ర సంధాన చతురమ్ము
లోక సంగ్రహమున - నా కలమ్ము ;
స్వీయ శక్తి గలిగి వ్రాయుచుండును సదా,
వ్రాయ లేదు అక్షరమ్ము నేను.

## అధినరుడు

ధనము పెరిగి నపుడు - అనులోమ నిష్పత్తి
తరుగు గుండెకాయ నరుల లోన ;
కూడు నెడల జాలి గుండె - సంపద తోడ,
అవతరించి నట్లె అధినరుండు.

## బొంక వచ్చు

నేటి కూట నీతి మేటి యెత్తుల యందు;
ఓటు అటు పోటు వేట యందు;
జనుల ప్రగతి కొరకు సంకల్ప శుద్ధితో,
జంకు గొంకు లేక బొంక వచ్చు.

## సాపేక్ష సత్యాలు

జగతి - శబ్ద వితతి - సాపేక్ష సత్యముల్
చదువు - ధనము - బలము జ్ఞాన గరిమ;
స్థలము బట్టి సమయ సందర్భములు బట్టి ;
నెరప వలయు సూక్ష్మ నిర్ణయమ్ము.

## స్వగతం

నేను భూలోక వాసిని గాను - కవిని;
సంచరించెదను మరో ప్రపంచ మందు;
నా మనస్సు వే పురివిప్పి నాట్య మాడు,
సరిగమపద నిస్వన లయ సార వణితి.

## మాట లాడుట

మాటలాడ దగును మందహాసము చింది,
ముదువ రాదు ముందు మూతి ముక్కు;
చల్ల వలెను మధుర చతుర సల్లాపముల్,
క్రొత్త వారి పైన కూడ ప్రీతి.

### కవి

కానుపించ వచ్చు కనులు గుంతల వోలె,
కరము వణక వచ్చు కలము పట్టి;
ముడుత పైన ముడుత పడవచ్చు ఒడ లెల్ల;
గళము నెత్త  గలడు కవి వరుండు.

### కవిత

రస గుళికయె యైన - ప్రత్యక్ష బోధమ్ము
కాంత పలుకు గాదు - కవిత గాదు,
సాహితీ మృదు మధు చతుర సల్లాపమే !
మందు కాదు - మసృణ మాత్ర కాదు.

### మేకం

పదవి వచ్చి నపుడు - పెదవి విప్పుట యున్న;
గండి పడుటె ఆనకట్ట యందు;
నోరు పార వేయ గౌరవం బడుగంటు;
వ్యర్థ మగును - ప్రాణ వాయు నిధులు.

### సంఘ సంస్కారం

జరుగ కున్న యెడల - సంఘ సంస్కారమ్ము,
ప్రగతి రాదు మాత్న జగతి లేదు ;
పాత దనము నెల్ల - నూతన శ్రోత్రియుల్
పూని సంహరింప హాని జరుగు.

### మధ్య తరగతి

ధనిక వరుడు సహజ మనుజ మాత్రుడు కాడు,
కార్మికుండు రెండు కాళ్ల పశువె ;
మధ్య తరగతి ప్రజ మానవుల్ సర్వదా,
వారె స్వచ్ఛమైన పౌర వరులు.

## పురిటి నొప్పులు

పుట్టు టెట్లు ? బిడ్డ - పురిటి నొప్పులు లేక,
వేధ - తల్లి అనుభవింప వలయు,
సంఘ మందు కొన్ని సంక్షోభములు లేక,
అవతరింప బోదు నవ యుగమ్ము.

## వ్యాధి

అహము దాగి యుండు - అంతరాలము లందు ;
వెఱ్ఱి తలల నెన్నొ వేయు అహము,
అహము నణచు శక్తి - వ్యాధి కున్నది కొంత ;
వ్యాధి అవసరమ్ము అప్పు డపుడు.

## పొదుపు

పొదు చేయ రాదు బ్రదుకులో సమయమ్ము
ధనము పొదుపు చేయ దగును సతము ;
జయము కలుగ గలదు శ్రమ వల్లనే సదా ;
కర్మ యోగి యగును కష్టజీవి.

## మార్పు

మనిషి మార్చు కొనిన - తన అభిప్రాయమ్ము,
తప్పు గాదు సముచితమ్ము సుమ్ము ;
కాలమునకు ఆత్మ గద మార్పు యోజింప,
మార్చు కొనును మనసు మంచి వాడు.

## నీలాపనింద

ఎగుర లేదు - బొంకు - గగన సీమల లోన,
ఉర్వి వదల లేని - ఉష్ట్ర పక్షి ;
నేల విడిచి ఎగురు - నీలాప నిందయే
గగనములకు పెద్ద గద్ద వోలె.

### జ్ఞాని

ఉదయ మందు మనిషి మెదడులో యోజనల్;
మురిప మొప్ప - పుట్టు మూగ యగుచు ;
వదరుబోతు తరమ వాగ వచ్చును గదా ;
జ్ఞాని మాతృభాష - మౌన మరయ.

### కనులు చెవులు

''కనులు చెవులు బాధ కలుగ జేయవు గదా?''
వైద్యు డడిగె యువక వరుని చేరి,
''కంచు కమ్మి విప్ప గడగు నవుడు బాధ,
కలుగు నంచు'' బదులు పలికె నతడు.

### సంఖ్య

మంత్ర తంత్ర దండ మహిమ ఎన్నికలలో
ఒక్క సంఖ్య నమరి యుండ వచ్చు ;
అంద రెదురు చూచు చుందు రా సంఖ్యకై ;
దొర తనమ్ము చేయు కొరకు తరము.

### వెలుగు బాట

ప్రగతి శీలి వెలుగు బాట నారాధించు,
క్రొత్త దనము మీద కూర్మి నిల్పి ;
అవతరింపజేయు భువి నెల్ల వెలిగింప
మించు తీగె నొకటి మింటి నుండి.

### కాల మహిమ

గరిమ నాభి - సకల పరిమాణముల యందు,
కాయ యగును పండు - కాల మహిమ,
కాల మెల్ల జగతి గతికి అంతర్యామి;
కాల మహిమ నెవరు కాంచ గలరు ?

### సహన గుణం

నవ్వు కున్న యెడల - నవ్వుకోదగు లోన;
ఆగ్రహమ్ము చెందుటనవసరము;
సహన గుణము మేలు - సహజీవనము మేలు;
స్వేచ్ఛ పుచ్చు కొనుము - స్వేచ్ఛ నిమ్ము.

### స్వగతం

ఏల బ్రదికి యుంటి ? ఎనుబదేండ్లకు పైన ?
బ్రదుకు నంట - భువిని పాపి చిరము ;
బ్రదికి యుంటి నిపుడు బహుశః కవిత వ్రాయ,
నాకు లేవు వేరు కారణములు.

### సహృదయుడు

చరిత సర్వ మరసి - సందర్భ శుద్ధితో,
సత్య మెరుగ వలెను - సహృదయుండు ;
వర్తమాన తర్క వాద ప్రియుల కెల్ల ;
మ్రొక్క దగును కేలు మోడ్చి తుదకు.

### బుడగలు

నాకు తెలియు మేటి నగ్న సత్యము లెన్నో !
తెలియ నట్లు నటన సలుపు చుందు,
నన్ను మించు వార లున్నార లెందరో !
బుడగ లుబ్బు - బొక్క పడెడు వరకు.

### జగతి

జగతి మిథ్య అంచు - శంకరుండన్నాడు !
తలచు వారు కలరు - తథ్య మంచు ;
నాకు - బ్రదుకు నిత్య నవ్య ప్రహసనమే !
మిథ్య తథ్య ములకు మేటి మెలితి.

సంస్కృతి

చదువు అనుభవాలు - శాస్త్ర విజ్ఞానమ్ము ,
మనిషి బ్రదుకు లోన - మరువ వచ్చు,
గుండె పట్టి విడువ కుండు సంస్కారమ్ము ;
సంస్కృతి యన బరగు జనుల యందు.

బ్రతుకు

బ్రతుకు పరిధి నెపుడు - బంధించ లేదయా
నిత్య సంధి సూత్ర నిర్వచనము ;
బ్రతుకు కానబడు - విభాష బహుళముగా !
తర్క వాద నియతి దాటి పోయి.

భోగలాలసత్వం

నాశ మయ్యె వివధ దేశాలు చరితలో,
వ్యక్తి జీవితమ్ము పాడు వడెను,
మేలు కాదు భోగ లాలసత్వము హెచ్చ ;
నియమ నిగ్రహమ్ము నీతి మేలు.

స్వగతం

నేను కవిని గాను - జ్ఞానోదయము కల్గె,
కవిగ చాల నాళ్లు గడిపి నాను,
కనుక బ్రదికె దింక కవి పాత్ర ధారినై,
గర్వ ముడిగి-వినయ గరిమ తోడ.

పద్య కవిత

ఎగురు పద్య కవిత - గగన పర్యంతమ్ము,
ఎట్లు కొలువ దగును ? నిడివి ;
అలల కలల దేలు సెలయేళ్ళ గేయముల్,
రసన మందు చక్కెర వడగళ్లు.

హింస

అఖిల జగతి నాకు ఆశ్చర్య జనకమే !
విశ్వ సృష్టి తత్త్వ వేది గాను ;
నిఖిల సృష్టి శిల్ప నిర్మాణ పథకమ్ము
ఏల నిండె ? ఘోర హింస తోడ.

ధనం

దాచవలసి నపుడు ధనము భద్రముగా ;
గట్టి పెట్టె లోన పెట్ట వలెను ;
దాన మివ్వ వలెను ధనము సత్వరముగా ;
పాత్రుడు కనిపింప - భక్తి తోడ.

మంచితనం

ధర్మమేది కలదు ? దయ మించి ధరణితో ?
గొప్ప దేది జాలి గుండె కంటె,?
ఎంచ మంచి తనము మించు లౌక్యము లేదు ;
మంచి తనము మించు మతము లేదు.

సంధి

సంధి లోన - ఖండ సత్య ముండును కొంత,
బొంకు దాగు సంధి పొట్ట లోన ;
సంధి మారు పేరు సామరస్యము గదా,
సంధి బ్రదుకు తెరువు సంఘమందు.

డాబు

ధనము లేక డాబు దర్పమ్ము చూపింప;
కడకు ఆత్మ వంచకుడని తేలు;
జనులు మోస పోరు కనిపెట్టుదురు వేగ;
చేటు తెచ్చు తుదకు కూట నటన.

### ఆప్యాయత

అరయ ధనము కన్న ఆప్యాయతయె మిన్న ;
విలువ కట్ట లేరు ప్రేమ కెవరు ;
హృదిని మించ లేదు - పెదవి యెన్నడు గాని,
భక్తి వేరు-నటన శక్తి వేరు.

### జవరాలు

ముసలి వాని చేరి మురిపించు జవరాలు,
కడగి కొంత ఆట విడుపు కోరి,
వలపు భ్రమల సుడుల పడిపోవ వృద్ధుండు
రక్తి కట్టు హాస్య రస విషద్య.

### కుండలిని

అధిగమించ వచ్చు ఆ సహస్రారమ్ము;
సాధనా తపః ప్రబోధమును;
కుండలిని గమించు గోపురమ్ములు పెక్కు;
కూర్చు కొనుచు జ్ఞాన కోశములను.

### లారీ యజమాని

రాత్రి-నిదుర మునుగ లారీల యజమాని,
రోడ్డు మధ్య డ్రైవరు మరణించె !
క్రొత్త లారి నొకటి కూర్చె ఇన్సూరెన్సు;
అసలు నష్టపోయి నట్టి దెవరు ?

### పదవి

కారణాంతరాల గడుసు కుట్రల వల్ల;
తరచు పదవి వచ్చు - ధనము వచ్చు;
పెరిగి పోయి అహము - తరచు గర్వము హెచ్చి,
శిరసు గిర గిర గిర - తిరగ వచ్చు.

శృంగారం

చెడ్డ ఏమి లేదు –శృంగార రసమందు,
ప్రేమ యందు పాప మేమి లేదు ;
ఆచరింప వచ్చు – అధ్యాత్మ యజ్ఞమ్ము,
అమృత యోగ సుఖము ననుభవించి.

మాతృత్వం

ఆడదాని జన్మ హక్కు – మాతృత్వమ్ము
వలపు గ్రుడ్డి దనము వయసు తెచ్చు;
పెండ్లి కాక ముందు – బిడ్డ జన్మించుచో
తల్లి పెంచు కొనుట తప్పు కాదు.

పరిశోధన

కూర్చొ నతడు కొన్ని క్రొంగొత్త విషయాలు
సత్యములను కొన్ని సంతరించె ;
కావు–కావు సత్య మేవి నూత్నాంశముల్ !
సత్యము లిక పాత సంగ్రహములె.

భాగవతం

నరుల క్రుంగదీయు నగ్న సత్యము –చావు !
బ్రదుకు బహుళ దుఃఖ భాజనమ్ము;
జ్ఞాన మివ్వ లేని సంతృప్తి ఘటియించు
భక్తి త్రోవ చూపి –భాగవతము.

భాగవతము

భారతమ్ము వ్రాసి – వ్యాసర్షి రచియించె,
భాగవతము పిదప భక్తి తోడ,
మెదడు ఆగు చోట–హృదయమ్ము మొదలౌను;
నరుల తత్త్వ దర్శనమ్ము నందు.

### గాయకుడు

శంఖ రవము వోలె ఝుంఝూనిలము వోలె,
గాయకుండు పాడు కవిత లేరి ;
కవి వరుండు కూని గానమ్ము తీయుచో,
వినెడి మనుజు లెవరు ? విశ్వ మందు ??

### కర్మయోగి

అలసి సొలసి పోయి ఆనందమును పొందు;
కాంచు గొప్ప తృప్తి కష్టజీవి !
అనుభవించు వేత్త పనులలో విశ్రాంతి
జయము కర్మయోగి సత్తమునకు.

### ప్రబంధ రచన

హెచ్చు విలువ వచ్చు - ఇతివృత్తమును బట్టి,
శిల్ప సుందరముగ - చెక్క - కవిత,
వ్రాయ వచ్చు - చాటు పద్యాలు ప్రతిభతో,
ప్రౌఢ సత్ ప్రబంధ రచన వేరు.

### ప్రేమ

ప్రేమ అనిన -కామ శృంగార కేళియా ?
పెండ్లి కాని ప్రేమ - ప్రేమ కాదు,
పెండ్లి కూర్మి పేర్మి పెంచి వర్ధిల జేయు ;
స్నేహమునకు ప్రేమ చేరు వగును.

### కవిత

సరస కవిత అనిన చండ మార్తాండమా ?
కాదు చంద్ర వంక - కవిత కాదు,
కవిత మిన్ను మించు కాంతి రింఛోళియే;
కవిత - ఒక్క తళుకు ఒక్క బెళుకు.

దళితులు

కత్తి పోట్లు కావు - కరకు చప్పట్లెగా,
విప్లవమ్ము కాదు -వెక్కిరింపు,
పడిరి దీన జనులు పడరాని పాట్లెన్నొ !
దళిత జనులు కిపుడు తెలివి వచ్చె.

పదవి

అల్ప మతికి గొప్ప ఆలోచనలు రావు,
కూర్చ లేదు వేగ గొప్ప పనులు ;
గాను గెద్దు కరణి - గంగిరెద్దును బోలె,
ఘనుల గూడ మార్చగలదు - పదవి.

పెండ్లి

స్వార్థ రహిత మైన - స్వచ్ఛంద సేవయే,
పేర్మి కూర్మి ప్రీతి -ప్రేమ యగును ;
ప్రాణ నాడి - త్యాగ మనురాగమున యందు ;
స్వేచ్ఛ వలయు పెండ్లి వృత్తి అందు.

బ్రదుకు

బ్రదుకు నెరప నేడు పరుల సాహాయమ్ము
కొంత మేర పొందకుండ ఎవరు ;
సేవకుండు కడగి చేయు సంతత సేవ,
మిత్ర వరుడు తరము మేలు చేయు.

కవిత

అనుభవాబ్ధి మథన జీవితమ్ము కవనమ్ము
గడుసు పలుకు బడులు కావు - కవిత;
మెదడు కాదు కాదు హృదయమే కవనమ్ము
కవిత వెన్నెల వడగళ్ళు జల్లు.

ప్రగతి

పేర్చ నేల పెద్ద పిరమిడ్లు వరుసగా ?
ప్రాణ రహిత మైన - రచన లేల ?
ప్రగతి శీలి వెలుగు బాట నొక్కటి వేయు ;
రేపు మీద తలపు చూపు నిలిపి.

ప్రజాస్వామ్యం

మంచి చెనుట యెట్లు ? మన ప్రజాస్వామ్యమ్మ ?
చేతు లెత్తి నంత నీతి అగునె ?
సహజ ధర్మ మెన్న సంఖ్యాధికత కాదు;
వేత్త కిచ్చ దగును విలువ కొంత.

ముసలి కవిత

వణక వచ్చు చేయి - వయసు మళ్లుట చేత,
స్వరము తప్పు వచ్చు - పళ్ళు ఊడి,
చేవ వట్టి నట్టి చిన్మయత్వము గల్గు,
ముసలి కవిత పైన మోజు మిగులు.

ఎన్నికలు

ఎన్నికలవసరమె - ఇది ప్రజాస్వామ్యమ్మ
ఎన్నిక లన ధనము - హెచ్చు వ్యయము;
ధనము వ్యయము చేయ - మెనుకాడగా రాదు;
కాదు నేత - లేని వాడు నేడు.

నటరాజు

నిలువ నీవు చదల మలిసంజ కెంజాయ
దెసల డమరుకము ప్రతిధ్వనించు,
కేశికావిలోల గిడిగింద్లు నటరాజ !
నింపు - విశ్వ మెల్ల ఇంపు సొంపు.

### క్రొత్త దనము

మార కున్న యెడల - మనుజుండు బ్రదుకులో;
జారిపోవు - ఉన్న స్థాయి నుండి,
ప్రగతి వచ్చు - మనిషి - పైమెట్ల నెక్కుచో
కోరి క్రొత్త దనము కూర్చుకొనుచు.

### కలము

అరచు గొంతు నెత్తి - వ్యాపార గరిమమ్ము
సంస్కృతి గుస గుస సలుపు గాక,
కలము నోరు నొక్కు గలదు కంఠము రేగ,
తారు మారు చేసి తరచు నిజము.

### డాబుసరి

హంగు మీద - చతుర సంగీతముల మీద,
రంగు మీద రక్తి - రమణి కుండు;
పొంగు ఎదడ తోడ - శృంగారవతి చేరు,
పురుషు దరికి - డాబుసరికి మురిసి.

### అర్థ వాదం

వరలు చుండు అర్థ వాద రూపము నందు,
అవధరింప దగును - కవిత లెల్ల ;
వాస్తవమ్ము గాదు - వాచ్యార్థమును గొన్న,
అంతరంగ సత్య మరయ దగును.

### జీవితం

జీవితమ్ము - వింత క్షీరాబ్ధి మథనమ్ము,
వెలుగు నీడ కలిసి మెలసి చేరు !
హాల హాలము పుట్టు - అమృతమ్ము జనియించు,
వచ్చు - లచ్చి - త్రచ్చి త్రచ్చు కొలది.

## వనిత

నిలిచి వనిత యొకతె - నేపథ్యమున దాగి,
గొప్ప వాని వెనుక గోచరించు ;
ఆమె చేయ కున్న - త్యాగ సాహాయ్యమ్ము
కా డతండు గొప్పవాడు కాడు.

## వాస్తవాలు

వయసు వలన మార్పు - వచ్చు చుండుట కద్దు ;
విలువ లందు మనిషి తలపు లందు ;
అనుభవాలు వేరు - ఆదర్శములు వేరు ;
నేల మీది వాస్తవాలు వేరు.

## పెద్దల యెడ గౌరవం

చిన్న పెద్ద అనక - చేతి లోని కలమ్ము,
తెలివి యున్న వారు -త్రిప్ప రాదు,
సాహితీ జగాన - స్ఖాలిత్యములు పెక్కు ;
పెద్దవారి గౌరవింప దగును.

## మౌనం

ప్రతిభ యున్న వాడు - మిత భాషియే యౌను;
పెదవి మనిషి తరచు విప్ప రాదు;
మౌన మందు కలదు మాధురీ తేజస్సు,
జ్ఞాని మాతృభాష - మౌన మరయ

## స్వగతం

ఇచ్చు చిత్త శాంతి యేకాంత భక్తియే,
హేతువాద నిష్ఠ ఇవ్వ లేదు;
లేని దైవ భక్తి నేనటింపగ లేను,
గుండె బాడబమ్ము తాండవించు.

కవితా ప్రీతి

గుండె లోన - స్వల్ప కందూతి వలె చేరి,
ప్రాకి పెరుగు కవిత పైన ప్రీతి,
బిడియ మేమి లేక - భేరికా గళ మెత్తి,
చదువు వద్దియముల సహృదయుండు.

మెచ్చికోలు

జీవితమ్ము లోన - స్వీయ స్తుతియె గదా !
మనము పరుల మెచ్చు కొనుట యన్న;
తన గుణ గణములె ఇతరునిలో కన్పింప;
అతడు గొప్పవాడటంచు తోచు.

గురువు

గురు వరుండు వద్దు - గుడి వద్దు - మడి వద్దు,
శిరము వంచ నట్టి స్వేచ్ఛ మేలు,
స్వర్ణ నిగళ బద్ధ సంప్రదాయము వద్దు,
ఎడద అగుత ప్రొద్దు పొడుపు పువ్వు.

నేత

బ్రదుకు లోన జయము పదిమంది పని గాని,
ఏక పాత్ర విన్య మెపుడు కాదు,
విజ్ఞ వీగ రాదు వీరు డంచును తానె,
ప్రజ్ఞ వారి గుర్తు పట్ట వలెను నేత.

శిశువు

ముద్దు గొలిన - శిశువు మురిపమ్ము పొంగార,
బొందె తోడ ముక్తి పొంద వచ్చు ;
నందనవని శిశువు నవ్వు దొంతరలలో,
తాండవించు పూల తావి చిందు.

నందూరి రామ కృష్ణమాచార్య

## కృత్రిమావయవాలు

జనుల కుమర వచ్చు - జాంతవాయవములే
బ్రదుకు నందు ప్రాణ రక్ష కొరకు ;
కృత్రిమావయవము - కీర్తి గాంచెడి ఇంక,
వైద్య మందు విప్లవమ్ము వచ్చి.

## ఆత్మహత్య

కాళ్లు లేక మరియు కనులు రెండును లేక
జనుడు బ్రదుక వచ్చు సంతసముగ,
ఆత్మ హత్య ఒకరి కానంద మొసగూర్చు,
చిత్ర మరయ మనుజు చిత్త వృత్తి.

## గానం

కలుగ జేయ రాదు తలనొప్పి గానమ్ము
హృదయ మందు కలత రేపి రేపి ;
సుఖము గొలుప వలెను జోల పాటను పాడి
మధుర మైన హాయి మత్తు గూర్చి.

## ఆంజనేయులు

అర సి రమ్మటన్న ఆంజనేయుడు నాడు,
కడగి లంక నెల్ల - కాల్చి వచ్చె ;
కలరు కొంత మంది కర్తవ్యమును మించి,
పనులు నిర్వహించు వారు నేడు.

## చేతలు

మాటలాడ గలుగు - వేట కుక్కల బోలి,
కవిత వ్రాయ నేల - కలము బట్టి;
తీట మ్రోగ నేల దిగ్దిగంతములలో!
నీతి చూప దగును చేత లందు.

### దేవుడు

చెప్పం దేవుడు తన జేబులో ఉన్నట్లు ;
గురువు పాత్రధారి గొప్ప కొరకు,
చేరి నమ్మి నట్టి శిష్యులుండగ వచ్చు ;
నొప్ప పలుక వద్దు - నవ్వు కొనుము.

### వినయ హృది

ఎవరు కొలువ గలరు ? సృష్టి వైశాల్యమ్ము ? ?
విశ్వమందు సూర్యు విలువ యెంత ?
పదవి చదువు ధనము పరమాణు సదృశాలు !!
వినయ మున్న హృదికి విలువ హెచ్చు.

### విషం

వ్యాధి మాన్ప వాడ అమృతమ్ము సరికాదు,
వేయ దగును కొంత విషము గూడ;
దండనీతి కూడ దౌష్ట్యమ్ముతో పోర,
అదను బట్టి కొంత అవసరమ్ము.

### వర్తకం

ధన దురాశ కొంత తగ్గించు కున్నచో,
వర్తకమ్ము వృద్ధి పరుప వచ్చు;
అతిశయించు గాత వ్యాపార రంగాన,
అల్ప లాభ నీతి - అర్థవమ్ము.

### అనుభవం

ఒక్క రూక పోవ - పెక్కు రూకల పెట్టు;
అనుభవమ్ము తరచు అరుగుదెంచు,
మోసగింప బడుట ముప్పేమి కాదయా !
హెచ్చు తెలివి తేట లెటుల వచ్చు ?

మచ్చ

మాన వచ్చు పుండు - మచ్చ మాత్రము నిల్చు ;
మనిషి దేహ మందు మాసిపోక ;
చేయ చెడ్డ పనులు శీలమ్ములో మచ్చ ;
తుదకు మిగుల వచ్చు పిదప గూడ.

చదువు

పలు సుభాషితాలు - వల్లె వేయుట గాదు,
సంస్కరింప దగును - చదువు హృదిని,
గుండె దున్ని విత్తి పండించుటే - విద్య ;
సత్ ప్రవర్తనమ్మె - చదువు సుమ్ము.

సంఘసేవ

సంఘసేవ చేయు సౌశీల్య వంతుండు
ఉండ వచ్చు గొప్ప గుండె గలిగి ;
జనుల చేత తిట్లు తినక తప్పదు గదా,
పండ్ల చెట్టు పైన పడును రాళ్లు.

వ్యయం

అరయ - వెర్రి - దురద వ్యాధియా ? మనుజుండు
ఉండ లేక పెట్టు చుండు ఖర్చు !
రేపు మీద ఎట్టి చూపు లేకుండగా
వ్యయము చేయు నట్టి ప్రజలు కలరు.

గ్రంధకర్త

''ఇచ్చిరి బహుమతిని పుచ్చుకొంటిని నేను !''
చెప్పె గ్రంధకర్త చిన్మయుండు !
''నాడు వ్రాసి నట్టి నా భావములు పెక్కు;
మార్చు కొంటి నాడు మనవి వినుడు.''

### స్వేచ్ఛ

తల్లి దండ్రు లెవరు ? తా నిర్ణయించెనా ?
మాతృభాష మరియు మాతృభూమి ?
అరయ మనుజ జన్మ యాదృచ్ఛికము గదా ?
స్వేచ్ఛ అనిన - అర్థ మేమి తుదకు.

### గురువు

జ్ఞాన శాత మెంత ? శత సహస్రాంశమ్ము ;
విశ్వ సృష్టి శిల్ప వేత్త యెవడు ?
జ్ఞాన మార్గ గామి - మౌన యోగము పూను,
పరమ శుంఠ గురువు పాత్ర తాల్చు.

### పండిత కవి

చాల నాళ్ల క్రితమె - కాల దోషము పట్టె,
పండిత కవు లింక పనికి రారు !
పరవశింప జేయు పద్య మొక్కటి చాలు
సరస ముక్తకమ్ము - చాటు కవిత.

### శాంతి

హెచ్చు సంఖ్య లోన - హింసా రిరంసువుల్;
ఉర్వి లోన తరచు ఉండ బోరు;
సగటు మానవుండు శాంతినే వాంఛించు;
మూయు ఒక తుపాకి వేయి నోళ్లు.

### అప్పు

గొప్ప నేర్పు గలిగి - అప్పు చేసెడి వాడు,
రాజ భోగి యగుచు బ్రదుక గలడు !
చతుర లలిత లౌక్య చాక చక్యమె ఉన్న
ధనిక వరుని తనకు దాసు చేయు.

### అవివేకి

అవని లోన గొప్ప అవివేకి యెవరయా ?
తరము నోరు విప్ప దలచు వాడు ;
మేటి జ్ఞాని యెవరు ? మిత భాషియే సుమా,
మెదడు లేని వాడు వదరు బోతు.

### ప్రకృతి పరిసరాలు

ప్రకృతి పరిధి యెంత ? పరిసరాలది యెంత ?
తీర్చి మనిషి బ్రదుకు దిద్దు టందు ?
వంశ గౌరవమ్ము వర్ధిష్ణువుల లోన,
మంచి తనము తరము పెంచ వచ్చు.

### కవి

గొప్ప కవిత కాక - గుర్తింప రానట్టి
దుండు మాయ మహిమ ఒకరి యందు ;
వర్తమాన మందు వర్ధిల్లి యశముతో
అభ్యుదయము లాత డందు కొనును.

### వింత బాటసారి

భ్రమల మధ్య - పెక్కు - వచ్చి బొంకుల మధ్య,
బ్రదుకు నిర్వహింప వలయు నరుడు ;
దిక్కు తోచకుండ తిరుగాడు మనుజుండు,
బ్రతుకు లోన వింత బాటసారి.

### నదులు

దరికి చేరినపుడు దాట వచ్చును నదుల్,
వెడల దగును బాట విడువ కుండ,
సేవ ముఖ్య మరయ సిద్ధాంతముల్ కావు ;
చర్చ గిర్చ వదలి సాగ వలయు.

మాట

మనసు దాచి పెట్టు కొనుటకే జగతిలో ;
మాటలాడు పెద్ద మనిషి - తరము,
మనసు వెల్లడింప మాటలాడును గదా
ఒక అమాయికాప్రయోజకుండు.

అనువంశిక ప్రతిభ

ప్రజ్ఞ సంక్రమించు - వంశానుసారమ్ము
శక్తి కలదు రక్త సారమునకు ;
అరయుటకును పూర్వ చరితానుశీలమునల్
ప్రజల ప్రోత్సహింప వచ్చు తరము.

క్షామం

విలయ తాండవమ్ము - సలిపె క్షామ పిశాచి,
భరత దేశ పూర్వ చరిత లోన,
క్షామ బాధ లేదు - స్వాతంత్ర్య యుగములో,
పేదవారి యెడల పేర్మి పెరిగె.

గురుశిష్యులు

బీజ సన్నిభుండు విద్యార్థి శిష్యుండు,
అతని హృదిని దాగి ప్రతిభ యుండు;
తొలకరి సమయమ్ము - దొడ్డ దేశిక స్వామి;
బీజ మంకురించి వృక్ష మగును.

బుద్ధ ప్రతిమ

శిల్పి - కొండ తొలిచి చెక్కె - బుద్ధుని మూర్తి!
కోరి అడవి మధ్య కోన లోన !
దిన దినాలు గడువ తిరునాళ్లు ఏటేట
జనులు కూర్చినారు జంతు బలులు.

ధనం

ద్రోగు చేయ యేండ్లు వూండ్లు పట్టును గాని,
ధనము వ్యయము చేయ క్షణము చాలు,
కూర్చి ధనము దాత - కుడి చేతితో నిచ్చు;
ఎడమ చేయి కూడ ఎరుగ కుండ.

గార్దభం

గార్దభమ్మ అయిన కప్పుచో పులితోలు ,
వచ్చు గడ్డి మేయ వచ్చు - తరచు,
కోర లూడి జూలు కోల్పోయి తిరుగాడ,
సంహరింప బడును సింహమైన.

అమ్మ

''పుడమి నేలు - అర్థ పురుషార్థమే సదా''
అంచు మార్క్సు ఋషి వచించినాడు ;
అమ్మ ప్రేమ ముందు రానూత్ర మేమౌను ?
వదల వచ్చు అర్థ వాంఛ నరుడు.

మందహాసం

చిందు నవ్వు లతడు నందనారామాన,
వెన్నెల మిస మిసలు విరిసి నట్లు ;
మాటలేల ? మౌన మందహాసము చాలు,
కలల అలలు హృదుల కలవరించు.

కీర్తి

కీర్తి కవికి రాదు వర్తమానము నందు,
విలువ తెలియ ఉండ వలెను - వ్యవధి ;
కవిత తేలి ఈదు కాల సాగర మందు,
అమృత మస్తు ! శుభ చిరాయు రస్తు.

పండితుండు

చదు వటన్న వట్టి జ్ఞానార్జనము కాదు ;
పండి నట్టి గుండె యుండ వలెను,
జ్ఞాన యోగి యెవడు ? చాదస్తములు లేక
ప్రతిభ యున్న వృద్ధ పండితుండు.

విధి నిషేధాలు

విశ్వ మందు ఉండు విధి నిషేధము లెన్నొ !
సంఘ శాంతికి అవసరము లవ్వి ;
జయము పొంద వచ్చు సమయోచితమ్ముగా
మేటి తెలివి వాటి దాట గలుగు.

సౌందర్యం

సహృదయులకు సహజ సౌందర్య దిదృక్ష,
మానవులకు రస సమాధి కూర్చు,
మనసు లోని రుజలు మాన్పు మందులు లేవు,
ప్రకృతి రమ్యతా రిరంస తప్ప.

నిద్ర

అరయ నిద్ర పెంచు ఆయురారోగ్యముల్,
చేయు క్షాళనమ్ము చిత్త వృత్తి,
కడగి అవయవముల కలిగించు విశ్రాంతి,
తిండి కంటె మేలు తీర్చి కూర్చు.

ఆప్తుడు

ప్రేమలో అసూయ ద్వేషమ్ము మనసులో
అంతరాంతరాల అణగ వచ్చు,
సలుప లేరు కీడు - శత్రువుల్ సులువుగా
చేయు హాని తరచు ఆప్త వరుడు.

విద్య

పాత చింతకాయ పచ్చడే మన విద్య ;
కీలుము మన పురాణములకు పట్టె ;
విత్త మిపుడు చేయు వికటాట్టహాసమ్ము ;
కులము బూజు పట్టి క్రుళ్లి పోయె.

వయసు

పీట వేయ దగును - వృద్ధానుపూర్విగా,
పెద్ద లభిసరించు పేర్మి బాట,
సులువు సులువు వయసు తెలియుటే కవులలో,
కట్ట ప్రతిభ విలువ కష్ట తమము.

సమత

ఏది ఉచిత నీతి? యేది సభా మర్యాద ??
సమత - నవ సమాజ సాంత్వనమ్ము;
అతిథు లెల్ల గౌరవారాధ్యులే సదా;
తప్పు తారతమ్య తర్క చర్చ.

విద్య

చదువ వచ్చు - నీతి - స్మరణలో నిల్చునా ?
గాలి ధూళి లోన కలియ వచ్చు ;
మనసు లోన మిగిలి మరువ రానిది విద్య !
ప్రతిఫలించు ఆచరణము నందు.

వర్ధిష్ణువు

నేడు నెత్తి మీద - వాడి కొమ్ములు మొల్చి,
తిరుగు చున్న గడుసు ధీరు డతడు;
చూడ వలెను అతని శూరాగ్రగణ్యుగా !
ఇంక అతడు కుఱ్ఱ కుంక కాడు.

హేతువాది

పుడమి పుట్టువులకు - పుత్రేషణము మెండు,
మనుమ లన్న గూడ మమత యుండు;
బ్రదుకు తీర్చి దిద్దు రక్తానుబంధమ్ము;
హేతువాది ఎవడు ? పృథివి లోన.

సత్యం

కూరుమండ బోరు కొలువు కూటము లోన;
సింహ పీఠి మీద చేరి పవలు,
చాప శయ్య మీద సత్యమ్ము రేయెల్ల
బ్రదుకు బరువు మరచి నిదుర వోవు.

స్వాగతం

నన్ను మోసె కాళ్లు - నిన్న మొన్నటి దాక,
నడచి దూరములకు వెడలి నాడ,
ఇపుడు రెండు కాళ్ళు ఏ మోయు చున్నాడ;
భార మయ్యె కాళ్ల బరువు నాకు.

ప్రకృతి

ప్రకృతి దర్శనమ్ము రాసిక్య జనకమ్ము
అందు కొనుట ఎట్టు లాకసమ్ము ?
వేత్త మెదడు మేటి వింత లందున వింత;
జ్ఞాన యోగమునకు నా నమస్సు.

జ్ఞాని

మేలు చేయ లేవు కాల దోషము పట్టి,
తరచు పాత సంప్రదాయ విధులు,
జ్ఞాని కోరు కొనును - సంఘ సంస్కారమ్ము ;
వేయ దలచు క్రొత్త వెలుగు బాట.

జాలి కలుగు నాకు సానుభూతియు చేదు,
స్వేచ్ఛ లేదు మనిషి జీవితమున ;
మంచి వారె జగతి మనుజ లెల్లరు గూడ,
తప్పు చేయ వచ్చు తప్పనిసరి.

స్వస్తి

ప్రగతి కూర్చ వచ్చు - వాదోపవాదముల్
దేవు చర్చ లోకి దింప వద్దు ;
జగతి యెల్ల చూడ భగవంతు లీలయే !
శాంతి పాఠ మదియె స్వస్తి అదియె.

భక్తి

చేర్చ లేము - భక్తి - సిద్ధాంత పండితుల్ ;
చర్చ చేసి నవ రసాల పరిధి ;
భక్తి కేది ? స్థాయి భావమ్ము జగతిలో ?
బ్రదుకు లోన - భక్తి - రసము కాదు.

స్వగతం

నేను కవిని గాను - నేను వేదాంతినే,
వింగడింప దలదు విలువ లెల్ల ;
నేల నింగి తరచి - నిజము నన్వేషించి
వెల్లడించు వింత వెఱ్ఱి నాది.

స్వగతం

మించు భావయిత్రి మిరుమిట్లు సమకూర్చి,
పాత క్రొత్తలకును సేతు వగుచు;
అలతి అలతి ఆట వెలది పద్యాలతో,
తీర్చిదిద్ద దలతు తెలుగు కవిత.

పదవి

ఉండు తరము చిరుత ఉద్యోగమున యందు,
గొప్ప ప్రతిభ యుండి గూడ ఒకడు ;
అది విధి విలసనము - చదువు సంపద వేరు ;
ప్రజ్ఞ వేరు మేటి పదవి వేరు.

స్వగతం

పుస్తకాల వరుస పుట్ట గుట్టల తోడ,
కాగితాల మెట్ట నా గృహమ్ము !
గుర్తు పట్టరాని గుంపు గుంపుల చెట్లు !
గుండె యయ్యె చిన్న కోరుకొండ.

హెచ్చరిక

చాటి చెప్పినాను - జాగ్రత్త ! జాగ్రత్త !
ఖండ సత్యములను కవిత లంచు ;
సంస్కరింప దగును - సందర్భముల బట్టి,
మార్పు కూర్పు చేసి - తీర్పు మీది.

వక్త

మంచి పనులు చేయు మానవోత్తము చూడ
ఐదు పదిని చేసి అంజలింతు;
సభల ప్రజల ఊపు చతుర వక్తను చూడ,
డెంద మందు నవ్వుకొందు నేను.

నాస్తికులు

నిర్వహించు వారు - నిర్గుణోపాసకుల్
కలరు వారి నాస్తికు లన రాదు
చెప్ప వచ్చు విశ్వ సృష్టి శిల్పము చూడ
తెలియ నట్టి శక్తి కలదటంచు.

కట్టు కథలు

కల్పనా కథలకు - కాళ్లు చేతులు లేక,
  గ్రుడ్డి తనము చెవుడు గూడ ఉండు !
పోయి వచ్చు తరము - భూ ప్రదక్షిణ చేసి,
  పల్లకీల పైన ఫీవర్యటించి.

తైల ప్రదానం

నీవు పూని పోసినావు తైలము కొంత,
  ఆరకుండ ప్రమిద యందు కోరి ;
లోక మందు చిమ్మ చీకటుల్ పోకార్చు
  చిరుత ప్రమిద కొంత నీవు ఇంక.

వెన్నెల గుడి

కవిత కొరకు కోరి - కట్టు కొంటిమి గదా
  గుండె వెన్నెల గుడి గోపురములు;
ఆ రసానుభూతి - అజరామర విపద్య !
  స్వర్గమైన దాని సాటి రాదు.

కవిత

సాహితీ జగాన - జలపాతమా ? కాదు,
  పాత గిలిన మాతి లోతు గాదు ;
అచ్చు మైన కవిత అమృతమ్ము కురియుటచే ;
  మోడు గుండె చిగురు మోసు లెత్తె.

కలలు

పుట్టి పెరిగినాను - భూలోకమున గాని
  భూమి నా నివాస సీమ కాదు,
నేను చూడ లేదు నిజ జీవితంబెప్డు
  కలలు గంటి దివ్య కమన జగతి.

స్వగతం

ప్రజ్వరిల్ల చేయు ప్రమిద చిన్నది యైన;
వేల కొలది కాగడాల - వెలుగు !
వేల కొలది కాగడాలు నా శిష్యులే;
తెలుగు వెలుగునకు ప్రతీక లివుడు.

మౌనగీతి

మాట లాడు నట్టి పాట తీయని ఊట,
మాట తెరల మాటు పాట వేరు !
శ్రవణ పేయమైన - సంగీతమును మించు,
మనసు నలరజేయు మౌన గీతి.

దీప గృహము

పగిలి పోయినట్టి పాత అద్దము గాదు,
ప్రగతి దీప గృహము పద్య కవిత ;
తెలుగు పద్య కవిత ఇల చిరంజీవియై
వేయుగాక కడగి వెలుగు బాట.

ఆటవెలది

ఆట వెలది కుంటిదై లాస్య లయ లందు,
శ్రుతులు తప్పకుండ చూడ వలయు;
నాట్య జతులు శ్రుతులు - నాల్గు మాత్రల తోడ;
ఇంద్ర గణము వేయు నెడల తప్పు.

ఆశ - నిరాశ

అహము విడిచి ఒక నిరాశా ప్రవక్తగా,
యోజనలను సలుపు చుండ వలెను,
ఆచరింప దగును - ఆశానువాదిగా,
బాధ్యతాయుతముగ - పనులు చేసి.

### స్వగతం

విత్తు లెన్నొ ఏరి వెదజల్లితిని నేను;
మొలక లెత్త మెదడు పొలము లందు;
పద్య మల్లినాడ - విద్యుల్లతలు పేని;
తాండవింప వెలుగు తళుకు బెళుకు.

### సంధి

ఈ అనంత విశ్వ హేలా ప్రకర్షలో
మనిషి కడగి తెలిసి కొనెడి దెంత ?
అభ్యుదయము కొరకు అజ్ఞాన వరిధితో
జీవితమున సంధి చేసికొనుత.

### గొప్ప కవిత

దద్దరిల్ల మెదడు తరళ గర్జలు నింపు
శబ్ద ఘోష కాదు సరస కవిత ;
అలతి అలతి నుడులు తలపు వెన్నెల చింది,
గుండె కరుగ జేయు గొప్ప కవిత.

### వినయం

అహము పెచ్చు పెరుగు అజ్ఞాని మెదడులో
జ్ఞాన మిచ్చు వినయ సఖ్య విరతి;
వినయ మవసరమ్ము విద్యాంసులకు నెల్ల;
మనిషి సృష్టిలోన అణు సముండు.

### దర్పణం

మనసు కవిది కనుక మణి దర్పణమె గాని,
జిలుగు వెలుగు గాజు పలక కాదు,
బ్రదుకు లోని పెక్కు ప్రతిబింబములు చూపు;
ప్రతిఫలించు చూచు వారి మొగము.

నమ్మరాదు

మంచి దనము గౌరవించ జాలని వాని,
చెడుగు తెగడ లేమి బడుగు వాని,
మంచి చెడుగు వింగడింప కుండెడు వాని,
నమ్మరాదు వాని నమ్మరాదు.

నలుపు

నలుపు తోలె గాని నయనాంచలము లందు
నవ రస రుచిర మగు నవ్వు తోచు !
ఆమె మాట లందు ఆణి ముత్యాలలో
తళుకు బెళుకు జిలుగు తాండవించు.

మనసు

అనగ నవగ కోతి - అగ్గి గుండము ద్రొక్కె,
దయ్య మావహించె - త్రాగె కల్లు ;
మానవ మన సట్టి - మర్కటమ్మును బోలు ,
జ్ఞాని నిగ్రహించు - మానసమ్ము.

కరుణ

వ్రాయు కవి వరుండు తీయ తీయని పాట,
చేదు అనుభవాలు చేర్చి తీర్చి;
స్వాదు కవిత యేది జగదేక రస మేది ?
కంటి నీరు కార్చు కరుణ తప్ప.

స్వాగతం

వచ్చె ఎనుబ దేండ్లు పడిపోయె దంతాలు;
నేను మాటలాడ లేను సభల;
దేహ పాటవమ్ము దీప్తి పోయెను నాకు;
కలము మాత్ర మింక కదుప గలను.

### వదరుబోతు

వాడు వదరుబోతు - వట్టి పోరంబోకు ;
మాట లెల్ల కోట దాటి పోవు ;
తళుకు బెళుకు డాబు దర్పమ్ములే తప్ప ;
బండి సున్న వాని బ్రదుకు విలువ.

### వర్తమానం

బ్రదుకు లోన గడిచె - వత్సరమ్ములు పెక్కు ;
క్షణము క్షణము లట్లు - గతము నందు ;
మాన మొకటి వర్తమానమ్ములో నేడు ;
గడచు నట్టి వెరవు కాన రాదు.

### కుకవి

కరగు గుండె లేక - కవి కాడు బ్రదుకులో,
మేటి సుకవి కాడు మేధ యున్న ;
కవి వరుండు కాడు - కారెక్కి తిరుగుచో,
పడయ వచ్చు పెద్ద పదవి - కుకవి.

### మేడి పండు

బయట చూడ - మేడి పండు వాటమె సుమ్ము,
పొట్ట విప్పి చూడ పురుగులుండు !
కవివరుండు చెప్ప గలడు నీతులు పేర్చి,
క్రుళ్లి పోయి నట్టి - గుండె గలిగి.

### నృత్య నాటిక

కవనమునకు కలుగ గాన సాంగత్యమ్ము;
పసిడి కబ్బి నట్లె - పరిమళమ్ము ;
శ్రవ్య నాటక కవి - సంగీత సంచాలు
విలువ తెలిసి కొనిన కలుగు మేలు.

### పద్య కవిత

పద్య కవిత లోని స్వారస్య సూక్ష్మముల్
తర తరాల వారు తరచినారు ;
తరుగ నట్టి వెలుగు - స్థిర తటిత్తుల వోలె,
కూడె సహృదయులకు గుండె లందు.

### మాతృత్వం

ఆడదాని జన్మ హక్కు - మాతృత్వమ్ము ;
అనుభవైకవేద్య మా మధురిమ!
అమ్మ బిడ్డ మధ్య అనుబంధమును గాంచి,
పొందసూయ పురుష పుంగవుండు.

### బొంకు

బొంకు పలుకువాడు పొందు లాభము సున్న,
ఎచటొ అతుకు కానుపించు తుదకు ;
సంశయింప గలరు జనులు నమ్మగ లేరు,
అతడు నిజము చెప్పు నపుడు గూడ.

### జీవితం

నరుడు సాగవలెను నది వోలె ప్రవహించి,
దిద్దుకొనుట మేలు తీర్చి బ్రదుకు
మానవుండు పసరు కోనేరు కారాదు;
స్థిర సమాధి కాదు జీవితమ్ము.

### గురువు

వేత్త శిష్య వరుడు - విజ్ఞాన విజిగీష
జరుప వచ్చు పోరు గురువు తోడ,
తరిపి వెన్నెల సిరి పరివేషమును గూర్చు,
శిష్యు గెలుపు గురువు శిరము చుట్టు.

విశ్వ ప్రదక్షిణ

వింత లెన్ని గలవు విశ్వాంతరాళాన
ఉన్నవారు హృదయ మున్నవారు,
అంద చంద మెరుగు అక్షి యుగ్మమె యున్న
అరయ వచ్చు దిగ్ దిగంత మెల్ల.

నేత

చరిత చదువు నపుడు - సమయ సీమల గూడ,
కలుప వలెను నేత ఘనత తోడ,
నేత లేడు బాల్య నిద్రా దశలు లేక;
నేత విలువ చరిత - నిర్ణయించు.

మంచితనం

మంచిదనము లేక - మాయ మర్యాదతో,
ప్రొద్దు పుచ్చ వచ్చు బుద్ధి శాలి;
శూన్య కరము లూపి - శుష్క ప్రియాలతో,
చురుకు గడుసు దనము చూపరాదు.

హాస్యం

లోక మందు చూడ ఏకైక రస మేది ?
ఆంతర స్రవంతి హాస్యరసము;
లేదు ఏద్వ దగిన దేది ఈ బ్రదుకులో!
రమ్య హాస లోల ! రామకృష్ణ !

అవినీతి

''పరిహరింప లేము బ్రదుకులో అవినీతి,''
అంచు తలచు వార లవని హెచ్చు ;
చేత నైన వరకు నీతితో జీవింప
ధార్మికోత్తముండు తలప వచ్చు.

విప్రతిపత్తి

చేరి మనుజు దరికి - తేరి పారగ జూచు
బొంకు లెన్నొ మరియు శంక లెన్నొ !
విశ్వ మెల్ల చూడ వింత విప్రతిపత్తి ;
జ్ఞాన లేశ జీవి మానవుండు.

పసితనం

పిందె చెట్టు పైన - చిందులాడును గదా
వాడ వచ్చు పువ్వు - మాడ వచ్చు;
పసితనము పోవ - బ్రదుకులో పెను ముప్పు
గుండె కొంత బాల్య ముందు గాక.

మేలుకొలుపు

మేలు కొలుప వచ్చు - మేధావి నిదురింప,
కదిపి వేయ వచ్చు - కుదుప వచ్చు ;
మేలు కొనిన వాని మేలు కొల్పుట యెట్లు ?
కోరి కనులు మూసి కొనిన యెడల.

గోష్ఠి

నిగ్గు తేల్చ గలదు - స్నేహ. సాహస చర్చ,
స్వేచ్ఛ లేని యెడల - విద్య లేదు ;
భిన్న భావ గోష్ఠి - విద్యాలయాలలో,
అభ్యుదయము కొరకు అవసరమ్ము.

గాయకుడు

పద్యములను చదివి - ప్రతిపదార్థము విప్పి;
గొప్ప పండితుండు చెప్పు గాక;
చదువ గాయకుండు - జాగాలు విడదీసి,
రాగ సరలి కవిత రక్తి కట్టు.

అజ్ఞాత ప్రతిభ

కానరారు పైకి గాని - లోకము నందు
ఉండ వచ్చు ప్రతిభ ఉన్నవారు,
పుట్ట జేయ గలరు - భూకంపములు కొన్ని,
ఎదుటి వారి గుండె అదరి చెదర.

సేవ

దాన మిచ్చు నెడల - ధనము నార్జన చేసి,
త్యాగ యోగి - పరమ ధర్మ భోగి ;
అప్పు చేసి కనన యాగ దానము సల్ప,
వక్ర విక్రమార్క చక్రవర్తి.

శృంగారం

చేయ గలవు ఘోర శృంగార యుద్ధమ్ము
మగ చిలుకలు రెండు మగువ కొరకు,
ఆడ చిలుక తుదకు అరుగు వేడుక తోడ,
గెలచి నట్టి కోడె చిలుక తోడ.

శృంగారం

మగువ సాలె పురుగు ముగియ శృంగారమ్ము
చంపి తినును పుంజు సాలె పురుగు,
మరణ శిక్ష తరచు - మగ సాలె పురుగుకే
ప్రాణ సంకటమ్ము ప్రణయ కేళి.

అంతరాత్మ

నీతి ధర్మశాస్త్ర నియమాలు సర్వదా
ఇవ్వ లేవు పూర్ణ తృప్తి నెపుడు,
సంఘ జీవితమున సందిగ్ధ సమయాల
అంతరాత్మ నిర్ణయమ్ము మేలు.

### ఆరోగ్యం

చేరి దొంగిలించ నేర రారోగ్యమ్ము,
ఎవరు కూర్చ లేరు శాంతి హృదిని ;
అఖిల నరుల జన్మహక్కు - ఆరోగ్యమ్ము,
వ్యాధి చేర చెరచు బ్రదుకు నెల్ల.

### సన్మానం

చిత్త శుద్ధి తోడ - చిన్ని సన్మానమ్ము
సహృదయుండు చేయ చాలు- కవికి !
తన కవిత్వ మెవడొ - తన్మయత్వము తోడ,
సభల వచ్చి చదువ - చాలు చాలు.

### మనిషి

కవి వరుండు పేదవ కావచ్చు జగతిలో,
మొదట మనిషి యగుత బ్రదుకు నందు ;
చదువు మెదడు పదవి బ్రదుకులో వ్యర్థాలు ;
పండ కున్న మొదట గుండెకాయ.

### ప్రకృతి

ఆకు అలము అగును హస్తి కాహారమ్ము,
సింహమునకు మాంస చింత యేల ?
భావ్యమున కతీతి ప్రకృతి వైచిత్ర్యమ్ము !
అడుగ స్రష్ట కానబడడు మనకు.

### గురువు

గురువు జగతి లోన చిరజీవియే సదా
ఆత డొక పరంపరావృతుండు ;
వెలిగి దీప మౌచు వెలిగించు దీపముల్,
ప్రజ్వరిల్ల జ్యోతి - బ్రదుకు నందు.

### గతం

గతము - గతమె ! మార్చ గలవార లెవ్వారు ?
తీర్చ వచ్చు - భావి - తెలివి గలిగి,
వర్తమాన దృష్టి కర్తవ్యముల లెస్స !
మరువ దగును భూత చరిత వేగ.

### ముక్కు సూటి

పుట్ట. వచ్చు కుక్క మూతి పిందెలు కొన్ని,
అక్షరాల నీతి ఆచరింప ;
పట్టు విడుపు లుండ వలె జీవితములో !
ముక్కు సూటి బాట ముప్పు తెచ్చు.

### బ్రదుకు

నరుల జీవితమ్ము చెరసాలయే గదా,
కలవు శృంఖలాలు కానరావు,
గాను గెద్దు వోలె - కదలు చుండును గదా,
సంఘ జీవి నరుడు జగతి యందు.

### దేవుడు

చూచి నాడ నిన్ను శుద్ధ కైవల్యుగా !
నామ రూప రహిత భూమికునిగ,
శూన్య భావుకునిగ జ్యోతి స్వరూపుగా
నిర్వికల్ప శక్తి ధూర్వహునిగ.

### ముసలి అతిధి

వేడి నీరు తేనె - వెన్న - మందులు కోరు,
పండ్లు గిండ్లు నురుగు పడక కోరు;
తిండి లోన ఉండు తీరు తెన్నులు మెండు ;
మోయ లేని బరువు ముసలి అతిథి.

### వృద్ధ రోగి

సేవ చేయు వారు కావాలి పది మంది !
ఉన్న యెడల ఇంట ఒక్క రోగి,
చాల నాళ్ల బ్రతుకు సంతత వ్యాధితో !
వృద్ధ రోగి కాయు వెక్కు వుండు.

### కవిత

చెడని మురిప మేది ? జీవితమ్మున సదా,
మంచి కవిత మీది మమత తప్పు ?
నరులు హృదిని నిలిపి నందనోద్యానమ్ము
క్రోలవచ్చు సతము పూల తావి.

### ముసలి

కోరికలను పెంచుకోరాదు వృద్ధుండు,
దినము వెళ్లబుచ్చు కొనుట మేలు ;
వార్ధకమున పెక్కు వ్యాధు లుండుట కద్దు ;
మనసు నిగ్రహించు కొనుత ముసలి.

### అన్నం

కూర్చ నేల ? ఊక కొండంత దొడ్డిలో,
బిందెడైన చాలు బియ్య మైన,
మంచి కూరలున్న కంచెడన్నము చాలు,
పిండి వంట కడుపు నిండ చాలు.

### గురువు

నివురు గప్పి ప్రతిభ - నిదురింపగా శిష్యు,
గుర్తు పట్టి మేలు కొలుపు - గురువు !
ఒజ్జ కూర్చు ప్రాత రున్మేష శుభ శోభ,
సమ్య గాశు సుభగ సమయ మందు.

పరదూషణం

పరమ నీచ మేది ? పర దూషణము సుమ్మి,
తనను తాను పొగడు కొనుట కూడ,
నీను లొగ్గి ఎపుడు వినరాదు పరనింద,
కాదు మనిషి విషము గ్రక్కు పాము.

నటుడు

భావి కాల మందు జీవించు కవి నేత,
వస్తు లుండ వచ్చు - బ్రదుకు లోన,
మానవాళి కెల్ల - ఆనంద సంతృప్తి,
నాడె పంచి పెట్టె నటుడు బ్రదుకు.

నటుడు

కవిత వ్రాయ గలడు కవి ఒకే విధముగా,
వే విధాల నటుడు వింగడించు;
కవి వరుండు పడును కష్టాలు బ్రదుకులో;
నటుడు వర్తమాన నాయకుండు.

పర్యావరణము

గంగ కూడ నేడు - కాలుష్య మయ మయ్యె !
నేల నింగి మంచి గాలి లేదు !
బ్రదుకు తీర్చి దిద్ద - పర్యావరణ శుద్ధి ;
ధ్యేయ మగుత ప్రజల కింక మీద.

పాత గోరీలు

గొప్ప దనము పాత గోరీలు త్రవ్వుటా ?
క్రొత్త పొద్దు పొడుపు కోరుకొనుటె !
ఒప్పు కొనకు మొరులు చెప్పినట్టిది యెల్ల ;
ఎదురు తిరిగి అడుగు మెందు కనుచు.

### కార్యవాది

వెడలి వచ్చె కడగి వేగమే మహమూదు,
అరుగు దెంచకున్న గిరి తన దరి ;
ముందు పని జరుగుట ముఖ్యమ్ము బ్రదుకులో
పట్టుదలకు కార్య వాది పోడు.

### కవిత

మింట నాట్యమాడు మెరపు తీగయె గాని
కవిత నిడివి మీరు కడలి కాదు;
కవిత హృదిని చేరు కమ్మ తెమ్మెర గాని,
గాలి వాన ఘోష గర్జ కాదు.

### ఔషధాలు

జనులు వినుడు వినుడు - జాగ్రత్త ! జాగ్రత్త !
బహు పరాకు నేటి బ్రదుకు నందు,
మనుజులార వినుడు - పెను ప్రమాదము తెచ్చు,
వ్యాధి కంటె గూడ - ఔషధములు.

### పిడివాదం

తరచి చూడ దగును - తలపు పొంకము లెల్ల,
పట్టు విడుపు వలయు బ్రదుకు నందు
బింక మేల ? మొండి పిడి వాద మేలరా ?
మనిషి ఇచ్చి పుచ్చు కొనుట మేలు.

### అహంభావి

తిక్క శంకరాయి - టెక్కు చూపెడి వాడు,
అహము హృదిని ముదిరి నట్టి వాడు,
కవి నటించు తిరుగు గాక - కన్నులు మూసి,
ఆదరించ వచ్చు అతని జనము.

మనుజ దర్పణాలు

మనుజ దర్పణాలు మన చుట్టు ఉంటాయి
ప్రతిఫలించి చూప వచ్చు మనల ;
మనుజ దర్పణాలు మన మనస్సును గూడ,
ప్రతిఫలించి చూప వచ్చు ప్రజకు.

పూర్ణం

అరయ నరుల తెలివి - అణు మాత్రమైనదే,
స్పష్ట గణిత మయము సృష్టి యెల్ల;
పూర్ణము తొలగింప - పూర్ణమ్ములో నుండి
సృష్టి లోన పూర్ణమే మిగులును.

స్వేచ్ఛ

పరిసరాల మహిమ - ప్రసరించు మనుజుపై !
స్వేచ్ఛ చేరి యుండు చిత్త మందు,
బుద్ధు డయ్యె అల్ల సిద్ధార్థ యువరాజు;
జిడ్డు కృష్ణ మూర్తి స్వేచ్ఛ వడిసె.

నిద్ర

నిదుర కంటె లేదు నిజమైన వైద్యమ్ము !
మందు లేవి వ్యాధి మాన్ప లేవు;
నిదుర రాత్రు లందు మొదటి కర్తవ్యమ్ము;
నిదుర వాళ్ళ రేయి వదల రాదు.

స్వగతం

స్వానుభవము వీడి - ఆఙ్గ్లమూలము నేది,
తెలుగు లోని కేసు దింపలేదు ;
తెలుగు వెలుగు తీరు తీయాల మిలమిలల్,
పద్య విద్య పొందు పరచినాను.

చీకటి వెలుగులు

ఉండ వచ్చు ఒక్క గుండె చీకటి వెల్గు
లేక మగుచు పడుగు పేక వోలె,
పూర్ణ పాపి లేడు - పూర్ణ యోగియు లేడు
పాంచ భౌతిక ప్రపంచమందు.

భక్తి

పసిడి - మిన్న గాదు - పావనత్వము కన్న;
మిన్న గావు చదువు మెదడు గూడ,
తులసి దళము చాలు తూచె శ్రీకృష్ణునే !
భక్తి పూజ్యమైన శక్తి యుక్తి.

జ్ఞాని

ఏ చిరాకు లేక - ఏ పరాకును లేక;
ఉండు జ్ఞాని నిండు కుండ వోలె,
ప్రతిభ కేది గుర్తు ? మిత భాషణమె సుమ్మ;
స్వరము పెంచరాదు వాదమందు.

సమన్వయమ్ము

నరుని చేతి లోని నాణె మొక్కటె యైన,
ఉండు బొమ్మ బొరుసు రెండు కలిసి,
కానుపించు భిన్న ఖండ సత్యము లట్లు
అరసి తెలియ నగు సమన్వయమ్ము.

ప్రేమ

మార వచ్చు మైత్రి మర్యాద జగతిలో,
ఉండ వచ్చు మారకుండ ప్రేమ,
జనని ప్రేమ నిలుచు సంతానముల పైన,
మనుజు లందు వలపు మార వచ్చు

## గురువు గారు

దేశికుం డన మాంస దేహమాత్రుండు - కాడు ;
    విన్ను త్రోవ దోచు - వేల్పు విల్లు ;
కడగి పెట్ట వచ్చు - గిడిగిళ్లు శిష్యుండు,
    మన్ను మీద నిలిచి కన్ను లద్రువ.

## రక్త పాయి

కాదు ధర్మ బద్ధ కష్టార్జితము కాదు,
    హెచ్చు జీతమెవడు పుచ్చు కొనిన,
దొంగ - తిరుగ వచ్చు దొర వేషమును దాల్చి,
    బ్రదుకు మనుజ రక్త పాయి అగుచు.

## స్వేచ్ఛ

జనన మందు ముందె - జననీ జనకు లుంద్రు ;
    జాతి మతము భాష సంఘ ముండు ;
బ్రదు కటున్న తెలియ రానట్టి చెరసాల ;
    ఆలసించి స్వేచ్ఛ - అరుగు దెంచు.

## బ్రదుకు

గుండె నదిమి పట్టి - ఖండ సత్యాలతో,
    చెలిమి చేసి బ్రతుక వలయు మనిషి;
సంఘజీవి మనిషి - శైశవమ్మున నుండి;
    బహుళ సంప్రదాయ బద్ధు డతడు.

## విజ్ఞుడు

తనను గూర్చి పొగుడు కొనుచుం డహంభావి ;
    వదరు బోతు పలుకు పరుల తెగడి,
నిన్ను ప్రశ్న లడిగి నీ సమాధానముల్,
    వీను లొగ్గి వినును విజ్ఞ డొకడు.

### బ్రతుకు

మేటి భ్రాంతి - కలయె - మిథ్యయే జగమెల్ల;
నమ్మ నేల చాలు - నవ్వు కొనుట,
నలువ వద్దు - కీడు - సాటి వారికి నుంత;
నాటకమ్ము బ్రదుకు - బూటకమ్ము.

### సాయం

దూరమందు నిలిచి - దొడ్డ సూక్తులు వద్దు,
చేయ వచ్చు సేవ చేరి దరికి,
సానుభూతి మేలు సహజీవనము మేలు ;
ఎదుటి వారి కష్ట మెరుగ దగును.

### సమ్రపదాయం

కదలు సంతతమ్ము కానుపించదు గాని,
సంఘ సంప్రదాయ జయ రథమ్ము;
నేల మీద వెడలు నింగిపై విహరించు;
నీటి మీద ఈదు నిశ్చయముగ.

### దాత

ధరణి కొంత మంది దైవోపహతులైన,
ప్రతిభ యున్న బీద వారు కలరు;
తరచు దిద్దు దాత కరుణార్ద్ర హృదయమ్ము;
దైవ కృతము లైన తప్పిదములు.

### ముసలివాడు

తనకు తానె బరువు తన సంతతికి తథా;
బరువు ముసలి వాడు ధరణి కెల్ల,
పరుల కెపుడు తాను భారమ్ము కారాదు,
బ్రదుక దగును ముసలి వాడు తెలిసి.

### అవకాశాలు

అభ్యుదయము కలుగు అవకాశములు కల్గ;
వివిధ విద్య లెల్ల వెల్లి విరియు ;
సముచితమ్ము కాదు జాతీయ గర్వమ్ము ;
మనిషి జన్మ చేత - ఘనుడు గాడు.

### కాంత

ఆంతరంగిక మగు ఆత్మ ప్రదానమే !
కాంత బ్రదుకు లోన కలికి చర్య;
పాత్రు చేరి కూడి పడయు సంతానమ్ము;
రక్తి కట్టు సృష్టి ప్రగతి వచ్చు.

### శృంగారం

చిత్ర చిత్ర మైన - శృంగార రంగాలు,
గోచరించు ప్రాణి కోటు లందు;
ద్వంద్వ యుద్ధ మందు ప్రాణాలు పణ మొడ్డి,
వీర యుగళి తరచు పోరివారు.

### సృష్టి

పెద్ద చేవ తినును పిన్న చేపల నెల్ల ;
ఎవరు మార్చ గలరు సృష్టి నెల్ల ?
పుట్టె పుడమి మీద బుద్ధు డేమైనాడు ?
మట్టి లోన కలసి గిట్టె ఏసు.

### గులాబి

కొన్ని చెడు గుణములు గోచరింపగ వచ్చు,
గొప్పదనము సుంత కుంటు వడదు;
ముళ్లు లెన్ని యున్న మురిపమ్ము తగ్గునా ?
పూ గులాబి కోలుపోదు సొగసు.

ఆదరణము

ఆదరణమవసర మాహ్వాన సరళిలో,
సుంత చిన్న చూపు చూప రాదు,
పెద్దరికము కూర్చి - పిన్న వారిని కూడ,
పేర్మి కూర్మి గౌరవింప వలెను.

స్వేచ్ఛ

పేరు మనది మనము పెట్టుకున్నది గాదు !
ఊరగాయ మాయదారి మతము;
అరయ భాష సీమ యాదృచ్ఛిక చరిత్ర,
స్వేచ్ఛ యేది మనుజ జీవితమున ?

విజయం

విజయ మందు పతన బీజ సంతతు లుండు ;
గర్వి - జేత తరచు కాంచ లేడు;
అపజయమ్ము నందు - అభ్యున్నతికి మెట్లు;
గోచరింప వచ్చు కోవిదునకు.

సహృదయుడు

తప్పుం పట్ట వచ్చు - తల తిక్క రేకెత్తి ;
వ్యాకరణము ప్రాస యతుల నెవడొ !
సహృదయ వరుడగు రసజ్ఞుండు కవితలో,
మెరయు తలపు లరసి మెచ్చు కొనును.

కాలం

కడగి గొప్ప వారి కాలమ్ము గురి పెట్టి,
సహృదయుండు దాడి సలుపరాదు;
మేలు తెలుసు కొనిన కాలమూల్యము - వేత్త,
దూర నతులు భక్తి తోడ చాలు.

జోస్యం

రవి ఉదయమందు ప్రతిరోజు ప్రతిరోజు !
అస్తమించు సూర్యు డను దినమ్ము;
జరుగ వన్ని పనులు సతత జాగృతి తోడ
జాప్యమును మనుజులు సైప వలెను.

ప్రగతి

భూత వర్తమాన నీతి హేతువు కైత,
భావికాలమందు ప్రగతి వచ్చు.
ప్రగతి అనిన తెగని ధ్వంద్వ యుద్ధము కాదు
సంధి సామరస్య సాధనమ్ము.

ఏరువాక

రైతు కృషికి పూను గాత నాగలి పట్టి
ఏరువాక సమయ మరుగుదెంచ;
సమయమొక్క దినము జయ రసాయన మందు;
వేచియుండు తెలివి వేత్త కుండు.

వక్షోజములు

భార్య కనలు లేపు వక్షోజములు రెండు;
ఉసిరి కాయ లంత ఉబ్బు లేదు;
దబ్బకాయ లట్లు - గబ్బి గుబ్బలు రెండు,
అరయ వచ్చు భర్త ఉరమునందు

కలం

దొరతనమ్ము కూర్చు గొప్ప ఆయుధ మేది ?
గన్ను కన్న కూడ కలము మిన్న;
హస్త మందు గన్ను అప్పుడప్పుడు ప్రేలు,
కలము సంత తాగ్ని కారకమ్ము.

### తూకం

అరయ కవిత లోన సరితూక మున్నచో !
భావయిత్రి యందు భాష యందు;
ఒక సమైక్య మమరు ఉయ్యాల తూగుతో;
నిర్భర రస వీప్ప నివ్వటిల్లు

### భారతీయ భార్య

తరచు - భర్త తోడ - తాదాత్మ్యమును పూను,
భారతీయ భార్య - బ్రదుకు నందు;
వదలిపెట్టు సొంత వ్యక్తిత్వమును సదా
దీర్ఘ సహగమనము దీక్ష తాల్చి.

### కవిత

కవిత - చిత్రవస్తు గమకమ్ము యమకమ్ము,
గడుసు తళుకు బెళుకు పలుకు బడుల;
కొస మెరుపు మిల మిల - క్రొంగ్రొత్త మిస మిసల్
నవ నవ ప్రదర్శన ప్రభాస.

### అనుభవం

స్నేహ మందు గాని - శృంగారమున గాని,
ప్రణయ కోప లవము రక్తి కట్టు,
అర్థరి యగు గాక - ఇద్దరే యగు గాక
అమృత యోగ తుల్య మనుభవమ్ము.

### గొప్పదనం

ప్రతిభ - పైకి వచ్చు - పద్మ పుష్పము వోలె;
బురద నీటి లోన పుట్టి పెరిగి,
ప్రకృతి యోగలీల - వ్యక్తి నిష్ఠము సుమ్ము;
గొప్పదనము ఒకరి గుత్త కాదు

ముసలి కవి

అదిక మాట నెట్టు లాయురారోగ్యముల్,
ముసలి కవి వరునకు మురిప మేది ?
అందుకొనిన యెడల అభినందన స్తుతుల్;
ఆంజనేయు డగును అతడుబ్బి.

కవిత

సత్యమునకు సహజ సహజీవనచ్ఛాయ;
క్రాంత దర్శనమ్మ కవిత సుమ్మ !
కలిసి యున్న యెడల కవిత - వేదాంతమ్మ
కల్పవృక్ష మగును గ్రంథ మపుడు.

అంతరాత్మ

గడుప నేల ? మనిషి - గుడి లోన అరగంట ?
కొబ్బరులను పగుల గొట్ట నేల ?
ఆత్మ శోధనమ్మ - అర నిమేషము చాలు !
అరయ - అంతరాత్మ - పరమ గురువు.

ధనం

అరయ - ధనము గూడ - అగ్ని వంటిది గదా
కీడు చేయు - మేలు గూడ చేయు;
జగతి హితము కొరకు - ప్రగతి సంగ్రహముకై,
ప్రాజ్ఞ వరుడు ధనము వాడ వచ్చు.

దాత

ధన్యజీవి - దాత దరిజేరి మెప్పించు;
అతని మెప్పు పడయు ప్రతిభ చూసి,
దాత కంటె లేడు ధరణిలో దేవుండు;
ఘనుడు తల్లి తండ్రి కంటె - దాత.

జన సంఖ్య

సత్వరమ్ముగ పూని జనసంఖ్య తగ్గింప,
భరత దేశమునకు - ప్రగతి వచ్చు;
పెంచ లేము మితిని మించి వస్తూత్పత్తి,
తెలిసి కొనుత ప్రజలు వచ్చి నిజము.

ప్రలోభం

ఏ ప్రలోభ మైన - ఎదిరించి నిల్చువో,
కూర్చుకొనగ వచ్చు - గొప్ప తృప్తి;
అంత కంటె గొప్ప ఆనంద మొనగూడు;
లొంగి పోవు నెడ ప్రలోభమునకు.

దర

గతము గతమె - మార్చగలవార లెవ్వరు ?
తీర్చ వచ్చు భావి - తెలివి గలిగి;
వర్తమాన దృష్టి - కర్తవ్యముల లెన్న,
మరువ దగును భూత చరిత వేగ.

కవి

కర్మయోగి మిన్న - కవివరేణ్యుని కన్న;
చేత మేలు నీతి కూత కన్న;
ఒక ఉదాహరణగ - ఉపదేశముల కేమి ?
గడువ వలయు బ్రదుకు కవి వరుండు.

పెండ్లి కూతురు

కావలె నొక చిన్ని కారు - పెద్దది మేడ;
కూర్మి తెల్ల బొమ్మ కుక్క పిల్ల;
పేర్మిమై వరునకు పెద్ద ఉద్యోగమ్ము;
కోరు కొనును పెండ్లి కూతు రిపుడు !

కవిత

ఉత్తమోత్తమము బుగుజ్జ్వలోజ్జ్వలముగా;
వచన మందు ఉండవచ్చు - ''కవిత'';
పూత పసిడి మెరుగు పూన్చు ఛందము సదా;
ఎంచి చూడ భావయిత్రి - కవిత.

విద్య

ప్రజలు మెలగ గలరు క్రమ శిక్షణము తోడ;
స్వేచ్ఛ పడయ గలరు విద్య వలన;
చదువు -. గౌరవమ్ము సర్వత్ర సమకూర్చు;
విద్య లేని వాడు - వింత పశువు

శిష్యుడు

చిత్త శుద్ధి గలిగి - చిన్మయుండగు వ్యక్తి
శిష్యు డనెడి పేర - సేవ చేయు;
కలిసి పోవకుండ గాలిలో ధూళిలో;
గురుని గొప్పతనము కూర్మిఁ బ్రోచు.

కవిత

అక్షరాల- భాష- అవగాహనము కాదు;
భాష - అర్థ వాద పరమె సుమ్ము !
కవన రచన మన నిఘంటు పాండితి కాదు;
బ్రదికి యున్న నుడుల పదుగు పేక.

సరస కవిత పుట్టు సందర్భ శుద్ధిలో,
కలము త్రిప్పి నంత కవిత రాదు;
సహజ సుషమ తోడ సద్యః ప్రసన్నతల్
గొప్ప కవనమునకు గుర్తు సుమ్మ.

వీరుడు

పొంచి వేచి మాచి పోరాడు వీరుండు
పారిపోడు పిరికి పంద యౌచు;
పడడు శలభ మట్లు పావక జ్వాలలో
చావు - సంగరమున - జయము కాదు.

స్వగతం

పదవి యేది లేదు - కదల కున్నవి కాళ్లు,
వచ్చి ముసలితనము పడెను మీద,
విలువ యున్న గొప్ప విశ్రాంతి లభియించె;
కవిత వ్రాయ గలను కలలు గనుచు.

గురువు

మేలి విత్తనాలు మేటి బాటలు కావు,
ప్రగతి అనిన మేలి పౌర వరులు;
మేటి గురువు గారు మేటి పౌరుల తీర్చు,
ప్రగతి అవతరించు జగతి లోన.

జగతి సేవ

ప్రగతి శీలి - మూయ రాదు - ద్వారము లెల్ల;
బ్రదుకు లోన - మేటి మెదడు లోన;
తలుపు లెల్ల తెరచి తన మానసమ్ములో,
వేచి యుండ వలెను వెలుగు కొరకు.

ఖండ సత్యాలు

జగతి లోన ఖండ సత్యాలు వెదజల్లి
ఋషి మనీషి వరులు ఏగినారు;
దేశ కాల పాత్ర దృష్టితో సంధించి
సహృదయుండు నిత్య సత్య మరయు

పత్రికా విలేఖరి

పత్రికారచయిత పట్టించు కొన బోడు;
పదవి లోన లేని వాని పలుకు;
పలుపు దర్పమునకు స్వచ్ఛంద దాస్యమ్మ
ప్రగతి ప్రతిభ అవసరాలు కావు

విద్య

విలువ గట్ట - కారు - వేయి పూజారులే,
ఒక్క ఒజ్జ సమము ఉర్వి మీద.
చెదర గొట్టు - విద్య - చిమ్మ చీకటు లెల్ల;
వెల్లి విరియ చేసి వెలుగు - హృదుల.

చిత్త శుద్ధి యున్న - చేయలేనిది లేదు;
ప్రతిభ లేని గొప్ప వారు కలరు,
కలుగు జయము పట్టుదల యున్నచో - చాలు;
నిర్వహింప పనులు - నేర్పు పెరుగు.

దుఃఖం

అప్పు డపుడు వచ్చు అతిథి - ఆనందమ్ము,
తోడు నీడ పోలె దుఃఖ మమరు;
అతిథి దేవు నలుపు అర్చింప బ్రదుకులో
త్రోసి పుచ్చు టెట్లు దుఃఖ భరము ?

బౌద్ధం

పరమ కారుణికము బౌద్ధ వేదాంతమ్ము
పండ చేసె మనుజు గుండె దున్ని;
మానవ స్వభావ మర్మ రాసిక్యముల్;
మధురిమలను బౌద్ధ మతము మరచి.

భ్రమలు

సాహసింప వచ్చు సంప్రదాయము మార్చ,
క్రొత్త నీరు - ప్రగతి కోరు కొనును.
పరుగు లెత్త రాదు కోరని దయ్యము వెంట
బ్రదుకు వేట భ్రమల ఆటు పోటు

మూవనీరు

ప్రజలు - మూవనీరు ప్రతులు దాచుట కద్దు;
పారవేయ వచ్చు పత్రికలను;
ప్రజలు పెక్కుమంది ప్రకటనల్ పలుసార్లు
మూవనీరు లోన చూడ వచ్చు

యువకుడు

కడగి ముసలి తిరిగి కాలేడు యువకుండు
వ్యాధి మాన్ప జాల నౌషధములు;
పాత ఘన చరిత్ర ప్రతిభా పురస్కృతుల్,
కొంత మేర సుఖము కూర్ప వచ్చు.

నిద్ర

ఒక నిముష సమాధి - ఒక గంట నిద్రతో
మానవులకు సరి సమాన మగును;
యోగ రస సమాధి యోజింప బ్రదుకులో,
బొందె తోడ ముక్తి పొందఁ జేయు.

మౌనం

మనసు తేరు కొనదు - మౌన వ్రతము లేక;
సాధనా సమాధి శాంతి లేక;
ధైర్య సాహసములు - కార్య శూరత పెంచు,
మనుజు జీవితమున - మౌన నిష్ఠ.

గిమ్మికాలు

పూర్ణ సత్య మేది భూలోకమున లేదు,
బ్రదుకు - పెక్కు వింత భ్రమల పుట్ట;
మేలు చాలు చాలు ఆలోచనలు కొన్ని,
నమ్మకాలు వద్దు గిమ్మికాలు.

దిష్టి బొమ్మ

పెట్టఁ వచ్చు దిష్టి పిడత బొమ్మలు కొన్ని,
రైతు - కడగి - సస్య రక్ష కొరకు,
పదవు లందు రాజ్య పరిపాలనము నందు,
అరయ దిష్టి బొమ్మ లవసరమ్ము.

అంతరాత్మ

అంతరాత్మ మాట లాడు మౌనమ్ముగా,
వినబడదు చెవులకు - మనసు తెలియు;
అంతరాత్మ బోధ లాలకించుట మేలు,
ధర్మ మెరుగ ఎవరి తరము గాదు.

ఆస్తి

పుడమి అతని తోడ - పోటీ పడుట ఎట్లు ?
ఆస్తి యున్న వాడె - అధిక బలుడు;
మనుజ మాత్రు డెవడు - ధన శక్తి కెదురుగా,
తలను వాల్పకుండ నిలువ లేడు.

వికట నరకం

అతివ కోరి దరికి అభిసారికగ చేర,
స్వర్గ సుఖము నంత పడయ వచ్చు,
పడతి - నరుని మరల విడిపోవు సమయాన
వికట నరక మనుభవింప తరమె ?

### పెండ్లి మంత్రాలు

మంత్ర మందు కలదు మాహాత్మ్య గరిమమ్ము,
నాద బిందు కళలు నాట్యమాడు,
అడయ తృప్తి కలుగు అర్థమ్ము కాకున్న,
పెండ్లి మంత్రములను పేర్మి గలదు.

### కవిత

కవిత - కాదు కాదు కలియుగ ప్రతిబింబి;
అనని కవలి వెలుగు కవిత - అనిన;
మానవ హృది లోన మహనీయ మాధురుల్,
చిందు లాడు నట్లు చేయు - కవిత.

### వ్యాయామం

యౌవనమ్ము లోన - వ్యాయామ మొక కొంత,
అవసరమ్ము నరుల కప్పు డపుడు,
చేయ వలయు శ్రమను చెమట పట్టెడు రీతి,
నిదుర మొగము తోడ - మెదల రాదు.

### పెండ్లి

భవ్య మంత్ర విధులు - బాజా భజంత్రీలు
పేర్మి జరుగు గాత - పెండ్లి తంతు,
అక్షత లోన గూర్చు - అద్వైత సంసిద్ధి,
చపల బిందువులకు స్థైర్య మిచ్చి

### చదువు

కడగి వల్లె వేయ - గ్రంథాలయము నెల్ల,
వ్రాయ గలుగ వంద గ్రంథములను;
వేత్త కాదు - కాదు విద్యాధికుడు కాదు,
ప్రతిఫలించు చదువు బ్రదుకు-బ్రదుకు నందు.

### వ్యసనం

వ్యసన మందు - సచ్చిదానంద యోగమ్ము,
మంజు మాధురీ సమాధి కలదు:
సంభవించు కొంత సద్యః పర నివృత్తి,
కొలువ రాదు మనిషి గుండెకాయ.

### దానం

దాన మన - అభిమత ధన వస్తు మాత్రమా ?
భవ్య తృప్తి నిచ్చు దివ్య దీక్ష;
అంతరంగిక మగు అర్చ పూజాసక్తి
త్యాగ యోగ భోగ రాగ రక్తి.

### బ్రహ్మచర్యం

బ్రహ్మచర్య దీప్తి బ్రదుకులో గొప్పదే;
కట్టి నట్లె ఆనకట్ట నదికి,
పంపవలెను నీరు పంట కాల్వల లోకి,
దూర భూముల దరి చేరు నట్లు.

### ప్రౌఢ

వయసు మల్లె - వనిత లావణ్యమ్ము
సరస చాకచాక్య చతుర వాక్కు;
నయన యుగలి క్రాలు నవనవోన్మేషమ్ము,
కగ్గ లేదు సుంత తగ్గ లేదు

### అభ్యాగత సదస్యుడు

అరుగుదెంచె - సభకు - అధిక పాఠము వోలె,
అతని పేరు లేదు - అచ్చు లోన,
గ్రంథకర్త మీద గౌరవం బది హెచ్చె:
వచ్చె శోభ - అతని వలన - సభకు.

### పద్య పఠనం

హాస్యమునకు ఆత్మ - ఆనంద యోగమ్మ
ఏవగింపు కాదు హింస కాదు;
పరమ హంస యోగి - పరిహాస రసికుండు;
ఒక అజాత శాత్రవుండు సుమ్మ.

### పద్య పఠనం

పద్య పఠనమునకు - ప్రాణమ్మ భావమే;
గాన రాగ లయలు కలియు గాక
భావయిత్రి లోని - స్వారస్య వాహినుల్;
చేరు గాత హృదిని - చెవుల గాక.

### మెదడు

మేలు చేయ వచ్చు ఆలోచనము వీడి,
మనము చేసి నట్టి పనులు కొన్ని;
ప్రాణ నాడి క్రియల కాలోచనమె గదా;
మెదడు వాడ దగును బ్రదుకు నందు.

### నవల

వ్రాయు టున్న నవల పర ఘనో మథనమే;
తేల్చు ఈది మునిగి తేలి - నిజము:
నవల తరచి చరిత - నవనీతమును కూర్చు;
చరిత కంటె నవల సత్య తరము.

### కవిత

కవు లెరుగ దగును జగన్నాటకము లోని,
నవరస రుచిర ఘటన గతి జతులు.
వేత్త కాదు సుకవి వేదాంతి కానిచో,
మౌన గాన మధురిమమ్మ కవిత.

ప్రజాస్వామ్యం

రాజు లేడు గాని ప్రభువు లెందరు లేరు ?
సమత ఏది నేడు సంఘమందు ?
నామ మాత్రముగ మనది ప్రజాస్వామ్యమ్ము,
ధనము పెత్తనమ్ము తగ్గ లేదు.

మంత్రములు

మంత్రి మాటలాడు మనసు దాచుటకునై;
కడుపు లోని విషము కక్క బోడు;
కూర్చు పాత పాట - క్రొత్త రాగాలతో;
పాడుపు కళల కొన్ని ప్రోగు చేసి

తుమ్ము

అరయ - తుమ్మ టన్న - ఆరోగ్య చిహ్నామే ?
దేహ పటుతకును ప్రతీక సుమ్ము;
సామరస్యము కయి సంక్షోభ మీసత్తు,
ముఖము నందు మరియు ముక్కు నందు.

సంధి

వాదములకు మధ్య వారధుల్ నిర్మించి
ధరణి మీద బ్రదుక దలతు నేను,
సంధి శాంతి కంటె సామరస్యము కంటె,
ప్రగతి యేది మనుజ జగతి లోన ?

క్షమ

లేడు తప్పు లేని వాడు ధారుణి లోన !
ఎదిరి తప్పు నెప్పు డెంచ రాదు;
క్షమయె పరమ నీతి - సహనమే ధర్మమ్ము;
పుట్టు పాపి యోగి పుడమి లేరు.

### చిత్త శుద్ధి

అంతరాత్మ విలువ - అధ్యాత్మ వేత్తలే !
 బ్రదుకు లోన గుర్తు పట్టగలరు;
ప్రతిభ కన్న గూడ పావనత్వము మిన్న;
 సృష్టి మకుట మేది ? చిత్త శుద్ధి.

### సహనం

స్వ పర సౌఖ్య మిచ్చు సహనమ్ము జగతిలో;
 పూర్ణ సత్య మేది పుడమి లేదు;
పోర దగిన దేది ? భూలోకమున లేదు;
 బ్రదుక దగును పరుల బ్రతుక నిచ్చి.

### స్వగతం

కలదు - వాడి మెదడు - కలదార్ద్ర హృదయమ్ము;
 కదల లేని రెండు కాళ్లు కలవు !
కలదు భావయిత్రి - కాదు పాండిత్యమ్ము;
 కవిత వ్రాయు ముదురు కలము కలదు.

### కవిత

సృష్టి కూర్చు - కవిత - శాంతి పాఠము చోలె,
 పుడమి కవలి వెలుగు ఎడద లోన;
భావయిత్రి పలుకు - భౌమ్యావరణ దాటి;
 కోరి రోదసీ విహార యాత్ర.

### కవిత

కవిత అనిన ఏమి ? నవ నవోన్మేషమే
 ప్రతిభ - మించు తళుకు ప్రగతి పథము;
పాత పలుకుబడులు పాండితీ వ్యుత్పత్తి,
 కాదు కాదు కవిత కాదు కాదు.

### నలుపు

అసలు చూడ దగిన వాకార రేఖలా ?
వ్యక్తి నెంచు నపుడు బ్రదుకు నందు ?
పనులు చేయ గలుగు గుణ గణంబులు మేలు,
తెలుపు మంచి తనము నలుపు రంగు.

### వలపు

చేరు వయ్యే నేని - స్నేహ భావన తోడ,
రక్తి కట్టు వలపు బ్రదుకు నందు;
ప్రేమ కేవలమ్ము కామమ్ము కారాదు,
మైత్రి నెరపు దివ్య మధురిమములు.

### కవిత

అవతరించు గాత - అధిమానవుడు వేగ,
మర్త్యుట స్థితిగతి మరచి పోయి,
కవిత - అగుత జాతి కైవారములు దాటి,
విశ్వ మానవతకు వేగు చుక్క.

### ఆచారాలు

అవసరమ్ముఁ బట్టి ఆచారములు వచ్చు,
ఎవరు వాని నవహసింప రాదు;
ప్రగతి కోరి మార్చ దగు దురాచారముల్,
జగతి హితము కొరకు - సాహసమున.

### నేత

శాత్రవులు పలుకు అసత్యాల పలుమారు,
కోలు పోవు నేత కొంత కీర్తి;
పదవి కోలు పోవు ప్రత్యర్థులు నిజాలు,
చెప్పి నపుడు ఋజువు చేసి నపుడు.

దేశభక్తి

మేలు కాదు - నేడు కాల దోషము పట్టె,
వద్దు దేశభక్తి వద్దు వద్దు;
జాతి - రాష్ట్ర మాత్ర పరిహద్దులును వద్దు,
అవని ఏక రాజ్య మగుత - ఇంక.

బద్ధకం

ప్రతిభ కేది గొప్ప ప్రత్యక్ష చిహ్నమ్ము ?
బ్రతుకు లోన మేటి బద్ధకమ్ము;
నరుడు ప్రతిభ యున్న తిరుగాడు సోమరై
స్వార్థ లాభ దృష్టి వదలి పెట్టి.

తెలుగు పద్యం

తెనుగు పద్య శిల్పమున యతి ప్రాసముల్,
ఇంపు సొంపు హొయలు నింపు, హృదికి,
మంజుల రస ఝరులు - మరి అనుప్రాసముల్ !
చిందు దివ్య నాద బిందు కళలు.

కుంతి

ప్రౌఢ - కోరు కొనెడి - ప్రతిభా విశేషముల్,
ఒక్క పురుషు నందు ఉండ వెపుడు;
గొప్ప ఇంతి ఒక్క కుంతీ కుమారియే,
ఎంచ సాహితీ ప్రపంచ చరిత.

నాటకం

వస్తు శోభ -ఉచిత వాతావరణ దీప్తి,
వ్యంగ్య నీతి - గుప్త హాస్య రచన,
పాత్ర చిత్రణమ్ము - భాషణౌజ్జ్వల్యమ్ము;
కలియు గాత నాటకమ్ము నందు.

### కవి

ఎవడు స్వచ్ఛమైన కవి జీవితమ్ములో ??
పద్య రచన చేయు వాడు కాడు;
బ్రతుకు నెల్ల కప్పురంపు హారతి చేయు;
త్యాగ యోగ భోగ ధన్యజీవి.

### క్రియలు

మనుజ జగతి లోన - మౌన సుందరముగా.
క్రియలు చాటి చెప్పు హృదులు మెచ్చ,
గాలి ప్రోగు చేసి - గళమెత్తి అరవగా,
వదలు చిల్లు పడును - జనులు వినరు.

### కవిత

హేతు రహితమైన పాత పంచాంగమా ?
అతని ప్రజకు పుట్ట వచ్చు రోత,
కవిత అనిన ఏమి ? నవ నవోన్మేషమే,
మేలు కొలుపు మనుజు మెదడు నందు.

### హేతువాదం

మనిషి బ్రదుకు లోన - మార్పుల్ పెమ్మట గూడ,
తగ్గ లేదు మతము ధనము విలువ;
హేతువాదమునకు ఇంక ప్రాధాన్యమ్ము
కూర్చవలెను - ప్రగతి కొరకు - మనిషి.

### యధార్థత

నా మనోహరమ్ము - నీ ముగ్ధ చిత్తమ్ము;
నీ యధార్థ వాద నియమ నిష్ఠ,
నీదు సాహసమ్ము ఔదార్య పరివస్య;
అడ్డ దిడ్డ రంగు గ్రుడ్డి తనము

ఆవకాయ

కలదు పద్య మనిన తెలుగు వారికి ప్రీతి
ఆవకాయ మీద అట్లె ప్రేమ
కలియు ఆరు రుచు లుగాది పచ్చడి లోన !
రమ్య హాసలోల ! రామకృష్ణ.

ప్రేమ

గ్రుడ్డి దనుచు ప్రేమ - గుర్తించె జగ మెల్ల;
వింత లందు వింత - విశ్వమందు,
రాక్షసత్వ ముందు ప్రణయ వృత్తము లందు;
త్యాగ యోగ గరిమ తాండవించు.

అంతరార్థం

నవ రస రుచిరమ్ము - అవనిలో గల సృష్టి;
అంతరార్థ మెవ్వ డరయ గలడు ?
స్థితి గతులను బట్టి - సిద్ధాంతములు పుట్టు;
మంచి చెడులు గూడ మార వచ్చు.

ఆస్తి

అర్థ మేమ? ఆస్తి అనిన - సంఘములోన,
కాదు - కష్ట ఫలము కాదు కాదు;
దొంగ సొత్తు ! తాల్పు - దొరగారి వేషమ్ము !
మాయ దోపిడీకి మారు పేరు.

ముదిమి

ముదిరి నపుడు ముదిమి మది తప్పు బ్రదుకులో;
హేతువాద మంతరింపఁ జేసి,
యౌవనమున శ్రోత్రియత ఊడలను వేసి,
విస్తరించు ఉర్వి వేరు దన్ని.

గిడిగిళ్ళు

వాఙ్మయమ్ము నందు వాల్తేరు - ధ్రువతార;
విశ్వ యోజనా త్రివిక్రముందు;
గ్రీకు ఋషి వరులకు గిడిగిళ్ళు మనసార;
ఉపనిషత్తులకు మహోర్ఘ్య నతులు

పండితుండు

శాకినీ పిశాచ ఢాకినీ ప్రకరముల్
వేదములను వల్లె వేయ వచ్చు;
చెప్ప వచ్చు నీతి సిద్ధాంత పాఠముల్;
ప్రజల చేర దీసి పండితుండు.

స్వేచ్ఛ

గురువు గారి వద్ద గూడ - తాకట్టుగా
పెట్టరాదు మెదడు - పేర్మి కూర్మి;
ముచ్చట పొలుపొందు ముత్యాల గొడుగుగా
శిష్య స్వేచ్ఛ గురువి శిరము మీద

బాలభటులు

గగనమున విమాన మెగురుచుండగ గాంచి,
బాలభటులు రువ్వ వచ్చు రాళ్ళు!
నింగి నుండి కురియు నేలకు బాంబుల వాన,
బాల భటులు చావ వచ్చు - తుదకు.

స్వాగతం

ఏడు పొమ్మను వను - కాడు రమ్మని పిల్చు;
నేడు నేను ముసలివాడ నైతి;
ప్రతిదినమ్ము నేను పద్యాలు రచియింతు;
స్వానుభవము పొందు పరచి కొంత.

తెలుగు భాష

మాతృభాష యనెడి మమత మాత్రమె కాదు,
దేశ భాష లందు  తెలుగు లెస్స,
శబ్ద భావ సంధి సంశ్లేషక విభాష,
పాత క్రొత్త కలుపు సేతు రచన.

సహృదయుడు

కవిత చదువువాడు కవి కంటె శ్రేష్ఠుండు !
సాహితీ సహృదయ చక్రవర్తి;
కవిత తోడ కలిసి గాంధర్వ మధురిమల్,
కురియు గాత అమృత కుంభవృష్టి.

చొరవ

చిరు చిరు అడుగులనె ''చొరవ'' - వేయుట మేలు
అరుగ వలెను వేగ - అది తూచి;
ధూళి రేప రాదు త్రోవపై కారెక్కి,
నీతి గాదు పరుల నేత్ర హాని.

అచ్చ తెలుగు

తెలుగు సంస్కృత పదములు - రసాయనముగా
కానుపింప వలెను కవిత లోన,
విడిగ టంకపు పొడి పొడగట్టగా రాదు,
కృతక మచ్చ తెలుగు కేవలమ్ము.

శృంగారం

పొంగు వారి మీరు శృంగార రస లీల,
అనుభవజ్ఞు నందు అధిక మగును;
వయసు మళ్ళి వచ్చు వాంఛానురింఛోళి,
మోసు లెత్తు తిరిగి మోడు గూడ.

### దర్శనం

అభ్యుదయము కూర్చు ఔషధమ్ముల కంటె,
దాన ధర్మ మూర్తి దర్శనమ్ము,
మనుజ దేహ మందు మానసోల్లాసమ్ము,
ఆది పీఠి - స్వాస్థ్య హర్మ్యమునకు.

### హారతి

స్వస్తి - జనుల కెల్ల ! స్వస్తి దిక్కుల కెల్ల,
అమృత శాంతి పాత హారతి ఇది;
కనుల కద్దు కొనుడు - కర్పూర ధూపమ్ము,
అంతరంగ దివ్య శాంతి - స్వస్తి.

### కవిత

విప్ప రాదు నోరు - వేడి తగ్గక ముందు,
వేయ రాదు కోప వేగ లేఖ,
కదుపు టున్న కలము - ముదురు చాదస్తమే !
పెద్ద దురద కవిత - పిచ్చి గుబులు.

### మాల్థస

ఉద్గమించు గద గుణోత్తర శ్రేణిలో
సంఘ మందు తరము జనుల సంఖ్య,
అంక పంక్తి సరణి అధికమౌ ఉత్పత్తి
సూత్ర ఫక్కి మాల్థస ప్రవచించె !

### విద్య

బోధ చేయు టనిన - పూని రెండవ సారి,
సలుపు టధ్యయనము చదువు లందు,
చెప్పు నెడల చదువు జిజ్ఞాసువుల చేర్చి,
గుండె చేరి హత్తు కొనును - విద్య.

### స్వగతం

పదవి లేదు నాకు - బలము లేవియు లేవు!
రక్తి కలదు కవన భక్తి కలదు;
కర్త కాను - సర్వ కార్యాలకును నేనె,
మసల గలను సాక్షి మాత్రుడ నయి.

### గుణ పక్షపాతం

స్వకులము స్వమతమును సంఘవిశ్వాసముల్
గుండె పిచ్చి మమత కూర్చు చుండు;
మనిషి కుండ వలెను - గుణ పక్ష పాతమే;
న్యాయ ధర్మ నిర్ణయైక దృష్టి.

### ప్రవాసనం

స్వీయ నిష్ఠ మైన ప్రేమ-కట్టదు రక్తి
తరము-ప్రవాసనముగ-పరిణమించు;
తాను చెప్పుకొనుట తప్పౌను తన గొప్ప;
జాగ రూకు లగుత-సభల కవులు.

### ఆహార్యం

అరయ-నటన కాదు ఆహార్య ధార్యమ్ము !
పూత పసిడి మకుట భూతి కాదు.
పొంగి పొరలు రాగ సంగీత ఝరి కాదు
సాత్త్వికానుభూతి సరణి - నటన.

### అర

అర అర జత చేయ అగునె పూర్ణాంకమ్ము ?
బ్రదుకు కోరు సామరస్య సిద్ధి;
''పొందు'' పొసగు - రెండు పూర్ణాంకములు చేర,
అరమరికలు లేక అతుకు కొనిన.

స్వార్థం

అవతరించు టెట్లు ? అధిక వస్తూత్పత్తి ?
సర్వ జనుల సుఖము సంఘ మందు!
మనిషి ఎందు కొరకు ? పనిచేయు కష్టించి
స్వార్థ లాభ లోభి - పగటు మనిషి.

జ్ఞానము

ప్రతిభ కేమి గాని పలుచోట్ల కన్పించు ?
మట్టి లోన ఉండు మణులు పెక్కు,
పరుల ప్రతిభ గాంచి పరవశించెడు జ్ఞాని
ఒక్క డున్న చాలు ఉర్వి మీద.

కృతజ్ఞత

వాడుకొనిన పిదప - వదలి వేసెడి నీతి,
వ్యావహారిక జగ మందు - కలదు;
బ్రతుకు తరచి మరి అరయ కృతజ్ఞత మిన్న,
మంచివాడు మేలు మరువ లేడు.

చప్పట్లు

సభ్య జనుల చేత - చప్పట్లు చరిపించు
శక్తి యున్న గొప్ప వక్త లరుదు;
చప్ప బడును సభలు - చప్పట్లు లేనిచో,
ఉన్న - నింగి నేల ఊగు కలిపి.

మందు

నిండియుండు - తరచు - ఖండ సత్యాలలో,
వైద్య శాస్త్ర విధులు - వసుధ లోన,
ధరణి లేదు-చావు తప్పింప గల మందు;
వైద్య మప్పు డపుడు వ్యాధి మాన్పు.

### ధర్మం

విలువ మిక్కుటమ్ము - వెల తక్కువే యైన,
నీతి ధర్మ యోగ నియతి నిష్ఠ;
ధర్మ మార్గ మనిన - ధనమూలకము కాదు,
ధర్మమునకు ఆత్మ - త్యాగ నిరతి.

### ఉపవాసం

తీరిక నిడ - మనుజ దేహమే స్వచికిత్స,
సహజ సిద్ధ సరణి సలుపు కొనును,
ఉర్వి లేదు -. వైద్యు డుపవాసమున కంటె;
మందు వాడ రాదు మనిషి తరచు.

### హాస్యం

ఆత్మనిష్ఠ మైన - అవహేళనము మేలు,
బ్రదుకు నందు హాస్యరసము నింపు,
తన ఉదార బుద్ధి - తరచు వెల్లడి యౌను,
ఎట్టి హాని జరుగ దెవరికైన.

### అంతరంగ సౌందర్యం

తెలివి తేట - ప్రతిభ - దేహ సౌందర్యమ్ము;
మోసగించు ప్రజల మొట్ట మొదట;
బ్రదుకు లోన - అంతరంగ సౌందర్యమ్ము,
ఉన్న యెడల - ఉజ్జ్వలోజ్జ్వలమ్ము.

స్వగతం

ఏదో లవ లేశము నా
మీద కలదు నమ్మకమ్ము మీకు - నతులు మీ
ఆదరమును నే చేతో
మోదముతో అనుభవించి ముగ్ధుడ నైతిన్.

యాదృచ్ఛికములు

మాయా బజారు గాథా
ప్రాయముగ జరుగుట కద్దు బ్రదుకున - ఏవో
వో యద్భుతమ్ము లపుడవు
డా యాదృచ్ఛికము లర్థ మగునా ? మనకున్.

స్వగతం

సంతత సమతా స్వేచ్ఛా
క్రాంతిని కోరెద నవతకు గతమునకున్ - నే
వంతెననై జగతిని ప్రవ
ర్తింతును వేగ ప్రగతి నిరీక్షా దీక్షన్.

భార్య

పూజింపుము భువి కల్పక
భూజము భార్యయు సతతము పూరించు గదా
భోజన సదుపాయములను
వ్యాజా వ్యాజము లగు బహు వాంఛల నెల్లన్.

చలి

ప్రజ లందున చలి తోడన్
గజ గజ గజ వణుకు వారు కలరీ జగతిన్ ;
గుజ గుజ కరిగెడు హృది ఆ
ప్రజపై చిరు దయను జూపు వారలు కలరా ?

సరదామాట

సరదాకై అను కొంటె పల్కుబడిలో స్వారస్యముం గాంచి ఆ
పరిహాసోక్తికి సంతసించవలె ఏ వ్యాఖ్యానముల్ చేయ న
క్కర లేదే - అది నవ్వు టాల కొరకే కావచ్చుగా అందు ఏ
పరమార్థంబును లేదటంచు కవియే వాక్రుచ్చు ప్రశ్నించినన్.

దానం

మానవ మాత్రు డౌ మనుజు మానసమందున జ్ఞానమున్నచో ;
మౌనము-జ్ఞాన పూర్ణ ఋషి మాన్యునకున్ పరి పూతమౌ అభి
జ్ఞానమున్ - ప్రపంచమున స్వార్థము వీడిన త్యాగ యోగమౌ
దానము - చేర్చు - మానవుని ధారుణి క్ష్వేలి వెల్గు వెల్లికిన్.

స్వగతం

గాడిద మోయ లేని పెను కబ్బపు కట్ట రచింప నాకు చే
యాడదు - భూమిపై యుగ యుగాంతరముల్ ప్రజ నాల్కలో సదా
ఆడెడి మంచి పద్య మొకటైనను చాలు-నిరక్షరాస్యులున్
పాడుచు ఆడగా గగురు పాటును చెందుత విన్నవారలున్

నీడల బోలు పద్యము లనేకములున్ రచియించి ఊరకే
పోడిమి లేని ఊక పెను ప్రోగులు దబ్బర పేడ మిద్దెలున్
మేడలు కూర్చుమున్ తెలివి మీరుట కంటె రసజ్ఞ నాల్కపై
ఆడెడి ముక్తకం బొకటి యైనను వ్రాసిన చాలు సత్కవీ.

# నండూరి రామ కృష్ణమాచార్య ఇతర రచనలు

| పద్య కావ్యాలు | వెల : రూ॥ |
|---|---|
| 1. తారాతోరణము | 50/- |
| 2. ఆలోచనము 600 పుటలు | 200/- |
| 3. కవితా సంహిత | 75/- |
| 4. ముత్యాల గొడుగు | 100/- |
| 5. మానస సరసి | 80/- |
| 6. కచ్ఛపీ కింకిణీకం | 80/- |
| 7. ప్రగతి గీత | 80/- |
| 8. తెలుగు పద్య శిల్పం – వచనం | 80/- |
| 9. కవిత్రయం – వచనం | 60/- |
| 10. శ్రీకృష్ణదేవరాయలు = భువనవిజయం నాటకం | 40/- |
| 11. ప్రాచీన దక్షిణ భారత చరిత్ర – వచనం | 20/- |
| 12. వాసవి కన్యక – నృత్య నాటిక | 30/- |
| 13. **RANDOM THOUGHTS by Dr. Jacob** (నండూరి వారి పద్యాలకు ఆంగ్లానువాదం) | 75/- |
| 14. నండూరి వారి పద్యాల హిందీ అనువాదం డా॥ మలయ శ్రీ | 30/- |
| 15. ఆత్మకూరి గోవిందాచార్య – ఉత్తర రామచరిత్ర | 25/- |

ప్రతులకు

**డా॥ నండూరి రామ కృష్ణమాచార్య సాహిత్య పీఠం**

420 పి.జి. రోడ్డు, జవాహరు నగరు, సికింద్రాబాదు – 500 003,

ఫోను : 7817397.